

నోబిడ్ అయిన పొగాకు బేళ్లను వెనక్కి తీసుకెళ్తున్న రైతులు (ఫైల్)

దక్షిణాది పొగాకు మార్కెట్ సంక్షోభం దిశగా పయనిస్తోంది. వేలం కేంద్రాలు ప్రారంభమై రెండు మాసాలైనప్పటికీ పండిన పంటలో 15శాతం కూడా వ్యాపారులు కొనుగోలు చేయలేదు. రోజువారీ కేంద్రాలకు రైతులు తెస్తున్న బేళ్లలో 20నుంచి 25శాతం తిరస్కరణలు (నోబిడ్) ఉంటున్నాయి. ఎక్స్‌పోర్టర్లు (ఎగుమతి కంపెనీలు) నామమాత్రంగా కొంటుండటం ఈ పరిస్థితికి కారణమైంది. పొగాకు వేలం ఆరంభం నుంచి వ్యాపారులు కూటమి కట్టి ధరలపై సీలింగ్ విధించి కొనుగోలు చేస్తున్నారు. తొలిరోజున గరిష్ఠ ధర కిలోకు రూ.280 ఇచ్చిన వారు నేటికీ అదే ధరను కొనసాగిస్తున్నారు. కనిష్ఠ ధరలు మాత్రం రూ.200కు పడిపోయాయి. కొనుగోళ్ల మందగమనంతోపాటు భారీగా నోబిడ్‌లు ఉంటుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

దక్షిణాది పొగాకు మార్కెట్‌లో ఆందోళనకర పరిస్థితి

సంక్షోభం దిశగా..



ఒంగోలులో పొగాకు కొనుగోళ్లను పరిశీలిస్తున్న మంత్రి స్వామి, ఎమ్మెల్యే బీఎన్ (ఫైల్)

- వేలం ప్రారంభించి రెండు మాసాలు.. 15శాతం లోపే కొనుగోళ్లు
- గరిష్ఠ ధరలపై వ్యాపారుల సీలింగ్
- కిలో రూ.280కి మించకుండా నియంత్రణ
- మీడియం, లోగ్రేడ్‌ల పట్ల విముఖత
- నిత్యం భారీగా నోబిడ్‌లు
- కొనుగోళ్లను తగ్గించిన ఎగుమతిదారులు
- ఆందోళన చెందుతున్న రైతులు
- నేడు బోర్డు అధికారులు, వ్యాపార, రైతు ప్రతినిధులతో మంత్రుల భేటీ

ఒంగోలు, మే 11 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో 2024-25 సంవత్సరానికి పొగాకు బోర్డు 160 మిలియన్ కిలోల పంట ఉత్పత్తికి అనుమతి ఇచ్చింది. అందులో దక్షిణాదిలోని 11 కేంద్రాల పరిధిలో 105 మిలియన్ కిలోలు పండించాల్సి ఉంది. అయితే గత మూడేళ్లుగా మార్కెట్ ఆశాజనకంగా ఉండటం, ఈ సీజన్‌లో వాతావరణం ఇతర పంటలకు అనుకూలించకపోవడంతో దక్షిణాది రైతులు విస్తారంగా పొగాకు సాగు చేశారు. ఫలితంగా పంట ఉత్పత్తి భారీగా పెరిగింది. సుమారు 161 మిలియన్ కిలోలు ఉత్పత్తి అయినట్లు బోర్డు అధికారులు అంచనా వేసి మార్చి 10న కొనుగోళ్లను ప్రారంభించారు. తొలుత ఒకింత హాట్‌హాట్‌గానే కొన్న వ్యాపారులు అనంతరం క్రమంగా తగ్గిస్తూ వస్తున్నారు. తొలిరోజు గరిష్ఠ ధర కిలోకు రూ.280 ఇచ్చిన వారు ఆతర్వాత కూటమి కట్టారు. సీలింగ్ పెట్టి అదే గరిష్ఠ ధరను కొనసాగిస్తూ కనిష్ఠ ధరలను మాత్రం తగ్గించి వేశారు. అదేసమయంలో వేలం కేంద్రాల వెలుపల పలుచోట్ల అక్రమ కొనుగోళ్లు చేస్తున్నారు.

రెండు నెలల్లో 24 మిలియన్ కిలోలు మాత్రమే కొనుగోలు

ప్రస్తుతం సీజన్ మార్కెట్‌లో ఇప్పటి వరకు సుమారు 24 మిలియన్ కిలోల పొగాకు మాత్రమే కొనుగోలు జరిగినట్లు అధికార వర్గాల సమాచారం. సగటున కిలోకు రూ.262 ధర లభించింది. ఆ ప్రకారం చూస్తే ఈ ఏడాది సగటు ధరలు గణనీయంగా తగ్గే అవకాశాలు కనిపిస్తున్నాయి. గతం కన్నా అన్ని రకాల ఉత్పత్తి ఖర్చులు భారీగా పెరిగిన నేపథ్యంలో ప్రస్తుత మార్కెట్ పరిస్థితి రైతులను ఆందోళనకు గురిచేస్తోంది. ఈ సమయంలో వ్యాపారులను, రైతులను సమన్వయం చేయడంలో పొగాకు బోర్డు అధికారులు విఫలమయ్యారు.

నేడు మంత్రుల ప్రత్యేక సమావేశం

పొగాకు మార్కెట్‌లో పరిస్థితిని గుర్తించి జిల్లాకు చెందిన మంత్రి డాక్టర్ స్వామి, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్ విజయకుమార్ పక్షం క్రితం ఒంగోలు-1 వేలం కేంద్రాన్ని సందర్శించి కొనుగోళ్లను పరిశీలించారు. నాలుగు రోజుల క్రితం ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ఒంగోలు-2 కేంద్రాన్ని సందర్శించారు. కలెక్టర్ అన్సారియా సైతం వేలం తీరును ప్రత్యక్షంగా చూశారు. ఇతర పార్టీల, రైతు సంఘాల నాయకులు వేలం కేంద్రాలను సందర్శించారు. ఈనేపథ్యంలో పొగాకు మార్కెట్‌పై అధికార టీడీపీ మరింత దృష్టి పెట్టింది. తదనుగుణంగా సోమవారం ఒంగోలులో మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, డాక్టర్ స్వామిలు ఈ అంశంపై సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం మూడు గంటలకు ప్రకాశం భవన్‌లో జరిగే సమావేశానికి బోర్డు అధికారు లు, వ్యాపార, రైతు ప్రతినిధులు హాజరు కానున్నారు. జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు పాల్గొననున్నారు.

మీడియం, లోగ్రేడ్‌లను కొనుగోలు చేయని వ్యాపారులు

వ్యాపారులు మీడియం, లోగ్రేడ్ పొగాకు వైపు కన్నెత్తి చూడటం లేదు. ప్రత్యేకించి ఎక్స్‌పోర్టర్లుగా ఉన్న కంపెనీల బయ్యర్లు కొనుగోళ్ల శాతాన్ని పూర్తిగా తగ్గించి వేశారు. సాధారణంగా రోజువారీ ఈ కంపెనీలు 25శాతంపైనే కొనుగోలు చేస్తుంటాయి. ప్రస్తుతం అందులో సగం కూడా కొనడం లేదు. చిన్న డీలర్లదీ అదే పరిస్థితి. ఇక ప్రధానమైన ఐటీసీ సాధారణంగా 35నుంచి 40శాతం బేళ్లను కొంటుంది. అలాంటిది ప్రస్తుతం 60శాతం వరకూ కొనుగోలు చేస్తున్నప్పటికీ ధరలను మాత్రం పెంచడం లేదు. ప్రత్యేకించి మీడియం, లోగ్రేడ్‌ల జోలికి వెళ్లడం లేదు. రోజువారీ వేలం కేంద్రాలకు వచ్చే బేళ్లలో ఈతరహా 50శాతం వరకూ ఉంటుండగా అందులో సగం నోబిడ్ అవుతున్నాయి. మేలు రకం బేళ్లకు మున్ముందు మంచి ధర లభిస్తుందన్న ఆశతో కోల్డ్‌స్టోరేజీల్లో పెట్టిన రైతులు.. ఇళ్ల వద్ద ఉన్న మీడియం, లోగ్రేడ్ బేళ్లను వేలానికి తెస్తూ వాటిని వ్యాపారులు కొనుగోలు చేయక వెనక్కి తీసుకెళ్తూ అవస్థ పడుతున్నారు.

ఇరువురు తహసీల్దార్‌ల బదిలీ

- ఇద్దరు డీటీలకు అడ్‌హక్ ఉద్యోగోన్నతులు
- మరో ఇద్దరికి పూర్తి అదనపు బాధ్యతలు

ఒంగోలు కలెక్టరేట్, మే 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఇద్దరు తహసీల్దార్లు బదిలీ అయ్యారు. ఇరువురు డీటీలకు తహసీల్దార్లుగా పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. మరో ఇద్దరు డీటీలకు అడ్‌హక్ ఉద్యోగోన్నతి కల్పించారు. ఈమేరకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తపట్నం తహసీల్దార్‌గా పనిచేస్తున్న పిన్నిక మధుసూదనరావును ఒంగోలు అర్బన్‌కు, ప్రస్తుతం ఆస్థానంలో పనిచేస్తున్న వాసును వెలిగండ్లకు బదిలీ చేశారు. గిద్దలూరు తహసీల్దార్ ఎం.అంజనేయరెడ్డి అనారోగ్యంతో సెలవు పెట్టడంతో అక్కడి డీటీకి పూర్తి అదనపు బాధ్యతలు అప్పగించారు. సీఎస్‌పురం డీటీకి అక్కడ తహసీల్దార్‌గా పూర్తి బాధ్యతలు అప్పగించారు. ఉమ్మడి జిల్లాలోని వలేటివారిపాలెం డిప్యూటీ తహసీల్దార్‌గా పనిచేస్తున్న ఎస్‌కే నాయబ్‌రసూల్‌ను ఒంగోలు రూరల్‌కు, ఒంగోలు రూరల్ డీటీగా పనిచేస్తున్న ఎస్.శ్రీనివాసరావును నెల్లూరు జిల్లా వలేటివారిపాలెం తహసీల్దార్‌గా నియమించారు.





నేటి నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ఒంగోలు విద్య, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలు సోమవారం నుంచి ప్రారంభవుతున్నాయి. అందుకు సంబంధించిన అన్ని ఏర్పాట్లను అధికారులు పూర్తి చేశారు. పరీక్షలకు ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 20,742 మంది హాజరువుతున్నారు. వీరికోసం 73 కేంద్రాలను ఏర్పాటు చేశారు. అందులో ప్రథమ సంవత్సరం విద్యార్థులకు 46, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు 27 ఉన్నాయి. ఉదయం 9గంటల నుంచి ఫస్టియర్, మధ్యాహ్నం 2.30నుంచి సెకండియర్ వారికి పరీక్షలు జరుగుతాయి. పరీక్ష ప్రారంభమైన తర్వాత నిమిషం లేటైనా విద్యార్థులను అనుమతించరు. అన్ని కేంద్రాల్లోనూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. సెల్‌ఫోన్లు, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతించరు. ఎండల తీవ్రత దృష్ట్యా ప్రతి కేంద్రంలో అత్యవసర మందులతో వైద్యారోగ్యశాఖ సిబ్బందిని నియమించారు. విద్యార్థులకు అన్ని వసతులను కల్పించారు.



దామచర్లకు కృతజ్ఞతలు తెలుపుతున్న సీతారామయ్య



కాశిరెడ్డికి కేక్ తినిపిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర

విధేయులకే మళ్లీ పట్టం

- పీడీసీసీ బ్యాంకు చైర్మన్‌గా డాక్టర్ సీతారామయ్య
- డీసీఎంఎస్‌కు కాశిరెడ్డి
- రియాజ్‌కు రాష్ట్ర కార్పొరేషన్ చైర్మన్ పదవి

(ఆంధ్రజ్యోతి, ఒంగోలు)

మలివిడత నామినేటెడ్ పదవుల భర్తీలోనూ పార్టీ విధేయులకే టీడీపీ అధిష్ఠానం పట్టం కట్టింది. జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) పర్సన్ ఇన్‌చార్జి (చైర్మన్)గా ఒంగోలుకు చెందిన ప్రముఖ వైద్యుడు డాక్టర్ కామేపల్లి సీతారామయ్యను ఖరారు చేసింది. జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ చైర్మన్‌గా కనిగిరి నియోజకవర్గానికి చెందిన శ్యామల కాశిరెడ్డి పేరును ప్రకటించింది. జనసేన పార్టీ జిల్లా అధ్యక్షుడు రియాజ్‌కు రాష్ట్ర కార్పొరేషన్ పదవిని కట్టబెట్టింది. తద్వారా ఒంగోలు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) చైర్మన్ పదవి టీడీపీకి ఖాయమన్న సంకేతాన్ని కూటమి పార్టీల అధిష్ఠానాలు ఇచ్చాయి.

ఆది నుంచి టీడీపీతోనే సీతారామయ్య

డాక్టర్‌గా సుపరిచితులైన సీతారామయ్య తెలుగుదేశం కుటుంబం నుంచి వచ్చి ఆపార్టీలోనే కొనసాగుతున్నారు. ఆయన తండ్రి దివంగత రమణారావు 1989లో టీడీపీ తరపున ఒంగోలు ఎమ్మెల్యేగా పోటీచేసి ఓడిపోయారు. సీతారామయ్య డాక్టర్‌గా గుర్తింపు పొందడంతోపాటు ఇండియన్ మెడికల్ అసోసియేషన్‌లో పలు పదవులు నిర్వహించారు. ఒంగోలులో లయన్స్ క్లబ్ ద్వారా సేవలందించారు. టీడీపీలో డాక్టర్స్ వింగ్‌కు నాయకత్వం వహించారు. గత టీడీపీ ప్రభుత్వంలో నాలుగేళ్లపాటు రిమ్స్ అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా వ్యవహరించారు. అనేక విపత్కర పరిస్థితుల్లోనూ టీడీపీలో కొనసాగడం, నాయకులందరితో సమన్వయంగా ఉండటం ఆయనకు కలిసొచ్చింది.

పార్టీలో కాశిరెడ్డి కీలకమే

కనిగిరి నియోజకవర్గం వెలిగండ్ల మండలానికి చెందిన శ్యామల కాశిరెడ్డి డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులయ్యారు. పారిశ్రామికవేత్త అయిన ఆయన కనిగిరి నియోజకవర్గంలో ప్రత్యేకించి తన సొంత మండలమైన వెలిగండ్లలో టీడీపీకి కీలక నేతగా ఉన్నారు. 2013లో టీడీపీలో చేరిన ఆయన 2014 ఎన్నికల్లో పనిచేయడమే గాక వైసీపీ ప్రభుత్వంలో టీడీపీ పక్షాన ముందుండి పనిచేశారు. వరుసగా మూడు అసెంబ్లీ ఎన్నికల్లోనూ టీడీపీ తరపున కీలకంగా వ్యవహరించారు. తనతండ్రి పేరుతో ట్రస్టును ఏర్పాటుచేసి నియోజకవర్గంలో విస్తృతంగా సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆయన పేరును ప్రతిపాదించారు.



పీడీసీసీబీ చైర్మన్‌గా నియమితులైన సీతారామయ్య



డీసీఎంఎస్ చైర్మన్‌గా నియమితులైన కాశిరెడ్డి



రాష్ట్ర పశుగణాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా నియమితులైన రియాజ్

జనసేన జిల్లా అధ్యక్షుడు రియాజ్‌కు రాష్ట్రస్థాయి పదవి దక్కింది. ఆంధ్రప్రదేశ్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ (పశుగణాభివృద్ధి సంస్థ) చైర్మన్‌గా నియమితులయ్యారు. నిజానికి ఒంగోలు ఎమ్మెల్యే జనార్దన్ సహకారంతో ఒంగోలు అర్బన్

రియాజ్ విషయంలో మారిన ప్రతిపాదన

డెవలప్‌మెంట్ అథారిటీ (ఒడా) చైర్మన్ పదవిని రియాజ్ ఆశించారు. ఎమ్మెల్యే జనార్దన్ ఆయన పేరునే సూచించారు. అయితే జిల్లాలో ఎక్కువ నియోజకవర్గాలతో సంబంధం ఉన్న ఆ పదవిని టీడీపీకే కేటాయించాలని ఆపార్టీ ప్రజాప్రతినిధులు అధిష్ఠానానికి సూచించారు. ఈ విషయంలో మంత్రి నారా లోకేష్ పరిశీలన అనంతరం ఒడా చైర్మన్ పదవిని టీడీపీ నేతకే ఇవ్వాలని జనసేన నాయకత్వంతో మాట్లాడినట్లు తెలిసింది. తదనుగుణంగా జనసేన నాయకత్వం రియాజ్ పార్టీకి చేసిన సేవలను గుర్తించి రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవికి ఎంపిక చేసింది. దీంతో ఒడా పదవిపై టీడీపీ నాయకుల మధ్య పోటీ పెరిగింది. అందిన సమాచారం మేరకు కాపు లేక దళిత సామాజిక వర్గాలకు చెందిన నేతల్లో ఒకరికి ఈ పదవిని కట్టబెట్టాలన్న ఆలోచనలో టీడీపీ అధిష్ఠానం ఉన్నట్లు తెలిసింది.

లక్ష్మికి శుభాకాంక్షల వెల్లువ

టీడీపీ దర్శి నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి పుట్టినరోజు వేడుకలు ఆదివారం అట్టహాసంగా జరిగాయి. అన్ని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్దఎత్తున దర్శికి తరలివచ్చి లక్ష్మికి శుభాకాంక్షలు చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయం వద్ద కోలాహలం నెలకొంది. పెద్దఎత్తున హాజరైన శ్రేణుల మధ్య ఆమె పుట్టినరోజు కేక్‌ను కట్ చేశారు. 7



దర్శిలో పుట్టినరోజు వేడుకల్లో మాట్లాడుతున్న డాక్టర్ లక్ష్మి

ఏడుగురు ఎంఈవోలకు నోటీసులు 7 'మీకోసం' రేపటికి వాయిదా



సమస్యలు అనేకం కావాలి ఉపశమనం!

- పశ్చిమంలో దాహం కేకలు
- రూ.21కోట్ల బిల్లులు పెండింగ్
- ఉపాధి పనుల్లో సాగని పంట కుంటల తవ్వకాలు
- రూ.131 కోట్ల మెటీరియల్ కోటా పనులకు నిలిచిన చెల్లింపులు
- హౌసింగ్, సూర్యఘర్ అమలు అంతంతమాత్రం
- పీజీఆర్ఎస్ పరిష్కారంపై ప్రజల్లో అసంతృప్తి
- నేడు డీఆర్సీ సమావేశం

జిల్లా ప్రజలు అనేక సమస్యలతో సతమతమవుతున్నారు. అన్నిప్రాంతాల్లోనూ తాగునీటి సమస్య తీవ్రరూపం దాల్చింది. అవసరమైన మేర నీటి సరఫరా జరక్కపోవడంతో ప్రజానీకం గగ్గోలు పెడుతోంది. రూ.21 కోట్ల బిల్లులు పెండింగ్ ఉండటంతో అధికారులు సమస్య ఉన్నా నీటి సరఫరా వైపు దృష్టి పెట్టడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజా వినతుల పరిష్కారం (పీజీఆర్ఎస్) విషయంలో యంత్రాంగం తీరుపై జనంలో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. వీటితోపాటు ఇతరత్రా అనేక సమస్యలను ఎదుర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో ఆరు నెలల తర్వాత జిల్లా సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశం సోమవారం నిర్వహిస్తున్నారు. పరిమితంగా ఐదు అంశాలను మాత్రమే అజెండాలో ఉంచారు. ప్రజాప్రతినిధులు వాటికే పరిమితం కాకుండా మిగిలిన ప్రధాన సమస్యలపైనా చర్చించి ఉపశమనం కలిగించే నిర్ణయాలు తీసుకోవాలని ప్రజానీకం కోరుతోంది.

ఒంగోలు, మే 11 (ఆంధ్రజ్యోతి) : అత్యంత కీలకమైన జిల్లా సమీక్షా మండలి (డీఆర్సీ) సమావేశం ఆరు నెలల తర్వాత సోమవారం జరగనుంది. స్థానిక ప్రకాశం భవనంలోని గ్రీవెన్స్ హాలులో ఉదయం 11గంటలకు జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధ్యక్షతన ప్రారంభమవుతుంది. అజెండాను పరిమితంగానే పెట్టారు. జిల్లాకు సంబంధించి ప్రస్తుత పరిస్థితి, ప్రభుత్వ ప్రాధాన్యతను క్రోడీకరించి ఐదు కీలక అంశాలను ఉంచారు. అందులో ఉపాధి హామీ పథకం, వేసవిలో గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సరఫరా.. హౌసింగ్, విద్యుత్‌శాఖ పరిధిలోని పీఎం సూర్యఘర్ పథకాలతోపాటు ప్రజావినతులు పరిష్కారం (పీజీఆర్ఎస్) అంశాలు ఉన్నాయి.

ముందుకు సాగని గృహ నిర్మాణాలు

గృహ నిర్మాణ విషయాన్ని పరిశీలిస్తే వచ్చే నెల 12న సామూహిక గృహ ప్రవేశాలకు ప్రభుత్వం నిర్ణయించింది. జిల్లాలో సుమారు 21వేల గృహ నిర్మాణాలు పూర్తి చేయాలని కూటమి ప్రభుత్వం వచ్చాక నిర్ణయించారు. అందులో వచ్చేనెల 12వతేదీన 8వేల గృహప్రవేశాలు లక్ష్యంగా నిర్ణయించగా సగం కూడా పూర్తి కాలేదు. విద్యుత్ రంగంలో సోలార్ విద్యుత్ వాడకం పెంపు కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం సూర్యఘర్ పథకం జిల్లాలో ముందుకు సాగడం లేదు. ఒక్కో నియోజకవర్గానికి 10వేల వంతున 80వేల కనెక్షన్లు లక్ష్యంగా నిర్దేశించడంతోపాటు భారీగా సబ్సిడీ ఇస్తున్నారు. అయినా కనీసం ఒక్క శాతం కూడా పురోగతి కనిపించడం లేదు. అజెండాకు సంబంధించి మరో కీలకమైన పీజీఆర్ఎస్ తీరు చూస్తే అర్జీల పరిష్కారం సంగతి ఎలా ఉన్నా ప్రజల్లో ఈవిషయంలో యంత్రాంగం తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అజెండాకు సంబంధించిన అంశాలే కాకుండా జిల్లాకు కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు, యూనివర్సిటీ, ట్రిపుల్ ఐటీ, మార్కాపురంలో మెడికల్ కాలేజీ నిర్మాణాలు, సాగర్ కాలువలు, ఇతర సాగునీటి వనరుల మరమ్మతు పనులతోపాటు ప్రభుత్వ పథకాల పురోగతిపై డీఆర్సీ సమావేశంలో చర్చించాల్సిన అవసరం ఉంది.

డ్వామాలో అవినీతిపరులపై చర్యలు కరువు

జిల్లాలో ఆయా పథకాల పురోగతి, ప్రజా సమస్యలను పరిశీలిస్తే.. ఉపాధి పథకం పనులు మమ్మరంగా జరుగుతున్నాయి. అయితే పథకంలో అత్యంత ప్రధానమైనదిగా ఉన్న పంట కుంటల తవ్వకాలు ముందుకు సాగడం లేదు. దాదాపు తొమ్మిదన్నర వేల కుంటల తవ్వకం లక్ష్యంకాగా ఇప్పటి వరకు కనీసం ఒక్క శాతం కూడా పూర్తి కాని పరిస్థితి నెలకొంది. నిబంధనలకు అనుగుణంగా కుంటల తవ్వకం కష్టతరంగా ఉండటంతో కూలీలు ఆ పనులకు పెద్దగా రావడం లేదు. దీంతో రైతులు కూడా ఆసక్తి చూపడం లేదు. ఇంకుడు గుంతలు, చెరువుల అభివృద్ధి పనులు ముందుకు సాగడం లేదు. గత ప్రభుత్వ కాలంలో డ్వామాలో జరిగిన అవినీతిని త్రిసభ్య కమిటీ నిగ్గు తేల్చడంతో పూర్వపు పీడీ శీనారెడ్డిపై కఠిన చర్యలకు కలెక్టర్ సిఫార్సు చేసి మూడు నెలలవుతున్నా ప్రభుత్వం నుంచి చర్యలు కరువయ్యాయి. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై కూడా అధికారులు తూతూమంత్ర చర్యలతో సరిపుచ్చారు. దీంతో ఉపాధి పథకం సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. ప్రస్తుత ప్రభుత్వం ఏర్పడిన కొత్తల్లో మెటీరియల్ కోటా కింద చేసిన పనులకు సంబంధించి బిల్లులు దాదాపు రూ.131 కోట్ల మేర పెండింగ్ ఉండటంతో ఆ పనులు చేసిన వారు గగ్గోలు పెడుతున్నారు.

తాగునీటి కోసం తల్లడిల్లుతున్న ప్రజలు

జిల్లాలో పల్లె, పట్టణం తేడా లేకుండా తాగునీటి కోసం ప్రజానీకం తల్లడిల్లిపోతోంది. పశ్చిమప్రాంత గ్రామాల్లో దాహం కేకలు వినిపిస్తున్నాయి. దాదాపు అన్ని పట్టణాల్లోనూ తాగునీటి సమస్య తీవ్రంగా ఉంది. పశ్చిమాన 10 మండలాల్లోని 73 ఆవాసాలకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. నిజానికి అంతకు రెట్టింపు గ్రామాల్లో సమస్య ఉంది. గతంలో నీటి సరఫరా చేసిన దానికి సంబంధించి రూ.21 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో అధికారులు సమస్య ఉన్నా నీటి సరఫరా వైపు దృష్టి పెట్టడం లేదని సమాచారం.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల డైరెక్టర్లు

తెలంగాణ ఈఏపీసెట్‌లో 'శ్రీసరస్వతి' సత్తా

ఒంగోలు విద్య, మే 11 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఈఏపీసెట్‌లో ఒంగోలులోని శ్రీసరస్వతి విద్యాసంస్థల విద్యార్థులు రాష్ట్రస్థాయిలో ఉత్తమ ర్యాంకులు సాధించి సత్తా చాటారు. సాధారణ విద్యార్థులు అసాధారణ ఫలితాలు సాధించారు. ఆర్.సుకుమార్‌సాయి రాష్ట్ర స్థాయిలో 577 ర్యాంకు సాధించి కళాశాలలో టాపర్‌గా నిలిచారు. కె.గుణశేఖర్‌రెడ్డి 592, కె.లోక్‌క్రిట్ 794, పి.సాహిత్య 1454, కె.రాధసారధి 1759, ఎస్.ఇంద్రసేనారెడ్డి 2671, ఆర్.సాయిమణికంఠరెడ్డి 2885 ర్యాంకు సాధించారు. అలాగే ఐదుగురు 2వేల లోపు ర్యాంకులు, 12 మంది 5వేలలోపు, 21 మంది 10వేల లోపు ర్యాంకులు పొందారు. ఈ సందర్భంగా స్థానిక కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు. ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేసిన అధ్యాపకులను, విద్యార్థులు, తల్లిదండ్రులను కొనియాడారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు ఎ.గణేష్‌రెడ్డి, ఎ.గంగాశంకరరెడ్డి, సీఈవో ఎన్‌వీ.సురేష్, డీన్‌లు, ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు పాల్గొన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు సత్కారం



క్రీడాకారులను సత్కరించిన అసోసియేషన్ నాయకులు

ఒంగోలు(రూరల్), మే11(ఆంధ్రజ్యోతి): ఒంగోలులోని హైదరీ క్లబ్‌లో ఆదివారం కబడ్డీ పోటీల్లో ప్రతిభ చాటిన క్రీడాకారులును జిల్లా కబడ్డీ అసోసియేషన్ నాయకులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు కుర్రా భాస్కరరావు మాట్లాడుతూ జిల్లా క్రీడాకారులు రాష్ట్ర స్థాయి బీచ్ కబడ్డీ పోటీల్లో ద్వితీయస్థానం, పులివెందలలో జరిగిన సబ్ జూనియర్ పోటీలలో ద్వితీయ స్థానం పొందడం అభినందనీయమన్నారు. అనంతరం క్రీడాకారులకు కిట్‌లను బహూకరించి సత్కరించారు. కార్యక్రమంలో అసోసియేషన్ చైర్మన్ ఎస్.చంద్రమోహన్‌రెడ్డి, కార్యదర్శి వై.పూర్ణచంద్ర రావు, ఉపాధ్యక్షుడు శిరిగిరి రంగారావు, వెంకటసురేష్‌బాబు, కోశాధికారి డి.రమేష్‌బాబు, పి.చంద్రశేఖరరెడ్డి, జాయింట్ సెక్రటరీ వై.చెన్నయ్య పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సంఘ అధ్యక్షుడిగా బాబు



ప్రమాణ స్వీకారంలో పాల్గొన్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్

ఒంగోలు(కల్చరల్), మే 11(ఆంధ్రజ్యోతి): జిల్లా విశ్వబ్రాహ్మణ సంఘ నూతన అధ్యక్షునిగా పీఎస్.బాబు ఆదివారం ప్రమాణ స్వీకారం చేశారు. ఒంగోలులోని గోల్డ్‌మర్చంట్స్ అసోసియేషన్‌లో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వబ్రాహ్మణ సంఘానికి తాను ఎప్పుడూ అండగా ఉండి సహాయ సహకారాలు అందజేస్తానని అన్నారు. పీఎస్.బాబుతో పాటు పలువురు కార్యవర్గ సభ్యుల చేత సంఘ రాష్ట్ర అధ్యక్షుడు చేవూరి రామస్వామి ప్రమాణ స్వీకారం చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ సభ్యులు, వివిధ మండలాల కమిటీ సభ్యులు, కీనల శ్రీనివాస్ ఆచారి, సుతారం శ్రీనివాసులు, గోనుగుంట బ్రహ్మేంద్ర కుమార్, గోనుగుంట బ్రహ్మానందశర్మ, నూతలపాటి శేషాశారి, ఆదిమూలం సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న పోలీస్ పికెట్

నాగులుప్పలపాడు, మే 11 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు గ్రామంలో వెలసిన వడ్డెరుల కులదైవం అంకమ్మతల్లి కొలుపుల నిర్వహణపై ఇటీవల కమిటీ సభ్యుల మధ్య శనివారం ఘర్షణ జరిగిన నేపథ్యంలో పోలీసులు పికెట్ ఏర్పాటు చేశారు. ఓ వర్గంపై మరో వర్గం వారు దాడి చేయడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో గ్రామంలో శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా రెండవరోజు ఆదివారం అంకమ్మతల్లి దేవాలయం వద్ద పోలీస్ పికెట్‌ను కొనసాగించినట్లు ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

ఒంగోలును అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా

- ఎమ్మెల్యే దామచర్ల
- నగరంలో రూ. 85లక్షల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు



డ్రైనేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ సుజాత

ఒంగోలు కార్పొరేషన్, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు ఇచ్చిన మాట ప్రకారం ఒంగోలు నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేసి రూపురేఖలు మారుస్తానని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక దక్షిణ బైపాస్ రోడ్ (పాతబైపాస్)లో ఎన్‌క్యాప్ నిధులతో సెంటర్ డివైడర్ పనులను, 46వ డివిజన్‌లోని అల్లూరి సీతారామరాజు కాలనీలో డ్రైన్ నిర్మాణ పనులు నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ నగర అభివృద్ధిలో రాజీపడకుండా అవసరమైన మౌలికవసతులు కల్పిస్తామన్నారు ఒకటవ సమ్మర్ స్టోరేజ్ ట్యాంకు వద్ద ఫుడ్ కోర్టు, పార్కు నిర్మాణం చేపట్టే విధంగా ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించినట్లు చెప్పారు. త్వరలోనే టెండర్లు పిలవనున్నట్లు తెలిపారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతలో రాజీ పడకుండా చేయాలని కాంట్రాక్టర్‌లకు ఆదేశించినట్లు చెప్పారు. 2014-19 సంవత్సరంలో ఒంగోలు నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నగర అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తామని పేర్కొన్నారు. ప్రాధాన్యత ప్రకారం, దశల వారీగా అభివృద్ధి చేసి మరో ఆరు నెలల్లో నగరాన్ని ఒక రూపునకు తీసుకువస్తామని, నిధుల సౌలభ్యతను బట్టి దశల వారీగా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే దామచర్ల స్పష్టం చేశారు. మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ నగర అభివృద్ధి కోసం చిత్తశుద్ధితో పనిచేస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధే ధ్యేయంగా ఎమ్మెల్యే ఆదేశాలతో అధికారులు, కార్పొరేటర్లు సమష్టిగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కమిషనర్ కె.వెంకటేశ్వరరావు, డీఈ అనిల్, పద్మజ, కాంట్రాక్టర్లు పోతంశెట్టి పవన్‌కుమార్, రమేష్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా మదర్స్ డే వేడుకలు



మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో కొవ్వొత్తుల ప్రదర్శన



లైన్‌టైనీ నెక్స్‌ప్లే స్కూల్‌లో మాతృమూర్తుల సందడి

ఒంగోలు(కల్చరల్), మే 11(ఆంధ్రజ్యోతి): మదర్స్ డే వేడుకలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన మురళీనాయక్, ఇంతియాజ్‌ల తల్లులకు అంకితం చేస్తూ ఒంగోలులోని మహిళాభ్యుదయ సమితి కార్యాలయంలో నిర్వహించారు. సమితి అధ్యక్షురాలు తేళ్ల అరుణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో మురళీనాయక్, ఇంతియాజ్‌లకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా నరసం రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సింహాద్రి జ్యోతిర్మయి రచించిన వీరమాతల అంకిత గీతాన్ని ఆమె ఆలపించారు. మాజీ ఎంపీపీ నాశం నరసమ్మ, మారేపల్లి సూర్యకుమారి, బీరం అరుణ తదితరులు ఉగ్రవాద వ్యతిరేక పోరాటంతో తమ కుమారులను కోల్పోయిన తల్లుల త్యాగాలను కొనియాడారు. ఇటువంటి వీరులను కన్న భారతమాత బిడ్డలుగా పుట్టటం ప్రతి ఒక్కరూ గర్వించదగిన విషయమని తేళ్ల అరుణ అన్నారు. కార్యక్రమంలో హరిశంకర్, ప్రభుకుమారి, గుంటుపల్లి శ్రీదేవి, చల్లా కనకదుర్గ, ఓ.మలాన్, పి.నాగేంద్రం, మహిళలు పాల్గొన్నారు.

స్థానిక సంతపేట 3వ లైన్ టైనీ నెక్స్ ప్లే స్కూల్‌లో మదర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్కూల్ చైర్మన్ తుమ్మల సుజిత శేఖర్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పలువురు మహిళలు, చిన్నారులు ప్రదర్శించిన ర్యాంప్ వాక్, క్యాట్ వాక్, నృత్యప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో స్కూల్ డైరెక్టర్ తుమ్మల చంద్రశేఖర్, యాదల హరికృష్ణ, తాటిపర్తి భానుప్రకాష్, సురేఖ, మహేశ్వరి, రజిత, రమణమ్మ, ప్రసన్న, నాగేంద్రం, ఆదిమ్మ, మార్తమ్మ, సుల్తానమ్మ, లేయా పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాలను విస్తృతం చేయాలి

- కమ్మవారి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మురళీకృష్ణ



సమావేశంలో మాట్లాడుతున్న మండవ మురళీకృష్ణ

ఒంగోలు(రూరల్), మే11(ఆంధ్రజ్యోతి): విద్య, వైద్య, ఉపాధి రంగాల్లో సేవలను విస్తృతంగా అందించేందుకు కృషి చేయాలని కమ్మవారి సేవాసంఘం జిల్లా అధ్యక్షుడు మండవ మురళీకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం ఒంగోలులోని బృందావన్‌ఫంక్షన్ హాలులో 1కె డోనర్స్ క్లబ్ సభ్యుల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన మురళీకృష్ణ మాట్లాడుతూ 1కె డోనర్స్ క్లబ్‌లో ఎక్కువ సంఖ్యలో సభ్యులను చేర్పించాలన్నారు. కమ్మకులంలో పేదలైన వారితో పాటుగా మిగతా కులాల వారికి అవసరమైన సేవలందించే బాధ్యత తీసుకోవాలని, అప్పుడే సేవలకు పరిపూర్ణత వస్తుందన్నారు. డాక్టర్ కామేపల్లి సీతారామయ్య మాట్లాడుతూ సేవా కార్యక్రమాల్లో తనవంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో బెల్లం కోటయ్య, కామని చినబాబు, భగిరధ కెమికల్స్ జీఎం లింగమనేని వెకంటరామయ్య, చిడిపోతు వెంకటేశ్వర్లు, పోతినేని శ్రీనివాసరావు, గోరంట్ల రవికుమార్, అలా హనుమంతరావు, కాట్రగడ్డ రఘుపతి, పాటిబండ్ల వెంకటేశ్వర్లు, రావుల పద్మజ, వీవీ.సుజాత, డాక్టర్ నామినేని కిరణ్, మన్నం శ్రీనివాస్, మండవ సుబ్బారావు, పావులూరి బాపయ్యచౌదరి, టీమ్ లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు.

రేపు 'పుస్తకానికి పట్టం కడదాం'



పోస్టర్ ఆవిష్కరణలో పాల్గొన్న ఉద్యమ బాధ్యులు

ఒంగోలు(కల్చరల్), మే 11(ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా మరో గ్రంథాలయ ఉద్యమంలో భాగంగా మంగళవారం సాయంత్రం 4 గంటల నుంచి స్థానిక ప్రకాశంభవన్ దగ్గర నుంచి పుస్తకానికి పట్టం కడదాం- పుస్తకాన్ని ఊరేగిద్దాం అనే కార్యక్రమం జరుగుతుందని మరో గ్రంథాలయ ఉద్యమ నేత మంచికంటి వెంకటేశ్వరరెడ్డి తెలిపారు. పలువురు దేశభక్తులు, ప్రముఖ రచయితల వేషధారణలు, మేళతాళాలతో విద్యార్థులతో ఈ ఊరేగింపు జరుగుతుందన్నారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను ఆదివారం ఒంగోలులోని మంచి పుస్తకం కార్యాలయం వద్ద ఆవిష్కరించారు. కార్యక్రమంలో మరో గ్రంథాలయ ఉద్యమ బాధ్యులు కాంతి నల్లూరి, చావలి సుధాకర్‌రావు, డాక్టర్ కొర్రపాటి సుధాకర్, డి.లక్ష్మీనారాయణ, పి.పేరయ్య, ఎఱ్ఱాశాస్త్రి, సీఏ.ప్రసాద్, అప్పారావు పాల్గొన్నారు. పుస్తకప్రియులు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని వారు కోరారు.

నేడు శ్రీహర్షిణి మహిళా ఇంజనీరింగ్ కళాశాల ప్రారంభం

మద్దిపాడు, మే11 (ఆంధ్రజ్యోతి): మద్దిపాడు మండలం ఏడుగుండ్లపాడు గ్రామ సమీపంలో శ్రీహర్షిణి జూనియర్ కళాశాల సముదాయంలో జిల్లాలో మొట్టమొదటిసారిగా మహిళా ఇంజనీరింగ్ కళాశాల సోమవారం ప్రారంభిస్తున్నట్లు ఆ కళాశాల చైర్మన్ గోరంట్ల రవికుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా మంత్రులు గొట్టిపాటి రవికుమార్, డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి, ఒంగోలు పార్లమెంటు సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి, ఒంగోలు శాసనసభ్యులు దామచర్ల జనార్దన్, సంతనూతలపాడు ఎమ్మెల్యే బీఎన్.విజయ్‌కుమార్, పర్చూరు ఎమ్మెల్యా ఏలూరు సాంబశివరావు, పలువురు ఇతర ప్రముఖులు హాజరవుతారని ఆయన పేర్కొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఉప్పుగుండూరులో కేక్ కట్‌చేస్తున్న పూర్వ విద్యార్థులు



మద్దిపాడులో కలిసిన పూర్వవిద్యార్థులు

నాగులుప్పలపాడు, మే 11 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000 ఏడాదిలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం గ్రామంలోని కమ్మవారి కళ్యాణమండపంలో నిర్వహించారు. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు కలుసుకొని ఆత్మీయంగా పలకరించుకొన్నారు. కుటుంబ సభ్యుల యోగక్షేమాలను అడిగి తెలుసుకొన్నారు. అనంతరం ఉత్సాహంగా కేక్ కట్ చేశారు.

మద్దిపాడులో..

మద్దిపాడు: స్థానిక కడియాల యానాదయ్య కళాశాలలో 1971-73 బ్యాచ్ పూర్వ విద్యార్థులు ఆదివారం ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు అలనాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. కొచ్చర్ల పోలురాజు మాట్లాడుతూ నాడు తమ బాల్యం, విద్యాభ్యాసం ఆటపాటలతో ఎంతో హుషారుగా జరిగిందన్నారు. కార్యక్రమంలో కటకం వెంకటేశ్వర్లు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

వెలిగండ్ల మండలానికి దక్కిన డీసీఎంఎస్ పదవి

వెలిగండ్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్‌గా మండలంలోని వెదుళ్ళచెరువుకు చెందిన టీడీపీ సీనియర్ నేత శ్యామల కాశిరెడ్డి నియమితులయ్యారు. గత 20 సంవత్సరాల నుంచి పార్టీకి అందించిన సేవలకుగాను డీసీఎంఎస్ చైర్మన్ పదవి దక్కింది. తనకు పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు.

నేడు చీమకుర్తిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

చీమకుర్తి,మే11(ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని చీమకుర్తి డీఏఈ మోహనరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉప్పలపాడు 220కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నిమిత్తం ఉదయం 9 నుంచి సాయంత్రం 6గంటల వరకు చీమకుర్తి పట్టణంతో పాటు పి.నాయుడపాలెం, పాటిమీదపాలెం, బండ్లమూడి, టి.గుడిపాడు, యర్రగుడిపాడు, మంచికలపాడు గ్రామాలకు చెందిన గృహ, గృహేతర, పారిశ్రామిక వినియోగదారులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థులకు కరాటేలో శిక్షణ

ఒంగోలు కలెక్టరేట్, మే 11 (ఆంధ్రజ్యోతి): కనీస రక్షణ కోసం కరాటే నేర్చుకోవాలని ట్రైనర్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. ప్రకాశం బాలోత్సవం, ఒంగోలు చిల్డ్రన్ క్లబ్ ఆధ్వర్యంలో స్థానిక ప్రజాసంఘాల కార్యాలయలో జరుగుతున్న సమ్మర్ క్యాంపులో ఆదివారం విద్యార్థులకు కరాటే శిక్షణ ఇచ్చారు. శారీరక దారుఢ్యంకోసం ప్రతిరోజు చేయాల్సిన వ్యాయామాలను, ఆరోగ్యసూత్రాలను సూచించారు. అనంతరం మెమరీ టెక్నిక్స్ తరగతులను అకృతి అకాడమీ ట్రైనర్ మహబూబ్ నేర్పించారు. కార్యక్రమంలో మ్యాజిక్ రామన్, వీరస్వామి, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

మాజీమంత్రి రజినీపై పోలీసుల దౌర్జన్యం హేయం

- వైసీపీ ఒంగోలు ఇన్‌చార్జి రవిబాబు

ఒంగోలు కలెక్టరేట్, మే 11 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి విడదల రజినీపై పోలీసులు దౌర్జన్యంగా వ్యవహరించడం దుర్మార్గంగా ఉందని వైసీపీ ఒంగోలు నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు ఆరోపించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశంలో యుద్ధ వాతావరణం నెలకొని ఉంటే చంద్రబాబు మాత్రం రాష్ట్రంలో ఆరాచకాలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈ విధానాలను ఉపసంహరించుకోకపోతే తగిన మూల్యం చెల్లించక తప్పదని ఆయన హెచ్చరించారు. ఎన్నికల ముందు అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాక విస్మరించారని ఆరోపించారు. కార్యక్రమంలో జిల్లా మహిళా అధ్యక్షురాలు దుంపా రవణమ్మ, బొట్లా సుబ్బారావు, సావిత్రి, పేరం ప్రసన్న, మేరి, వేముల శ్రీకాంత్, పీటర్ పాల్గొన్నారు.

శేషవాహనంపై వీరబ్రహ్మేంద్రస్వామి



శేషవాహనంపై స్వామివారు

నాగులుప్పలపాడు, మే 11 (ఆంధ్రజ్యోతి): నాగులుప్పలపాడు గ్రామంలోని శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామి వారికి శేషవాహనోత్సవం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి సుప్రభాత సేవ, ప్రత్యేక పూజలు చేశారు. రాత్రి భజన కార్యక్రమం జరిగింది. అనంతరం నరనంది సహిత శేషవాహనంపై వీరబ్రహ్మేంద్రస్వామి పుర వీధుల్లో విహరించారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. అలాగే నాగేంద్రస్వామికి పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

బస్సును ఢీకొన్న కారు.. ఒకరికి గాయాలు



కారు ఢీకొనడంతో దెబ్బతిన్న బస్సు

నాగులుప్పలపాడు, మే 11 (ఆంధ్రజ్యోతి): కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ట్రావెల్ బస్సును ఢీకొంది. దీంతో కారు నడుపుతున్న వ్యక్తి గాయపడ్డారు. ఈ సంఘటన మద్దిరాలపాడు వద్ద జాతీయ రహదారిపై జరిగింది. ఒంగోలు తాలూకా పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. మండల కేంద్రం వలేటివారిపాలెంకు వాసు ఆదివారం చీరాల నుంచి కారులో స్వగ్రామానికి వెళుతున్న క్రమంలో మద్దిరాలపాడు వద్ద భారత్‌పెంట్రోలు బంక్ వద్దకు రాగా అదుపుతప్పి ఎదురుగా వస్తున్న ట్రావెల్స్ పెళ్లి బస్సును ఢీకొంది. దీంతో వాసు గాయపడ్డారు. తాలూకా పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం 108వాహనంలో ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. కేసు నమోదు చేశారు.

వేణుగోపాలస్వామికి హనుమంత వాహన సేవ



హనుమంత వాహనంపై స్వామివారు

నాగులుప్పలపాడు, మే 11 (ఆంధ్రజ్యోతి): ఉప్పుగుండూరు గ్రామంలో వేంచేసిన శ్రీరుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాల స్వామి వార్ల కళ్యాణ బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం స్వామివారికి హనుమంత వాహన సేవ నిర్వహించారు. ఈవో పచ్చవ రామకృష్ణారావు, పూజారి దీవి శ్రీధర్‌బాబు పర్యవేక్షణలో స్వామివార్లను శ్రీరామ అవతారంలో అలంకరించి హనుమంత వాహనంపై విద్యుత్‌కాంతులతో గ్రామోత్సవం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను వితరణ చేశారు.

నిజాయితీకి నిలువుటద్దం నల్లూరి అంజయ్య



మాట్లాడుతున్న ప్రసాద్

మద్దిపాడు, మే11 (ఆంధ్రజ్యోతి): నీతికి, నిజాయితీకి నైతిక విలువలకు నల్లూరి అంజయ్య నిలువుటద్దమని రాష్ట్ర ప్రజా నాట్య మండలి గౌరవాధ్యక్షుడు నల్లూరి వెంకటేశ్వర్లు అన్నారు. శనివారం రాత్రి నల్లూరి అంజయ్య వర్ధంతి సభ మారెళ్లపాలెంలో గ్రామ సీపీఐ కార్యదర్శి నల్లూరు రామారావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నల్లూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంజయ్య రైతు కుటుంబంలో పుట్టి పేద ప్రజల కోసం, దళితుల అభివృద్ధికి తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. గ్రామంలో, ఒంగోలు తాలూకాలో కమ్యూనిస్టు పార్టీ నిర్మాణానికి, అంటరానితనానికి వ్యతిరేకంగా, గ్రామాల్లో పాఠశాలల ఏర్పాటుకు అంజయ్య కృషి చేశారని చెప్పారు. రాష్ట్ర రైతు సంఘ ప్రధాన కార్యదర్శి కేవీవీ.ప్రసాద్ మాట్లాడుతూ అంజయ్య ఆశయ సాధనకు పాటు పడాలని కోరారు. కార్యక్రమంలో ఎంసీ వెంకటేశ్వర్లు, ఉప్పుటూరు ప్రకాష్‌రావు, ట్రేడ్ యూనియన్ నాయకులు ఎస్‌డీ.సర్దార్, పావులూరి అంజయ్య, మన్నం హనుమంతరావు, గోగినేని వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.



మే నెల్లో ఎండ హోయ్!

మే నెలలో ఎండలు తీవ్రమయ్యాయి. సూరీడు సుర్రుమంటున్నాడు. ఆ భగభగల నుంచి రక్షణ పొందేందుకు ఒక్కొక్కరు ఒక్కో మార్గాన్ని ఎంచుకుంటున్నారు. విద్యార్థులు, యువకులు పర్యాటక ప్రాంతాలకు వెళుతున్నారు. ఎండల్లో ఆహ్లాదాన్ని పొందేందుకు కొందరు యువకులు ఆదివారం మద్దిపాడు మండలంలోని గుండ్లకమ్మ రిజర్వాయర్ వద్ద ఈత కొడుతూ నీళ్లలోనే సరదా ఆటలు ఆడుకున్నారు. జిల్లా నలుమూలల నుంచి సందర్శకులు వాహనాలతో ప్రాజెక్టు వద్దకు చేరి హుషారుగా గడిపారు.

నీళ్లలో ఆడుతూ..

బ్యారేజీ గట్టున వద్ద చిన్నారుల సెల్ఫీ

గుండ్లకమ్మ బ్యారేజీ నీటిలో ఈత కొడుతున్న యువకులు

తెలుగుకు వెలుగు పథం

- జిల్లాలో అనేక చోట్ల ఆయన విగ్రహాలు, ఆరాధనోత్సవాలు

నేడు అన్నమాచార్య జయంతి

అన్నమయ్య పదం



ఒంగోలు(కల్చరల్), మే 11(ఆంధ్రజ్యోతి): 'తెలుగు పదానికి జన్మదినం... ఇది జానపదానికి జ్ఞానపథం' అని అన్నమాచార్యుని గురించి ఒక చిత్ర గీతంలో చెప్పినట్లు సంగీత, సాహిత్య, భక్తిరంగాలలో అచ్చ తెలుగుకు పట్టం కట్టిన వాగ్గేయకారుడు తాళ్లపాక అన్నమాచార్యులు. 14వ శతాబ్దంలో వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున అవతరించిన అన్నమాచార్యులు వేంకటేశ్వర స్వామి సేవలో తరించి దాదాపు 32 వేల సంకీర్తనలను రచించారు. దీంతో ప్రతి సంవత్సరం వైశాఖ శుద్ధ పౌర్ణమి రోజున అన్నమాచార్య జయంతిని నిర్వహించటం పరిపాటి. త్యాగరాజ స్వామి, నారాయణతీర్థులు వంటి వాగ్గేయకారులు నడయాడిన మన జిల్లాలో అన్నమాచార్య సంకీర్తనలను గానం చేసే గాయనీగాయకులు అనేకమంది ఉన్నారు. ఒంగోలులో అన్నమాచార్యుల వారి విగ్రహాలను నెలకొల్పి పూజలు నిర్వహిస్తారు. అటువంటి అన్నమాచార్యుల వారి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు పలు సంస్థలు సన్నద్ధమైనాయి.

- అన్నమాచార్యుల వారి సంకీర్తనలు తెలుగు పదాలతో, గ్రామీణ మాండలికాలతో నిండి ఉండటంతో ప్రజలకు అత్యంత చేరువయ్యాయి. 'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే' వంటి సంకీర్తనలు ఆయన సామాజిక స్పృహను, కులవివక్ష పట్ల వ్యతిరేకతను తెలియజేస్తాయి. ఆయన శ్రీ వేంకటేశ్వర స్వామివారిని ఉద్దేశించి పాడిన అనేక జోలపాటలు నేటికీ ప్రతి తల్లి తన బిడ్డను నిద్రపుచ్చటానికి పాడుతుండటం విశేషం.
- ప్రసిద్ధమైన అన్నమాచార్య సంకీర్తనలు పాడటంలో మన జిల్లా వాసులు సైతం అనేకమంది గాయకులుగా, తిరుమల తిరుపతి దేవస్థాన విద్వాంసులుగా పేరు గడించారు. ఒంగోలుకు చెందిన లలిత కళా అకాడమి అధ్యక్షుడు డాక్టర్ సంతవేలూరి కోటేశ్వరరావు స్థానిక రంగారాయుడు చెరువు దగ్గర అన్నమాచార్యుల వారి విగ్రహాన్ని నెలకొల్పి ప్రతి సంవత్సరం ఆయన జయంతిని ఘనంగా నిర్వహిస్తుంటారు.
- అభిమానుల ద్వారా 'అన్నమయ్య' మురళిగా పిలవబడే ఒంగోలుకు చెందిన తితిదే గాయకుడు ఇనమనమెళ్లూరి మురళీకృష్ణ అన్నమయ్య సంగీత సాహిత్య సాంస్కృతిక సేవాసంస్థను ఏర్పాటుచేసి, స్థానిక సంతపేట సాయిబాబా మందిరంలో అన్నమాచార్యుల విగ్రహ ఏర్పాటులో ప్రముఖ పాత్ర పోషించారు.

20 అప్‌గ్రేడ్ హైస్కూళ్లకు

హెచ్‌ఎం పోస్టులు

ఒంగోలు విద్య, మే 11 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో పాఠశాలల పునర్ వ్యవస్థీకరణలో భాగంగా హైస్కూళ్లగా కొత్తగా అప్‌గ్రేడ్ అయిన 20 పాఠశాలలకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడు, స్కూలు అసిస్టెంట్ వ్యాయామ విద్య పోస్టులు మంజూరు కానున్నాయి. 117జీవో రద్దు అనంతరం జరుగుతున్న ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో భాగంగా 60 మంది కంటే ఎక్కువ మంది విద్యార్థులు 6,7,8 తరగతుల్లో ఉన్న ప్రాథమికోన్నత పాఠశాలలను హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేయమన్నారు. ఈ క్రమంలో ఉమ్మడి జిల్లాలో 82 యూపీ స్కూళ్లను హైస్కూళ్లగా అప్‌గ్రేడ్ చేశారు. ఈ పాఠశాలల్లో వచ్చే ఏడాది నుంచి 9వ తరగతి, ఆపై ఏడాది నుంచి 10వ తరగతి ప్రారంభం కానున్నాయి. హైస్కూళ్లలో 75 మందికంటే ఎక్కువ మంది విద్యార్థులున్న పాఠశాలలకు గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయుడు, వ్యాయామ విద్యహైస్కూలు అసిస్టెంట్ పోస్టు మంజూరు చేస్తామని ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో జిల్లాలో కొత్తగా అప్‌గ్రేడ్ అయిన హైస్కూళ్లలో 75 మంది కంటే ఎకక్కువ మంది విద్యార్థులు ఉండటంతో ఈ పాఠశాలలకు కొత్తగా పోస్టులు మంజూరయ్యాయి. మిగిలిన 62 అప్‌గ్రేడ్ హైస్కూళ్లలో 75 మందిలోపు విద్యార్థులు ఉండటంతో ఆ పాఠశాలలకు ఈ పోస్టులు మంజూరు కావడం లేదు.

● హెచ్‌ఎం పోస్టు మంజూరయ్యే స్కూళ్లు ఇవే

20 పాఠశాలలకు హెచ్‌ఎం పోస్టులు మంజూరు అవుతున్నాయి. బండివెలిగండ్ల, ఈస్ట్ వీరాయపాలెం, ఆరవవార్డుయాదవ బజారు, పొట్లూరు, అడవిరాజుపాలెం, కొండమూరు, బడుగులేరు, చాకిరాల, వెస్ట్ వీరాయపాలెం, చింతకుంట, కెల్లంపల్లి, చిమ్మరిబండ, చినదోర్నాల, అడుసుమల్లి, గానుగపెంట, వెల్లంపల్లి, ఆలగాయపాలెం, కటారివారిపాలెం, యర్రగొండపాలెం, ఎంపీయూపీ స్కూళ్లకు, ముప్పవరం, శీలంవారిపల్లి జడ్పీ హైస్కూళ్లకు కొత్తగా హెచ్‌ఎం పోస్టులు మంజూరు అవుతున్నాయి.

రేపు 'మీకోసం'

ఒంగోలు కలెక్టరేట్, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఒంగోలులోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే మీకోసం (ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక) మంగళవారం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం జిల్లా సమీక్షా సమావేశం (డీఆర్సీ) ఉన్నందున ఆరోజు నిర్వహించాల్సిన మీకోసంను మరుసటి రోజుకు వాయిదా వేసినట్లు చెప్పారు. ప్రజలందరూ ఈవిషయాన్ని గుర్తించాలని ఆమె కోరారు.



తహసీల్దార్లు, ఎంపీడీవోలతో సమీక్ష చేస్తున్న ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ సత్య

అధికారులతో దామచర్ల సత్య సమీక్ష

కొండపి, మే11 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఆరు మండలాల ఎంపీడీవోలు, తహసీల్దార్లతో ఏపీ మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య ఆదివారం సాయంత్రం ఒంగోలులోని తన కార్యాలయంలో రెవెన్యూ సమస్యలు, గ్రామాల్లో అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష చేశారు. ఈసందర్భంగా దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న రెవెన్యూ సమస్యలపై తహసీల్దార్లతో సుదీర్ఘ చర్చ చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కరించాలని, ఉన్నతాధికారులతో మాట్లాడాలని సత్య తహసీలార్లకు సూచించారు. ఎంపీడీవోలతో గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సీసీరోడ్లు, గ్రామాల్లో మౌలిక వసతులుపై చర్చించారు.

తప్పిన పెనుప్రమాదం



రోడ్డు పక్కన పడిన వాహనం

పొన్నలూరు, మే11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ముత్తరా సుపాలెం- మండల కార్యాలయాల మధ్య కందుకూరు- కనిగిరి రోడ్డులో ఆదివారం ఉదయం పెనుప్రమాదం తప్పింది. కందుకూరు నుంచి దాదాపు 30 మంది పొగాకు పచ్చాకు కూలీలు పైరెడ్డిపాలెంలో పొగాకు పనులకు బయలు దేరారు. ప్రమాదవశాత్తు వారు ప్రయాణిస్తున్న ఆటో అదుపుతప్పి రోడ్డు పక్కన పడిపోయింది. అయితే కూలీలందరూ రోడ్డు పక్కన పిచ్చిచెట్టులో పడటం, ఆటో దూరంగా తిరగబడటంతో పెనుప్రమాదం తప్పింది. కూలీలు ఎవరికీ స్వల్ప గాయాలు కూడా కాలేదని ప్రమాద ఘటనపై ఎస్సై అనుక్ తెలిపారు. వారందరూ కందుకూరు ఏరియా ప్రభుత్వ వైద్యశాలలో ప్రాథమిక చికిత్స చేయించుకుని ఇళ్లకు వెళ్లిపోయారు. పెనుప్రమాదం తప్పిపోవడంతో కూలీలు ఊపిరి పీల్చుకున్నారు.

బర్లీ పొగాకు రైతు ఆత్మహత్యాయత్నం

యద్దనపూడి/మార్టూరు, మే 11(ఆంధ్రజ్యోతి): యద్దనపూడి గ్రామానికి చెందిన రైతు కుప్పాల రామకృష్ణ పండించిన బర్లీ పొగాకును ఒక కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేస్తామని చెప్పడంతో కూలీల చేత చెక్కులను తయారు చేయించారు. తీరా కంపెనీ ప్రతినిధులు కొనుగోలు చేయబోమని చెప్పడంతో రైతు ఆదివారం ఇంటి ముందు పొగాకు బేళ్ల వద్ద పురుగుమందు డబ్బా పట్టుకొని ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కూలీలు, గ్రామస్థులు అడ్డుకున్నారు.

ఏడుగురు ఎంఈవోలకు నోటీసులు

ఒంగోలు విద్య, మే 11 (ఆంధ్రజ్యోతి) : పాఠశాలల పునర్వ్యవస్థీకరణ, ఉపాధ్యాయుల ఉద్యోగోన్నతులు, బదిలీలకు సంబంధించి ఖాళీలను నిర్ధారించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏడుగురు మండల విద్యాధికారులకు పాఠశాల విద్య గుంటూరు ఆర్‌జేడీ లింగేశ్వరరెడ్డి, డీఈవో కిరణ్‌కుమార్ షోకాజ్ నోటీసులు జారీ చేశారు. సీఎస్‌పురం మండలంలో రెండు యూపీ స్కూళ్లను ఎలిమెంటరీ పాఠశాలలుగా డౌన్‌గ్రేడ్ చేయడంతో ఆ పాఠశాలల ఎస్ఎంసీ, తల్లిదండ్రులు హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు యథాతథ స్థితి (స్టేటస్‌కో) కొనసాగించాలని ఆదేశించింది. ఈ విషయాన్ని ఉన్నతాధికారులకు తెలియజేయనందుకు అక్కడి ఎంఈవో-1,2లకు నోటీసులు ఇచ్చారు. టీచర్ల ఉద్యోగోన్నతులు, బదిలీలకు ఖాళీలను ఖరారు చేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఐదుగురు ఎంఈవోలకు డీఈవో కిరణ్‌కుమార్ నోటీసులు జారీ చేశారు. శనివారం ఉదయం నుంచి అర్ధరాత్రి రెండు గంటల వరకు ఖాళీలపై కసరత్తు జరిగింది. కంభం, ముండ్లమూరు ఎంఈవోలు-1,2, టంగుటూరు ఎంఈవో-1 ఖాళీల వివరాలు సమర్పించలేదు. దీంతో డీఈవో ఆగ్రహం వ్యక్తం చేశారు. అందరికంటే చివరగా కంభం, ముండ్లమూరు ఖాళీల వివరాలను ధ్రువీకరించారు.



ముండ్లమూరు: డాక్టర్ లక్ష్మికి జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతున్న మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, తదితరులు



దొనకొండ: పార్టీ కార్యాలయం వద్ద కేకు కట్‌చేసి వేడుకలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

ఘనంగా లక్ష్మి జన్మదిన వేడుకలు

దర్శి, మే 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి జన్మదిన వేడుకలను అభిమానులు ఆదివారం ఘనంగా నిర్వహించారు. అన్ని మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు అధికసంఖ్యలో దర్శికి తరలివచ్చారు. ఉదయం నర్సరావుపేటలోని వెంకటేశ్వరస్వామి గుడిలో డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు కుటుంబసభ్యులతో పూజలు నిర్వహించారు. అనంతరం సింగరకొండలోని ఆంజనేయస్వామి ఆలయంలో పూజలు చేశారు. అక్కడి నుంచి ముండ్లమూరు మండలంలో పలు కార్యక్రమాల్లో పాల్గొని దర్శికి చేరుకున్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో ఆమె పుట్టినరోజు కేకు కట్ చేశారు. పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. గడియార స్తంభం సెంటర్‌లో డాక్టర్ లక్ష్మికి అభిమానులు, కార్యకర్తలు భారీ బత్తాయి కాయల గజమాలను క్రేన్ ద్వారా వేసి సత్కరించారు. ఎన్టీఆర్, దివంగత మాజీ ఎ మ్మెల్యే నారపుశెట్టి శ్రీరాములు విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద కార్యకర్తలు, అభిమానులు ఏర్పాటుచేసిన భారీ కేకు కట్ చేశారు. మంత్రి నారా లోకేశ్ వాట్సప్ ద్వారా లక్ష్మికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే నారపుశెట్టి పాపారావు, దర్శి నగర పం చాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, వైస్‌చైర్మన్లు జి.స్టీవెన్, తలారి కోట య్య, ఏఎంసీ చైర్‌పర్సన్ దారం నాగవేణి, సుబ్బారావు దంపతులు, కడి యాల రమేష్, కె.చంద్రశేఖర్, యాదగిరి వాసు, పుల్లలచెరువు చిన్నా, నార పుశెట్టి మధు, తదితరులు పాల్గొన్నారు. డాక్టర్ లక్ష్మి జన్మదిన వేడుకలను చెరువుకొమ్ముపాలెం, పోతకమూరు, రాజంపల్లి, లంకోజనపల్లి, తదితర గ్రామాల్లో ఘనంగా నిర్వహించారు. పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమా ల్లో ఫణిదపు వెంకటరామయ్య, బొట్ల కోటేశ్వరరావు, దామా కృష్ణ, నెహమి యా, గొర్లపాటి మార్కు తదితరులు పాల్గొన్నారు.

దొనకొండలో.. దొనకొండ, మే 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి జన్మదిన వేడుకలను ఆదివారం దొనకొండలో ఘనంగా నిర్వహించారు. టీడీపీ మండల అధ్యక్షుడు నాగులపాటి శివకోటేశ్వ రరావు ఆధ్వ ర్యంలో పులిమి రమణాయాదవ్, పత్తి వెంకటేశ్వర్లు, కొత్తం రఘునా థరెడ్డి, వడ్లమూడి చెన్నయ్య, మోడి ఆంజనేయులు, వడ్లమూడి వెంకటే శ్వర్లు, దుగ్గెంపూడి చెంచయ్య, బండ్ల వెంకటనారాయణ, మన్నెం గాలయ్య, విప్పర్ల లక్ష్మీరావు, రూపినేని ఓబయ్య, కొమ్మతోటి సుబ్బారావు, పెమ్మసాని లక్ష్మీనారాయణ, శృంగారపు నాగసుబ్బారెడ్డి, పరుచూరి రామలిం గయ్య, తదితరులు ఎన్టీఆర్ విగ్రహం వద్ద భారీ కేకు కట్ చేసి అభిమా నులకు పంపిణీచేశారు.

స్థానిక టీడీపీ కార్యాలయం వద్ద వీరపనేని వెంకన్నచౌదరి, కామేపల్లి చెంచయ్య నేతృత్వంలో రాచగొర్ల వెంకటయ్య, వల్లపునేని వెంకటస్వామి, దు గ్గెంపూడి కోటేశ్వరరావు, సింగమనేని హనుమంతు, తోటా కోటేశ్వర రావు, షేక్ ముసామియా, విప్పర్ల శేషు, వైకే చౌదరి, సిరిగిరెడ్డి బాలిరెడ్డి, పిల్లి ఓబు లేరెడ్డి, పురుషోత్తం సత్యానందం, చీరాల యోహన్, తదితరుల ఆధ్వర్యంలో భారీ కేకు కట్‌చేశారు. మోడి వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు.



హాయినిచ్చె చెట్టు!

మండుతున్న ఎండలకు మనుషులే కాదు మూగజీవాలూ అల్లాడిపోతున్నాయి. ఎండవేడికి ఎక్కడా తాగునీరు దొరక్క బురద నీరు తాగి దాహార్తి తీర్చుకుంటున్నాయి. ఎక్కడ చెట్లు కనపడితే అక్కడ నీడలో సేదతీరుతున్నాయి. వెలిగండ్ల సమీపంలో మేతకు వచ్చిన గేదెలు ఎండ తీవ్రతతో చెట్టు నీడకు చేరిన సందర్భంగా తీసిన చిత్రమిది. - వెలిగండ్ల

చెరువుల అభివృద్ధికి ప్రతిపాదనలు


అర్ధవీడు మండలం తులారాం గేటు దుస్థితి


తక్కువ ఎత్తులో ఉన్న దొనకొండ ఆనకట్ట


కంభం చెరువు తూము నుంచి వృథాగా పోతున్న నీరు

ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చొరవతో మహర్దశ

కంభం, మే 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి చొరవతో నియోజకవర్గంలోని పలు చెరువులకు మహర్దశ పట్టింది. నియోజకవర్గంలో చెప్పుకోదగ్గ నదులు ఏవీ లేకపోవడంతో వ్యవసాయానికి ఈ ప్రాంత రైతులు చెరువులు, కుంటలపైనే ఆధారపడాల్సి వస్తున్నది. చెరువుల్లో నీరు ఉంటేనే భూ గర్భజల మట్టం పెరిగి బోర్లలో నీరు చేరి సాగు, తాగుకు నీరు వస్తుంది. కేవలం వర్షాధారంపైనే ఆధారపడి జీవిస్తున్న పశ్చిమ ప్రాంత ప్రజలు, రైతులకు అవసరమైన నీటి వనరులపై గత వైసీపీ పాలకులు తీవ్ర నిర్లక్ష్యం చూపారు. చెరువుల అభివృద్ధికి అరకొర నిధులు ఇవ్వడంతో పనులన్నీ పడకేశాయి. నియోజకవర్గంలోని చెరువులకు చిన్న చిన్న మరమ్మతులు సకాలంలో చేయకపోవడంతో ఏటా కురిసే వర్షం నీరు వృథాగా పోతుంది. దీంతో ఆయకట్టు సాగు రైతులకు నీరందక అవస్థలు పడుతున్నారు. తెలుగుదేశం ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి చెరువుల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడమే కాకుండా ప్రతిపాదనలు తయారు చేశారు. దీంతో వేసవికాలంలో చెరువులు బాగు చేసేందుకు ఇరిగేషన్ శాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. నీటి పారుదల శాఖ అధికారులు ఇటీవల చేయాల్సిన పనుల అంచనాలతో ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపారు. అర్ధవీడు మండలంలోని కాకర్ల చెరువు, దొనకొండ తులారాం కతువలకు రూ.2.84 కోట్లతో కట్టల అభివృద్ధితో పాటు ప్రస్తుతం ఉన్న ఆనకట్టల ఎత్తు పెంచేందుకు ప్రతిపాదనలు పంపారు. కంభం మండలంలోని యర్రబాలెం ఆనకట్టతోపాటు కాలువల మరమ్మతులకు, కంభం చెరువు కాలువల బాగుకు రూ.1.65 కోట్ల నిధులు అవసరమని ప్రతిపాదించారు. బేస్తవారపేట మండలంలోని మల్లాపురం, మోక్షగుండం కొత్త చెరువు మరమ్మతులకు రూ.2 కోట్లు అవసరం కాగా, 3 మండలాల పరిధిలో సుమారు రూ.6 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. దీనితోపాటు గతంలో అభివృద్ధి పనులు మంజూరైన పూసలపాడు, తురిమెళ్ల, బొల్లుపల్లి నాయిని, తిమ్మన్న చెరువుల పనులకు కేటాయించిన నిధులను గత వైసీపీ పాలనలో దారి మళ్లించారు. అప్పటి కాంట్రాక్టర్లు అరకొర పనులు చేసి వదిలివేశారు. అసంపూర్తిగా నిలిచిపోయిన ఈ చెరువులకు కూడా నిధులు మంజూరు చేసి పనులు పూర్తి చేయాలని రైతులు కోరుతున్నారు.

పర్యాటక కేంద్రంగా కంభం చెరువు మార్పుపై ప్రత్యేక దృష్టి

ఆసియా ఖండంలోనే 2వ అతిపెద్ద కంభం చెరువును పర్యాటక కేంద్రంగా చేయాలనే సంకల్పంతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్‌తో మాట్లాడారు. చెరువు అభివృద్ధి పనులకు, పర్యాటక కేంద్రంగా మార్చేందుకు ప్రత్యేక నిధులను విడుదల చేయాలని కోరారు. దీంతో సీఎం, డిప్యూటీ సీఎం స్పందించారు. ఆ మేరకు ఇటీవల జిల్లా నుంచి పర్యాటక కేంద్ర ప్రత్యేక అధికారి శరణ్య కంభం చెరువును పరిశీలించారు. కంభం చెరువు అభివృద్ధితో నియోజకవర్గంలోని చెరువులకు మహర్దశ పట్టనుందని ఈప్రాంత రైతులు, ప్రజలు ఆనందనం వ్యక్తం చేస్తున్నారు.

కంభం పశు వైద్యశాలకు ప్రభుత్వ అనుమతి లేదు

జిల్లా అధికారి బేబీరాణి

కంభం, మే 11 (ఆంధ్రజ్యోతి) : కంభం పట్టణంలో నిర్మించిన పశు వైద్యశాల నిరుపయోగంగా ఉందని ఆదివారం ఆంధ్రజ్యోతిలో కలో వచ్చిన వార్తపై జిల్లా అధికారి స్పందించారు. కంభం పంచాయతీ నిధులతో నిర్మించిన పశు వైద్యశాలకు ప్రభుత్వ అనుమతి లేదని పశుసంవర్ధక శాఖ జిల్లా అధికారి కే బేబీరాణి తెలిపారు. అక్కడ పశువైద్యుడిని నియమించేందుకు అవకాశం లేదన్నారు. నూతన పశు వైద్యశాల మంజూరు విషయం ప్రభుత్వ పరిధిలో ఉందని, అనుమతులు మంజూరైతే అవసరమైన గ్రామాలలో పశువైద్యశాలల కోసం ప్రతిపాదనలు పంపిస్తామని బేబీరాణి తెలిపారు.

భక్తిశ్రద్ధలతో నృసింహుని జయంతి

- కనులపండువగా గ్రామోత్సవం
- ప్రత్యేక పూజలు, అన్నదానాలు


ప్రత్యేక అలంకరణలో శ్రీలక్ష్మీనరసింహ స్వామి మూలవిరాట్


యోగానంద లక్ష్మీనరసింహ స్వామి మూలవిరాట్

మార్కాపురం వన్‌టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : కపిలగిరి యోగానంద లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో నరసింహ స్వామి జయంతి ఉత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. అర్చకులు శ్రీరంగం రామానుజాచార్యులు ధ్వజారోహణం నిర్వహించారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి మూలవిరాట్‌కు పంచామృతం, స్నపన, సహస్ర నామార్చన, పంచామృత స్నపన, ఉత్సవ మూర్తులకు తిరుమంజనం నిర్వహించారు. సాయంత్రం మూలవిరాట్‌కు చందనోత్సవం, చందన సేవ నిర్వహించారు. కల్యాణ ఘటాన్ని వైభవంగా నిర్వహించారు. జటప్రోలు దక్షిణామూర్తి శర్మ కల్యాణ వ్యాఖ్యానం ఆద్యంతం ఆకట్టుకుంది. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామిని దర్శించుకున్నారు. మున్సిపల్ చైర్మన్ చిర్లంచర్ల బాలమురళీకృష్ణ పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు బొగ్గరపు శేషగిరిరావు, కార్యదర్శి దోగిపర్తి నరసింహారావు, ఉపాధ్యాక్షుడు ఇమ్మడిశెట్టి చిన్నవీరారావు, సహాయ కార్యదర్శి కేవీ సుధాకర్‌రావు, కోశాధికారి బచ్చు రమేష్ బాబు ఆధ్వర్యంలో కార్యక్రమాలు నిర్వహించారు.

గిద్దలూరు : పలుచోట్ల లక్ష్మీనరసింహస్వామి జయంతిని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంలోని కొండపై వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో తిరునాళ్ల బ్రహ్మోత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. 3 రోజులపాటు జరిగే తిరునాళ్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా తొలిరోజు ఆదివారం రేడియో బావి సెంటర్‌లోని శ్రీఅభయాంజనేయస్వామి దేవస్థానం నుంచి ఉత్సవ విగ్రహాలను మేళతాళాల మధ్య కొండపైన ఉన్న దేవాలయానికి తీసుకుని వచ్చారు. ధ్వజారోహణ, అగ్నిసేవ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి వారికి వైభవంగా కల్యాణం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో స్వామి వారిని దర్శించుకుని పూజలు చేయగా దేవస్థాన కమిటీ ప్రతినిధులు, గ్రామపెద్దలు పూజ కార్యక్రమాలలో పాల్గొన్నారు.

కొమరోలు : కొమరోలు శ్రీ లక్ష్మీనరసింహ స్వామి, ఇడమకల్లు గుంటి లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం, తాటిచర్ల మోటులోని శ్రీ ఉగ్రనరసింహస్వామి ఆలయాల్లో ఆదివారం నృసింహుని జయంతి వేడుకలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఉదయం స్వామి వారికి అభిషేకాలు, అనంతరం ప్రత్యేకంగా అలంకరించారు. 11గంటలకు కొమరోలులోని ఆలయంలో దంపతులచే శ్రీ లక్ష్మీనరసింహ స్వామి కల్యాణ మహోత్సవాలను వేదపండితులు ఓరుగంటి సదాశివయ్యచే జరిపించారు. మండలంలోని తాటిచర్ల మోటులోని దేవాలయంలో దంపతులచే రుద్రసూక్తి, సుదర్శన, నవగ్రహ హోమాలు, కల్యాణ మహోత్సవాలను వేదపండితులు వారణాసి వెంకటరమణయ్య, తాటిచర్ల కుమారస్వామిలచే నిర్వహించారు. మధ్యాహ్నం పెద్ద ఎత్తున అన్నదానం నిర్వమించారు. సాయంత్రం లక్ష్మీనారసింహుని గ్రామోత్సవం కనులపండువగా సాగింది.

పెద్ద దోర్నాల : శ్రీ లక్ష్మీ నరసింహస్వామి జయంతి ఉత్సవాలను ఆదివారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రధానార్చకుడు కొండవీటి సుదర్శనాచారులు, మణిశర్మ పర్యవేక్షణలో ఉభయదాతలు పాల్గొనగా, శ్రీలక్ష్మీనారసింహునికి కల్యాణ క్రతువు నిర్వహించగా భక్తులు చూసి తరించారు. సాయంత్రం ప్రత్యేక రథంపై స్వామివారి ఉత్సవ విగ్రహాలకు గ్రామోత్సవం నిర్వహించారు.

ప్రసన్నాంజనేయ గోపుర కలశ స్థాపన

శ్రీ లక్ష్మీ నరసింహస్వామి దేవాలయం ఆవరణలో నిర్వహిస్తున్న ప్రసన్నాంజనేయ గోపుర కలశ, శిఖర స్థాపన వేడుకను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీపీ గుమ్మా పద్మజ, ఒంటేరు రమణ, గుమ్మాఎల్లేశ్, భక్తులు పాల్గొన్నారు.

నేటి నుంచి మిల్లంపల్లి వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు

ఎర్రగొండపాలెం రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి): మిల్లంపల్లిలోని శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలుని బ్రహ్మోత్సవాలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 12న బ్రహ్మోత్సవాలు ప్రారంభం సందర్భంగా అంకురార్పణ, ధ్వజారోహణం, రాత్రికి భేరిపూజ, దేవతాహ్వానం, రాయభారం, ఎదురుకోల కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు కమిటీవారు తెలిపారు. 13న ఉదయం స్వామి వారికి సూర్యవాహన సేవ, రాత్రికి సింహవాహనంపై దర్శనం కల్పిస్తారు. 14న ఉదయం చంద్రవాహనం, రాత్రికి శేషవాహనం, 15న రాత్రి హనుమంతుని వాహనం, 16న గరుడవాహనం, 17న గజవాహనం, 18న రథోత్సవం, 19న అశ్వవాహనం, చివరిరోజు 20వ తేదీన పగలు పూర్ణాహుతి, చక్రస్నానం, రాత్రికి హంస వాహనంపై భక్తులకు స్వామి వారు దర్శనం ఇస్తారు. రోజూ జరిగే ప్రత్యేక కార్యక్రమాల్లో భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులుకావాలని ఆలయ కమిటీ వారు కోరారు.

ఘనంగా మాతృదినోత్సవం

గిద్దలూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శాఖ గ్రంథాల య ఆవరణలో అంతర్జాతీయ మాతృదినోత్సవాన్ని నిర్వహించారు. తల్లులను వారి పిల్లలు సన్మానించి పాదాభివందనం చేశారు. కార్యక్రమంలో గ్రంథ పాలకురాలు ప్రసన్నకుమారి, వివిధ దేవస్థానాల ప్రతినిధులు శివపురం ఆంజనేయులు, గంజి వీరయ్య, వివిధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

'పది' టాపర్‌కి సన్మానం

గిద్దలూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలో 10వ తరగతి చదివి 578 మార్కులు సాధించిన పేద ఆర్యవైశ్య విద్యార్థినిని పలువురు ఘనంగా సన్మానించారు. ఉన్నత చదువుల కోసం ఆర్థిక సాయం అందజేశారు. ఫ్రెండ్స్ ఎంటర్ ప్రైజెస్ అధినేత మంచికంటి రమణరావు, సోదరులు రూ.30వేల సాయాన్ని అందించగా అమ్మవారి శాల మాజీ అధ్యక్షుడు విత సుబ్బరత్నం రూ.10వేల సాయాన్ని అందించారు.

వైభవంగా ధ్వజస్తంభ ప్రతిష్ఠోత్సవం



పెద్దారవీడు, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని సానికవరంలో నెలకొని ఉన్న శ్రీకోదండ రామస్వామి దేవస్థానంలో ప్రతిష్ఠ ఉత్సవాలు ఆదివా రం వైభవంగా నిర్వహించారు. బ్రహ్మశ్రీ పోతులూరి శివరామాచార్య సిద్ధాంతి ఆధ్వర్యంలో ప్రతిష్ఠ ఉత్సవంలో భాగంగా శ్రీపట్టాభి రామస్వామి ఆలయ ధ్వజస్తంభం, విమాన గోపుర శిఖర కలిశం, బలిపీఠం, భక్తాంజనేయస్వామి, శ్రీ అభయాంజనేయస్వామి నాభిశిల (బొడ్రాయి), మహా శీతల గమిడి శిలా యంత్రం ప్రతిష్ఠించారు.

ఆత్మీయ సమ్మేళనం అదుర్స్

- బాల్య జ్ఞాపకాలను గుర్తు చేసుకున్న పూర్వ విద్యార్థులు
- పాఠశాల అభివృద్ధికి సాయమందిస్తామని ప్రకటన


ఉపాధ్యాయులతో కలిసి గ్రూప్ ఫొటో దిగిన పూర్వ విద్యార్థులు

తర్లుపాడు, మే 11 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1996-97వ సంవత్సరం పదో తరగతి చదువుకున్న పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి 80 మంది పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు. 28 ఏళ్ల కిందట చదువుకున్న రోజుల్లో వారు చేసిన అల్లరి, ఆట పాటలను స్నేహితులందరూ గుర్తు చేసుకున్నారు. యోగక్షేమాలను తెలుసుకున్నారు. అనంతరం విద్యాబుద్ధులు నేర్పిన గురువులు కొప్పరపు కృష్ణమూర్తి, జాగర్లపుడి కృష్ణమూర్తి, ఎంసీ కృష్ణారెడ్డి, కేయానివిలాసిని, షేక్ ఖాశింవలి, పెద్దయేసు, ఎం.వెంకటయ్యను దుశ్శాలువలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. చివరిగా పూర్వపు విద్యార్థులందరూ కలిసి గ్రూప్ ఫోటోలు దిగారు. ఈ సందర్భంగా పూర్వపు విద్యార్థులు సత్తార్, యాసిన్, మల్లికార్జున్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి తమ బ్యాచ్ శాయశక్తులా కృషి చేస్తుందన్నారు. ఆరు నెలల క్రితం పాఠశాలలు, విద్యార్థులకు ఉపయోగపడే సైన్స్ పార్కును కూడా ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.సుధాకర్, ఎస్ఎంసీ చైర్మన్ వెన్నా రాజారామిరెడ్డి, పాఠశాలలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


ఆశాజ్యోతి పాఠశాలలో కలిసిన పూర్వవిద్యార్థులు

అపూర్వ కలయిక

గిద్దలూరు : పట్టణంలోని ఆశాజ్యోతి హైస్కూలులో 2002 - 2003 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థినీవిద్యార్థుల సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. కేఎస్‌పల్లి సమీపంలో గల అభిలాష కల్యాణ మండపంలో పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరిగింది. విద్యా బుద్ధులు నేర్పిన గురువులను సన్మానించారు. పాఠశాల రోజుల్లోని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు.

చెన్నారెడ్డిపల్లెలో చలివేంద్రం ఏర్పాటు

తర్లుపాడు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని చెన్నారెడ్డిపల్లెలో జాతిరత్నాల టీం ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ చలివేంద్రం ద్వారా ప్రయాణికులకు, గ్రామస్థులకు దాహార్తి తీరుతుందని సభ్యులు అన్నారు.

వేములకోటలో ఇంట్లో చోరీ

మార్కాపురం రూరల్, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేములకోట గ్రామంలోని ఇంట్లో చోరీ జరిగిన విషయం ఆదివారం వెలుగుచూసింది. రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇంటి యజమాని కనిగిరి చిన్న అల్లూరయ్య కుటుంబ సభ్యులతో కలిసి ఈనెల 8వతేదీన కర్నూలు జిల్లా దర్గాకు వెళ్లారు. శనివారం రాత్రి ఇంటికి వచ్చి చూడగా బీరువాలో వస్తువులు కిందపడి ఉన్నాయి. నాలుగు బంగారు ఉంగరాలు, రూ.42వేలు పోయినట్లు రూరల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ జరిగిన సొత్తు విలువ సుమారు రూ.లక్షానలభైమూడువేలు ఉంటుందని తెలిపారు. ఎస్ఐ అంకమ్మరావు తన సిబ్బందితో చోరీ జరిగిన ప్రదేశాన్ని పరిశీలించి వివరాలు నమోదు చేసుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఉచిత శిబిరాలతో పేదలకు వైద్యం

500 మందికి పరీక్షలు, మందుల పంపిణీ


త్రిపురాంతకం జడ్పీ పాఠశాలలో జరిగిన వైద్య శిబిరంలో మాట్లాడుతున్న డాక్టర్ రవీంద్ర

ఎర్రగొండపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఉచిత వైద్య శిబిరాలతో గ్రామీణ ప్రాంత పేదలకు ఉచిత వైద్యం అందజేయడమే లక్ష్యమని జడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు, డాక్టర్ మన్నె రవీంద్ర అన్నారు. త్రిపురాంతకం మండల కేంద్రం జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం రవీంద్ర, రామకిష్టారెడ్డి సూపర్ స్పెషాలిటీ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. డాక్టర్ రవీంద్ర మట్లాడుతూ ఉచిత వైద్య శిబిరంలో ఎక్కువ మంది పేద ప్రజలు చికిత్స పొందాలన్నారు. ఉచిత వైద్య శిబిరంలో 500 మందికి పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. అల్ట్రా సౌండ్ పరీక్షలు, ఈసీజీ, రక్త పరీక్షలు చేసినట్లు రవీంద్ర తెలిపారు. డాక్టర్ రవీంద్ర విస్సా ఎక్సలెంట్ అవార్డ్‌ను అందుకున్న ఫొటో ఫ్రేమ్‌ను డాక్టరు ఎం.శ్రీనివాసరావు రవీంద్రకు బహూకరించారు. న్యూరో సర్జన్ రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ వైద్య శిబిరంలో ఆధునిక పరికరాలతో అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించామని తెలిపారు. కార్డియాలజిస్టు అంజిత్, చర్మ వ్యాధుల నిపుణులు సిందూర, ఎముకల వ్యాధి నిపుణుడు లక్ష్మీనారాయణ రెడ్డి, జనరల్ మెడిసిన్ శేషయ్య వైద్య శిబిరంలో రోగులను పరీక్షించారు. అనంతరం అవసరమైన వారికి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


రెడ్డిచర్లలో గ్రామపెద్దలతో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

లక్ష్మీనరసింహస్వామికి ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు

గిద్దలూరు టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానంలో జరుగుతున్న తిరునాళ్ల బ్రహ్మోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి దంపతులు పాల్గొన్నారు. ఆదివారం రాత్రి ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి దంపతులు ఆలయానికి వెళ్లి స్వామి వారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు, దేవస్థాన కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

కొమరోలు : నియోజకవర్గ ప్రజలపై సాయిబాబా కృప ఉండాలని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని రెడ్డిచర్ల శ్రీ షిరిడీ సాయిబాబ ఆలయ వార్షికోత్సవం ఆదివారం నిర్వహించారు. ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పండుగలు, కార్యక్రమాలను కుల, మత, రాజకీయాలకు అతీతంగా జరుపుకోవాలని, తెలుగు సంప్రదాయాలు, సంస్కృతిని కాపాడాలని అశోక్‌రెడ్డి కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ మాజీ సభ్యుడు ముత్తుముల సంజీవరెడ్డి, ఆలయ ధర్మకర్త రెడ్డిచెర్ల వెంకంరాజు, నాయకులు చలిచీమల శ్రీనివాసచౌదరి, మస్తాన్‌వలి, హెసేన్ బేగ్, అక్కలరెడ్డి మోహన్‌రెడ్డి, ఖాశింవలి, అక్కలరెడ్డి రాజారెడ్డి, రఘురామరాజు పాల్గొన్నారు.

సత్యదేవునికి గజవాహన సేవ

మార్కాపురం వన్‌టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి) : శ్రీరమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయంలో స్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అర్చకులు రెంటచింతల గౌరీశంకర శర్మ సత్యనారాయణటస్వామి మూలవిరాట్‌కు అభిషేకాలు, అలంకరణ, అర్చనలు నిర్వహించారు.

గాయపడిన హోంగార్డ్ మృతి

ఎర్రగొండపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి) : ఎర్రగొండపాలెం పోలీసుస్టేషన్‌లో హోంగార్డ్ ఎర్రగుంట్ల శ్రీరాములు (38) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. శ్రీరాములు శనివారం రాత్రి టూ వీలర్‌పై వెళ్తుండగా మండలంలోని నరసాయపాలెం సమీపంలో జాతీయ రహదారిపై అడవి పంది అడ్డం రావడంతో దానిని ఢీకొట్టి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో తలకు గాయమై అపస్మారక స్థితిలోకి వెళ్లారు. స్థానిక ఆసుపత్రిలో ప్రాథమిక చికిత్స అనంతరం గుంటూరుకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందినట్లు ఎస్ఐ చౌడయ్య తెలిపారు. శ్రీరాములు సొంత ఊరు అర్ధవీడు మండలం యాచవరం కాగా ఉద్యోగరీత్యా వాదంపల్లి గ్రామంలో నివాసముంటున్నారు. అతనికి భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. సీఐ వాహనంనకు డ్రైవర్‌గా శ్రీరాములు విధులు నిర్వర్తిస్తున్నారు. స్వగ్రామంలో సోమవారం అంత్యక్రియలు జరుగుతాయని కటుంబ సభ్యులు తెలిపారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి జయంతి

- పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, మే 11 (ఆంధ్రజ్యోతి): పట్టణ సమీపంలోని కేటీఆర్ టెక్నోస్కూల్ ప్రాంగణంలో కొలువైఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో ఆదివారం స్వామివారి జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. తొలుత స్వామి వారికి పంచామృత అభిషేకం వైభవంగా నిర్వహించారు. అనంతరం దేవాలయం చైర్మన్ కుందురు తిరుపతిరెడ్డి దంపతులు లక్ష్మీ గణపతి హోమం, సుదర్శన హోమం నిర్వహించారు. స్వామి వారికి శాంతి కల్యాణం వైభవంగా జరిగింది. ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి పాల్గొని లక్ష్మీనరసింహస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఈసందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రను దేవాలయం చైర్మన్ కేటీఆర్ ఘనంగా సన్మానించారు. ఎమ్మెల్యే తండ్రి నర్సారెడ్డి పూజలు చేశారు. వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ దద్దాల నారాయణ స్వామి కూడ పూజలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకుడు శ్యామల కాశిరెడ్డి, జడ్పీటీసీ కస్తూరిరెడ్డి, ఎంపీపీ ప్రకాశం, సానికొమ్ము తిరుపతిరెడ్డి(ఎస్‌టీఆర్), మారుతి, బాబా దేవస్థానం చైర్మన్ సత్యాలు, ఉప్పాల నరసింహారావు, ముచ్చర్ల ధర్మారావు, సింగరాజు మాలకొండేశ్వరరావు, మాకినేని సాయిరాం, కంబాలదిన్నె శ్రీనివాసులు, ఉప్పాల సుబ్బారావు పాల్గొన్నారు. ఈ ఉత్సవాల్లో కనిగిరి నలుమూలల నుంచి అశేషంగా భక్తులు తరలివచ్చి పూజా కార్యాక్రమాలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.


పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి, ఆయన తండ్రి నర్సారెడ్డి

వెలిగండ్ల మండలానికి దక్కిన డీసీఎంఎస్ పదవి

వెలిగండ్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ చైర్మన్‌గా మండలంలోని వెదుళ్ళచెరువుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు శ్యామల కాశిరెడ్డి నియమితులయ్యారు. గత 20 సంవత్సరాలనుంచి పార్టీలో చురుగ్గా పనిచేస్తున్నారు. తన తండ్రి శ్యామల వెంకటరెడ్డి పేరు మీద ఫౌండేషన్ ఏర్పాటుచేసి నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పార్టీకి ఆయన అందించిన సేవలకుగాను డీసీఎంఎస్ చైర్మన్ పదవి దక్కింది. తనకు పదవి రావడానికి కృషి చేసిన ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డిని ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. వెలిగండ్ల మండల పార్టీ నాయకలు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు.

దర్శి అభివృద్ధే ధ్యేయం

- టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి
- ఘనంగా జన్మదిన వేడుకలు

దర్శి, మే 11(ఆంధ్రజ్యోతి): దర్శి నియోజకవర్గ అభివృద్ధే ధేయ్యంగా అహర్నిశలు కృషి చేస్తానని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ గొట్టిపాటి లక్ష్మి అన్నారు. ఆదివారం దర్శిలో జరిగిన ఆమె పుట్టినరోజు వేడుకల సందర్భంగా మాట్లాడుతూ తనపై నియోజకవర్గ ప్రజలు చూపుతున్న ఆదరాభిమానాలు జీవితాంతం గుర్తుంచుకుంటామన్నారు. గత వైసీపీ పాలకుల అసమర్థతతో నిలిచిన అభివృద్ధి పథకాలను గాడిలో పెట్టి ప్రారంభించా మన్నారు. కొంతమంది వైసీపీ నాయకులు టీడీపీ నాయకులు ఇబ్బంది పెడుతున్నారని తప్పుడు ప్రచారం చేస్తున్నారని ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో మహిళ అభ్యర్థి అనే విషయాన్ని చూడకుండా ఎలా దాడులు చేశారో ప్రజలు మరచిపోలేదన్నారు.

తాము స్థానికేతరులమని మాయమాటలు చెప్పి వైసీపీ గెలిచినప్పటికీ ప్రజలు వాస్తవాలు తెలుసుకొని తమపట్ల ఎంతో అభిమానం చూపుతున్నారన్నారు. అసెంబ్లీకి వెళ్లకుండా, ప్రజల సమస్యలు పట్టించుకోకుండా కేవలం తప్పుడు ప్రచారాలతోనే వైసీపీ పబ్బం గడుపుకుంటుందని విమర్శించారు. ప్రజలు అన్నివిషయాలు గమని స్తున్నారని, భవిష్యత్తులో వారికి గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. భారతదేశ సైన్యం అందిస్తున్న సేవలు భారతజాతి ఎల్లప్పుడు మరచిపోదన్నారు. ఉగ్రవాదం నిర్మూలించేందుకు ప్రాణత్యాగం చేసిన సైనికులకు నివాళులర్పిస్తూ సైనికుల సంక్షేమనిధికి తనవంతు సహకారంగా లక్ష రూపాయలు విరాళం అందిస్తున్నట్లు డాక్టర్ లక్ష్మి చెప్పారు.

కార్యక్రమంలో టీడీపీ కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా లక్ష్మి జన్మదిన వేడుకలు

ముండ్లమూరులో.. ముండ్లమూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజ కవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ లక్ష్మి జన్మదిన సందర్భంగా ఆదివారం మండలంలోని పోలవరం బస్టాండ్ వద్ద కేక్ కట్ చేశారు. అనంతరం వేంపాడు ఆంజనేయ స్వామి దేవాలయంలో డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముండ్లమూరులో ఎన్టీఆర్ విగ్రహాలకు పూలమా లలువేసి భారీ కేక్ కట్‌చేసి


దొనకొండ: ఎన్టీఆర్ విగ్రహం వద్ద డాక్టర్ లక్ష్మి జన్మదిన వేడుకలు నిర్వహిస్తున్న టీడీపీ నాయకులు

అన్నదానం నిర్వహించారు. అన్ని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు, అభిమానులు దర్శి తరలి వెళ్ళి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. సాయం త్రం మండలంలోని వేములబండలోని షిరిడీ సాయి ఆశ్రమంలో దిరిశాల శ్రీని వాసరావు ఆధ్వర్యంలో వృద్ధులకు పండ్లు, పాలు పంపిణీ చేసి అన్నదానం నిర్వహించారు.

డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో మాజీ ఎంపీపీ మందలపు వెంకటరావు, మండల టీడీపీ అధ్యక్షుడు కూరపాటి శ్రీనివాసరావు, మాజీ అధ్యక్షుడు సోమేపల్లి శ్రీనివాసరావు, మాజీ ఎంపీపీ కోడెగ మస్తాన్‌రావు, వరగాని పౌలు, కొక్కెర నాగరాజు, దేవినేని కోటేశ్వరరావు, జానకిరామయ్య, డీసీ చైర్మన్ కంచుమాటి శ్రీనివాసరావు, డాక్టర్ పాశం వెంకటేశ్వరరావు, సుంకర రాఘవరెడ్డి, నాగండ్ల రమ ణ, మామిళ్ళపల్లి కోటి, ఇందూరి పిచ్చిరెడ్డి, రాజారెడ్డి, ఏరేసు వెంక టేశ్వర రెడ్డి, నాగసూరి సుబ్బయ్య, చుంచు వీరనారాయణ, మోతుకూరి గురవయ్య, కట్టా చినవెంకంబొట్లు, గుంటుపల్లి రంగనాయకులు, తూమాటి వీరాంజనేయులు, కూరపాటి నారాయణస్వామి, జంపాని శ్రీనివాసరావు, జనమా ల నాగేంద్రం పిచ్చయ్య తదితరులు ఉన్నారు.


తాళ్లూరు: లక్ష్మి, లలిత్‌సాగర్ దంపతులకు చిత్రపటాన్ని బహూకరిస్తున్న ఎంపీపీ తాటికొండ, ఓబుల్‌రెడ్డి, తదితరులు

దర్శికి తరలివెళ్లి డాక్టర్ లక్ష్మికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో టీడీపీ మండల అధ్యక్షుడు బొమ్మిరెడ్డి ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీను, మా నం రమేష్‌బాబు, శాగం కొండారెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, మేడగం వెంకటేశ్వరరెడ్డి, గొల్లపూడి వేణుబాబు, కాలేషావలి, చెన్నపురెడ్డి వీరనాగిరెడ్డి, ఇడ మకంటి శ్రీనివాసరెడ్డి, కె.రామకోటిరెడ్డి, పిన్నిక రమేష్, మన్నేపల్లి సమర, కె.రామయ్య, రాచకొండ వెంకట్రావు, కె.నాగార్జునరెడ్డి, విద్యాసాగర్, నారిపెద్ది కల్యాణ్, పాలం అంజిరెడ్డి, జె.పోతురాజు, తిరుపతిస్వామి, గోపిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, రామలక్ష్మయ్య, అనపర్తి సుబ్బారావు, నాదెండ్ల శ్రీను, కె.పేరిరెడ్డి, మీరామొహిద్దీన్, చాట్ల ధానీ, బి.హనుమారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.


కురిచేడులో కేకు కట్ చేస్తున్న టీడీపీ నాయకులు

తాళ్లూరులో.. తాళ్లూరు, మే 11(ఆంధ్రజ్యోతి): టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ గొట్టిపాటి లక్ష్మి పుట్టిన రోజు వేడుకలకు తాళ్లూరు మండల శ్రేణులు ఆదివారం దర్శిలోని ఆమె నివాసానికి అధిక సంఖ్యలో తరలి వెళ్లారు. ఎంపీ పీ తాటికొండ శ్రీను, గొల్లపూడి వేణుబాబు, కె.రామకోటిరెడ్డి, కె.రామయ్య నరసరావుపేటలో ఆమె ఇంటికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపారు. కడియాల ఆసుపత్రిలోని రోగులకు ఆమె చేతులు మీదుగా పండ్లు పంపిణీ చేయించారు. టీడీపీ మండల అధ్యక్షుడు బి.ఓబుల్‌రెడ్డి, ఎంపీపీ తాటికొండ శ్రీను ఆధ్వర్యంలో డాక్టర్ లక్ష్మికి చిత్రపటాన్ని బహూకరించారు. డాక్టర్ లక్ష్మి, డాక్టర్ లలిత్‌సాగర్ దంపతులను గజమాలతో సత్కరించారు.

కురిచేడులో.. కురిచేడు, మే 11(ఆంధ్రజ్యోతి): డాక్టర్ లక్ష్మి జన్మదినం సందర్భంగా కురిచేడులోని పార్టీ కార్యాలయం వద్ద భారీ కేకు కట్ చేశారు. అనంతరం అన్నదానం ఏర్పాటుచేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పిడతల నెమలయ్య, కాట్రాజు నాగరాజు, మెగల్ మస్తాన్‌వలి, గడ్డం బాలయ్య, గొట్టిపాటి వెంకటేశ్వర్లు, డిష్ వెంకటేశ్వర్లు, మేరువ పెద్దిరెడ్డి, దాసరి ఏడుకొండలు, నాగేంద్ర, మారెళ్ల కాశయ్య, సీతారామయ్య, కమతం నాగిరెడ్డి, మేడా నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం కార్యకర్త లంతా దర్శికి వెళ్లి డాక్టర్ లక్ష్మిని కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

టీజీ ఈఏపీసెట్‌లో జిల్లా విద్యార్థికి 173వ ర్యాంకు



వీసీపల్లి, మే 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ ఎప్‌సెట్(టీజీ ఈఏపీసెట్)లో జిల్లా విద్యార్థి మెరిశాడు. మండలంలోని తలకొండపాడు గ్రామానికి చెందిన గోనుగుంట్ల సాయి అభినవ్ 173వ ర్యాంకు సాధించాడు. ఆదివారం విడుదలైన ఫలితాల్లో ఆయన 111 మార్కులు సాధించాడు. ఇటీవల వెల్లడించిన జేఈఈ మెయిన్స్‌లో 99.7పర్సంటైల్ సాధించాడు. సాయిఅభినవ్ తండ్రి రామయ్య ప్రైవేట్ కళాశాలలో అధ్యాపకుడిగా చేస్తుండగా, తల్లి సుజాత తునిలోని ఏపీమోడల్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు. సాయి విద్యాభ్యాసం తెలంగాణలో సాగింది. ఈసందర్భంగా సాయి అభినవ్‌ను తల్లిదండ్రులతోపాటు పలువురు అభినందనలు తెలిపారు.

తాళ్లూరులో ఉచిత కంటి వైద్య పరీక్షలు

తాళ్లూరు, మే 11(ఆంధ్రజ్యోతి): జనతా మెడికల్ ఇనిస్టిట్యూట్ ఆధ్వర్యంలో స్థానికి ఏబీసీ హైస్కూల్‌లో ఆదివారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. ఎంపీటీసీ యామర్తి ప్రభుదాస్ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. కంటి వైద్య నిపుణులు పూజిత మాదాల ఆధ్వర్యంలో డీవోలు నరసింహరావు, వర్షలు 109 మందికి వైద్య పరీక్షలు చేశారు. 35 మందికి శుక్లం ఆపరేషన్ కోసం సిఫార్సు చేశారు. ఎన్టీఆర్ వైద్యసేవ, ఈహెచ్‌ఎస్ ద్వారా ఆపరేషన్‌లు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ టి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపాల్ కె.వెంకటేశ్వరరావు, డైరెక్టర్ కాలేషాబాబు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

దర్శి, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కట్టసింగన్నపాలెం గ్రామానికి చెందిన కల్లూరి గురువర్ధన్(20) ఆదివారం ఉదయం రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందాడు. దర్శి నుంచి మోటార్‌సైకిల్‌పై కట్టసింగన్నపాలెం వెళ్తుండగా మార్గమద్యంలో చెట్టుకు ఢీకొని అక్కడికక్కడే మృతిచెందాడు. ఎస్‌ఐ ఎం.మురళీ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వ్యవసాయ విద్యుత్ వేళల్లో మార్పు

తాళ్లూరు, మే 11(ఆంధ్రజ్యోతి): ఉప్పలపాడు 132/33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల దృష్ట్యా త్రీఫేస్ విద్యుత్ వేళల్లో మార్పు చేసినట్లు ఏడీఈ కృష్ణారెడ్డి తెలిపారు. సోమవారం తెల్లవారుజామున 4 నుంచి ఉదయం 9 గంటల వరకు విద్యుత్ ఉంటుందని తెలిపారు. ఆతర్వాత మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరా ఉండదని తెలిపారు.

వేసవి శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

సీఎస్‌పురం(పామూరు), మే 11 (ఆంధ్రజ్యోతి) : వేసవి శిక్షణ తరగతులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథపాలకుడు ఆళ్ల భాస్కరరావు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా ఆదివారం విద్యార్థులకు కథలు చదివించడం, చెప్పించడం, ఇంగ్లీష్, తెలుగు పదాలు చెప్పించడం, ఆటలు ఆడించడం కార్యక్రమాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఎస్.వెంకట్రామయ్య, ప్రమీల, కె.సంధ్య విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు శివపార్వతుల శాంతి కల్యాణం

పామూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దాదిరెడ్డిపల్లి పంచాయతీ సట్టుమడుగు గ్రామంలో వెలసిఉన్న శ్రీపార్వతి సమేత నీలకంఠేశ్వరస్వామి దేవస్థానం వార్షికోత్సవం సందర్భంగా సోమవారం శివపార్వతుల శాంతి కల్యాణం జరుగుతున్నట్లు దేవస్థాన నిర్వాహకులు తెలిపారు. ఈసందర్భంగా యజ్ఞ హోమాలు, కుంకుమార్చన పూజలు, అభిషేకాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అసభ్య ప్రవర్తనపై కేసు

కురిచేడు, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటంవారిపల్లిలో మహిళ పట్ల అసభ్యంగా ప్రవర్తించిన అదేగ్రామానికి చెందిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శివ చెప్పారు. ఆమె సోదరుడిని సైతం దుర్భాషలాడుతూ కొట్టడంతో గాయాలైనట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

దొనకొండ, మే 11(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ఐదు సంవత్సరాలులోపు వయస్సు కల్గి ఇంకా ఆధార్ నమోదు కాని పిల్లల కోసం సోమవారం నుంచి నాలుగు రోజులు నాలుగు గ్రామ పంచాయతీల్లో ఆధార్ క్యాంపులు నిర్వహిస్తున్నట్లు సచివాలయ సిబ్బంది తెలిపారు. 12వ తేది ఇండ్లచెరువు, 13వ తేది ఆరవళ్లిపాడు, 14వ తేది రుద్రసముద్రం, 15వ తేది కొచ్చెర్లకోట గ్రామాల్లోని సచివాలయాల్లో ఆధార్ క్యాంపులు నిర్వహించనున్నట్లు వారు తెలిపారు.

సచివాలయాల సిబ్బంది వితౌట్ ఆధార్ సర్వేలో గుర్తించిన ఆధార్ లేని పిల్లలను, వారి తల్లిదండ్రులను ఆధార్ క్యాంపుల వద్దకు పంపేలా తెలపాలన్నారు. ఎండలు ఎక్కువగా ఉన్నందున ఉదయం 8 గంటల నుంచే క్యాంపులు ప్రారంభమవుతాయన్నారు. పుట్టినతేది సర్టిఫికెట్, తల్లి, తండ్రి ఆధార్ కలర్ జిరాక్సులతో రావాలని సచివాలయ సిబ్బంది కోరారు.

అంగన్‌వాడీ కేంద్రాలకు స్థలసేకరణ కోసం యత్నాలు

పామూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పామూరు, సీఎస్‌పురం మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాలకు పక్కా భవనాల నిర్మాణాల కోసం స్థలాలు మంజూరు చేయాలని కోరుతూ మండల రెవెన్యూ అధికారులకు తమ శాఖ తరుపున లెటర్లు ఇచ్చి ఉన్నామని ఐసీడీఎస్, కనిగిరి అధికారిణి పి.సరోజిని తెలిపారు. అద్దె భవనాల్లో అంగన్‌వాడీ కేంద్రాలు శీర్షికన ఆదివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల నిర్వహణకు ప్రభుత్వ నియమాల ప్రకారం రూ.2 వేలు అద్దె చెల్లిస్తున్నట్టు చెప్పారు. లబ్ధిదారులకు సక్రమంగా పౌష్టికాహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పట్టణంలోని డీవీ పాలెం అంగన్‌వాడీ కేంద్రానికి పిల్లలు వెళ్లేందుకు జాతీయ రహదారి దాటి వెళ్లాలి వస్తుంది. దీంతో ప్రమాదాలకు గురవుతారేమోనని తల్లిదండ్రులు పిల్లలను పంపించడానికి అంగీకరించకపోవడంతో అద్దె భవనంలో కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆమె తెలిపారు. అంగన్‌వాడీ భవనంలో గతంలో సిమెంటు బస్తాలు ఉండగా, ప్రసుత్తం లేవని ఆమె తెలిపారు.

శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పామూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): శాకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని పిరమిడ్ ధ్యాన కేంద అధ్యక్షుడు పి.అల్లూరయ్య తెలిపారు. ధ్యాన కేంద్ర ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలో శాకాహార అవగాహన ర్యాలీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రశాంతత పెరిగేకొద్దీ విజయాలు, శక్తి సామర్థ్యాలు పెరుగుతాయన్నారు.

సకల ప్రాణి కోటిలో దేవుడు ఉన్నాడని భక్తికి ముక్తికి శాకాహారమే ముఖ్యమని అల్లూరయ్య పేర్కొన్నారు. అందుకే పూర్వీకులు చెప్పినట్లు శాకాహారం అమృతాహారంతో సమానమన్నారు. శాకాహారం పరబ్రహ్మ స్వరూపమన్నారు. సంపూర్ణ ఆరోగ్యానికి ప్రతిఒక్కరూ శాకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పి.తిరుపతిరెడ్డి, సాయిబాబా దేవస్థాన అధ్యక్షుడు సోమిశెట్టి మాల్యాద్రి, జి.రమణయ్య, కె.ప్రభాకర్, దుర్గ, రాజేశ్వరి, పి.సౌభాగ్యం అనసూయ, వాణి, తదితరులు పాల్గొన్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మ తల్లి

తాళ్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న గుంటిగంగ సన్నిధిలో ఆదివారం గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. గంగమ్మతల్లికి పొంగళ్లు పెట్టి చ ల్లగా చూడమని వేడుకున్నారు. వాహనదారులు వాహన పూజలు చేయించగా, మరికొందరు భక్తులు గంగమ్మతల్లికి ప్రత్యేక పూజలు జరిపారు. పలువురు కుంకుమ పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకపూజారి ఎస్.కామేశ్వరశర్మ భక్తులకు గోత్రనామ పూజలు నిర్వహించారు. పూజారులు ప్రకాశ్ పంతులు, విజయలక్ష్మి, బాలరాజులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ చైర్మన్ కొసనా గురుబ్రహ్మం, ఆర్‌ఏ ప్రసాద్, భక్తులు పాల్గొన్నారు. గుంటిగంగమ్మ తల్లిని కాంగ్రెస్‌పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కైపు వెంకటకృష్ణారెడ్డి, మండల అధ్యక్షుడు వీరబ్రహ్మం దర్శించుకుని పూజలు చేశారు.

ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూఉన్న చిల్లచెట్ల తొలగింపు

పామూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ చుట్టూ అల్లుకొని ప్రమాదకరంగా ఉన్న చిల్ల చెట్లు, పిచ్చి మొక్కలను విద్యు త్‌శాఖ సిబ్బంది తొల గించారు. పట్టణంలోని నెల్లూరు రోడ్డులో ఆర్ అండ్‌బీ రోడ్డు పక్కన ఏర్పాటు చేసిన కంచె లేని ట్రాన్స్‌పార్మర్ చుట్టూ అల్లుకొన్న చిల్లచెట్లతో ప్రమాదకరంగా ఉంది. దీంతో ప్రమాదకరంగా ట్రాన్స్‌పార్మర్ శీర్షికన శనివారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి విద్యుత్ అధికారులు స్పందించారు. సిబ్బందితో శనివారం సాయంత్రం చిల్లచెట్లను తొలగించి శుభ్రపరిచారు. త్వరలో రక్షణ కవచం ఏర్పాటు చేస్తామని అధికారులు తెలిపారు.


చిల్లచెట్లు తొలగించిన తర్వాత కనిపిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

భక్తిశ్రద్ధలతో ఆదివారం పూజలు

సీఎస్‌పురం (పామూరు), మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మిట్టపాలెం శ్రీ నారాయణస్వామి దేవస్థానంలో భక్తులు ఆదివారం అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్వామివారి ఉత్సవ విగ్రహానికి అభిషేకాలు, విశేష కుంకుమార్చన పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులు మహానైవేద్యాన్ని దేవస్థాన గాలి గోపురం వద్ద నుంచి మేళతాళాలతో ఆలయ ప్రదిక్షణలు చేసి స్వామివార్లకు సమర్పించారు. అనంతరం గోశాలలోని గోమాతలకు పసుపు కుంకుమతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కార్యక్రమంలో దేవస్థాన వ్యవస్థాపక అధ్యక్షుడు కొమ్మినేని చిన్న ఆదినారాయణ, ఉభయ దాతలు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు అంకాలమ్మ జాతర


ముండ్లమూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మారెళ్ళలో వేంచేసి ఉన్న గ్రామ దేవత శ్రీ అంకాలమ్మ 62వ జాతర మహోత్సవం సోమవారం జరగనుంది. ప్రతిఏడాది మే నెలలో జాతర జరుగుతుంది. ఈసందర్భంగా మూడు రోజుల నుంచి పూజా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దేవాలయాన్ని విద్యుత్ దీపాలంకరణ చేశారు. గ్రామ పెద్దల సంహకారంతో గత 22 సంవత్సరాలుగా పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. కృష్ణ బలిజ సంఘం, నాయుడు యూత్ ఫోర్స్ ఆధ్వర్యంలో, జనసేన, టీడీపీ ఆధ్వర్యంలో విద్యుత్ ప్రభను ఏర్పాటు చేశారు.

ఉత్సవాన్ని ప్రశాంతంగా జరుపుకోవాలి

ముండ్లమూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఈదరలో వేంచేసి ఉన్న అష్టపద్మాలమ్మ అంకాలమ్మ జాతర మహోత్సవం ఈనెల 16న జరగనుంది. ఇందులోభాగంగా ప్రతి ఏడాది మూడు రోజుల ముందు అమ్మవారి కొలుపుల జాతర జరగనుంది. ఒకే సామాజిక వర్గంలో ఇరు వర్గాలు తాము కొలుపులు నిర్వహించాలంటూ పట్టుబట్టడంతో వివాదం చినికి చినికి గాలి వానలా మారి ఒకే సామాజిక వర్గంలో గొడవలు జరుగుతాయన్న సమాచారంతో ఎస్‌ఐ కె.కమలాకర్ ఆదివారం ఈదర గ్రామానికి వెళ్ళి ప్రజలతో మాట్లాడారు. జాతర ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఎవ్వరూ కూడా గొడవలకు పాల్పడ వద్దని, దేవుడు జాతరను రాజకీయం చేయవద్దంటూ ఎస్‌ఐ కమలాకర్ కౌన్సెలింగ్ ఇచ్చారు. భక్తితో జాతరను జరుపు కోవాలన్నారు. ఒకే సామాజిక వర్గంలో ఒక వర్గం వారు తాము కొన్ని సంవత్సరాలుగా కొలుపులు నిర్వహిస్తున్నామని, తమకే హక్కు ఉందని ఎస్‌ఐ దృష్టికి తీసుకురాగా కొత్తగా గుడి నిర్మించుకున్న మరికొందరు తాము కొలుపులు నిర్వహిస్తామని ఎవరికి వారు పట్టుదలతో ముందుకు వచ్చారు. ఎస్‌ఐ కమలాకర్ ఇరు వర్గాలను పిలిపించి ప్రస్తుతానికి ఎవ్వరూ కూడా కొలుపులు చేయవద్దని, జాతర మాత్రమే నిర్వహించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఎస్‌ఐ పీవీ హనుమంతరావు, గ్రామస్థులు పాల్గొన్నారు.

రేపు పొదిలిలో విద్యుత్ అదాలత్

దొనకొండ, మే 11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్యల పరిష్కారం నిమిత్తం ఈనెల 13న పొదిలి పట్టణంలోని దర్శి రోడ్డులోగల కల్యాణ మండపంలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1-30 గంటల వరకు విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఏఈ షేక్ నాగూర్ తెలిపారు. విజయవాడకు చెందిన కన్సూమర్ గ్రీవెన్స్ ఫారం ఆధ్వర్యంలో నిర్వహించే ఈకార్యక్రమంలో సీజీఆర్‌ఎఫ్ చైర్మన్ ఎన్.విక్టర్ ఇమ్మానుయేలు, ఒంగోలు ఆపరేషన్ సూపరింటెండెంట్ ఇంజనీర్ కె.వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొంటారని తెలిపారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలపై సర్వీస్ కనెక్షన్, పూర్తి చిరునామా, సెల్‌ఫోన్ నెంబర్‌తో రాతపూర్వకంగా తెలియజేయాలన్నారు. మండలంలోని విద్యుత్ వినియోగదారులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఏఈ నాగూర్ కోరారు.



ఉష్ణోగ్రత (అంచనా) 12-5-2025	గరిష్ఠం	కనిష్ఠం
గుంటూరు	43	27
తెనాలి	42	28
నరసరావుపేట	42	27
బాపట్ల	41	28
రెంటచింతల	42	29
చీరాల	41	28

హాజరుకు.. గంతలు

- ఫోన్‌తో ఏ మార్చి హాజరు
- ఐ-ఎఫ్ఆర్ఎస్ యాప్‌కు గంతలు
- ఆరోగ్య శాఖలో మాయా మశ్చీంద్రిలు
- సమయం, స్థలం మార్చి హాజరు నమోదు
- మూడు జిల్లాలో 71 మందికిపైగా చర్యలకు రంగం సిద్ధం



కొన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. పేరుకు ఇద్దరు ఉన్నా ఒక్కరు కూడా సక్రమంగా విధుల్లో ఉండరు. మారుమూల ప్రాంతాల్లో అయితే వైద్యులు, నర్సింగ్ సిబ్బంది ఎప్పుడు వస్తారో.. ఎప్పుడు వెళ్తారో కూడా ఎవరికీ తెలియడంలేదు.

- జడ్పీ సమావేశాల్లో జడ్పీటీసీల ఫిర్యాదు

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో సేవలు సక్రమంగా అందడంలేదు. అత్యవసరంగా వెళ్లినా డాక్టర్లు, నర్సింగ్ సిబ్బంది అందుబాటులో ఉండటంలేదు. అడిగితే మీటింగ్‌కు లేదంటే క్యాంపునకు వెళ్లారంటున్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో జిల్లా, నియోజకవర్గ కేంద్రాల్లోని పెద్దాస్పత్రులకు వెళ్లాల్సి వస్తోంది.

- రోగుల ఆవేదన

గుంటూరు సిటీ, మే 11 (ఆంధ్రజ్యోతి): గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో ఇదీ పరిస్థితి. వైద్యులు, వైద్య సిబ్బంది కొరత వల్ల ఈ పరిస్థితి అని అనుకుంటే తప్పులో కాలేసినట్లే. అందుబాటులోకి వచ్చిన సాంకేతికతను అందిపుచ్చుకుని వైద్యులు, వైద్య సిబ్బంది తమకు కావాల్సినప్పుడు విధులకు వచ్చి వెళ్లిపోతున్నారు. కొందరైతే ఆస్పత్రులకు రాకుండా విధుల్లో ఉన్నట్లు హాజరు వేసుకుంటున్నారు. వేళలను పాటిస్తూ తప్పనిసరిగా విధుల్లో ఉంటూ రోగులకు అందుబాటులో వైద్యులు, వైద్య సిబ్బంది ఉండేలా ప్రభుత్వం పక్కాగా హాజరును అమలు చేస్తుండగా.. విధులకు గైర్హాజరయ్యేందుకు పలువురు అడ్డదారులు తొక్కుతున్నారు. పల్నాడు జిల్లాలో పది మంది వైద్యులు, 20 మంది సూపర్‌వైజర్లు, హెల్త్ అసిస్టెంట్లు, గుంటూరు జిల్లాలో 17 మంది వైద్యులు, ఇద్దరు హెల్త్ ఎడ్యుకేటర్లు, 10 మంది పారామెడికల్ సిబ్బంది, బాపట్ల జిల్లాలో 12 మంది డాక్టర్లు, పారా మెడికల్ సిబ్బందిపై రాష్ట్ర అధికారులకు రాత పూర్వకంగా ఫిర్యాదులు వెళ్లడం కలకలం రేపుతుంది.

చర్యలు తీసుకున్నా మారరా..

ఎఫ్ఆర్ఎస్ యాప్‌లో అక్రమాలకు పాల్పడుతున్నారన్న ఆరోపణలపై రాష్ట్ర ఉన్నతాధికారులు సీరియస్ అయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న సుమారు 140 మంది సిబ్బందిని శాశ్వతంగా విధుల్లో నుంచి తొలగించారు. వారిలో కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్‌లో పని చేస్తున్న డాక్టర్లు కూడా ఉన్నారు. ఒక వైపు ప్రభుత్వం ఇంత సీరియస్‌గా ఉన్నా కొందరు అధికారులు, సిబ్బందిలో ఏ మాత్రం మార్పు రాకపోవడం గమనార్హం.

సెట్టింగ్స్‌లో మార్పులు చేసుకుని..

ఐ-ఫోన్ ఆధారంగా తేదీ, సమయం, ఊరు మార్చి ఎఫ్ఆర్ఎస్(ఫేషియల్ రెకగ్నైజేషన్ సిస్టం) యాప్‌ను పక్కదారి పట్టిస్తున్నారు. ఫోన్‌లో ఉన్న స్టాండర్డ్ సమయం మార్చి ఎప్పుడు హాజరు వేసినా సకాలంలోనే వేసినట్లుగా చూపించేలా సెట్టింగ్స్‌ను మార్చేసుకుని ప్రభుత్వాన్ని, ఉన్నతాధికారులను బురిడీ కొట్టిస్తున్నారు. ఉదాహరణకు ఉదయం 9 గంటలకు ఆరోగ్య కేంద్రంలో ఉండాల్సిన ఉద్యోగి ఆ పరిసరాల్లోకి వెళ్లి ఎఫ్ఆర్ఎస్ ద్వారా హాజరు వేయాలి. జీ పీ ఎ స్‌ లో మార్పుల ద్వారా ఇంట్లో ఉన్నా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉన్నట్లు చూపించవచ్చు. ఉదాహరణకు సాయంత్రం 4 గంటలకు చివరి హాజరు వేసి ఉద్యోగి ఇంటికి బయలుదేరాలి. కానీ ఫోన్‌లో స్టాండర్డ్ సమయం మార్చి సమయాన్ని ముందుకు వెనక్కి మార్చే వెసులుబాటు ద్వారా మధ్యాహ్నం 2 గంటలకే సాయంత్రం 4 గంటల హాజరు కూడా వేస్తున్నట్లు తెలుస్తుంది.

పల్నాడు, గుంటూరు జిల్లాల్లో మరీ దారుణం..

ఎఫ్ఆర్ఎస్ యాప్ విషయంలో ప్రభుత్వం ఎంత సీరియస్‌గా ఉన్నా కొందరు వైద్యుల తీరులో మార్పు రావడం లేదు. ఎఫ్ ఆర్ఎస్ అప్రూవల్ అంతా వైద్యుల చేతుల్లోనే ఉంటుంది కాబట్టి వారు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నట్లు ఆరోపణలున్నాయి. కొందరు డాక్టర్లు 104 డ్యూటీకి వెళ్తున్నామని చెప్పి అక్కడ ఒక్క ఫొటో దిగి సిబ్బందికి పని అప్పగించి వెళ్లిపోతున్నట్లు ఆరోపణలున్నాయి. మధ్యాహ్నం తర్వాత చాలామంది వైద్యులు విధుల్లో ఉండటం లేదని ఆరోపణలు ఉన్నా జిల్లా అధికారులు పట్టించుకోవడంలేదని ప్రభుత్వానికి ఫిర్యాదు వెళ్లాయి. ఉదాహరణకు పల్నాడు జిల్లా కృష్ణా నది సమీప మండలంలోని ఓ డాక్టర్, ఎంపీహెచ్‌ఈవో సమయానికి విధులకు హాజరు కాకుండానే హాజరైనట్లు చూపిస్తున్నారని ప్రభుత్వానికి ఇటీవల పలువురు ఫిర్యాదు చేశారు.

సచివాలయం.. గందరగోళం

పాలనను ప్రజలకు దరి చేర్చాలి.. వారి గడప వద్దే ప్రభుత్వ సేవలు అందించాలని గత ప్రభుత్వం సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టి.. దానిని ఓ ప్రహసనంగా నడిపింది. పోస్టింగ్‌ల దగ్గర నుంచి పనుల వరకూ అంతా గందరగోళమే. కూటమి ప్రభుత్వం సచివాలయ వ్యవస్థ ప్రక్షాళనకు సిద్ధమవ్వగా.. అదో ప్రహసనంగా మారింది. గత ప్రభుత్వ మార్గదర్శకాల్లో నెలకొన్న అస్పష్టత.. సిబ్బంది సంఖ్యలో లెక్కలు లేకపోవడం.. అసలు ఏ శాఖలో ఎవరు ఉంటున్నారు.. ఎవరు ఎక్కడ పని చేస్తున్నారు. ఎవరు ఏ పని చేస్తున్నారనే విషయంలోనే స్పష్టత లోపించింది. సచివాలయాలను ప్రజాప్రయోజనంగా మార్చడానికే ప్రభుత్వం ఈ రేషనలైజేషన్ నిర్ణయం తీసుకుంది. కానీ క్షేత్రస్థాయిలో అనేక చిక్కుముడులు అలానే ఉన్నాయి. వాటి విషయంలో స్పష్టత ఇవ్వకుండా హడావిడిగా ఈ ప్రక్రియ చేపడితే అది కాస్తా మొక్కుబడి తంతుగా మారి అసలు ఉద్దేశం నీరుకారిపోయే ప్రమాదం ఉంది.

- ప్రహసనాన్ని తలపిస్తున్న క్రమబద్ధీకరణ
- ఇప్పటికే వివిధ విభాగాల్లో సిబ్బంది డిప్యూటేషన్
- గుంటూరులో మిగులు.. బాపట్ల, పల్నాడు జిల్లాల్లో కొరత
- మార్గదర్శకాల్లోనే అస్పష్టత.. కొలిక్కి తెచ్చేందుకు కసరత్తు



(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

సచివాలయ వ్యవస్థ ఏర్పాటు నుంచి, సిబ్బంది నియామకం వరకు ప్రతి దశలోనూ వైసీపీ ప్రభుత్వం లోపాల పుట్టగా మార్చింది. ఓ ప్రణాళిక లేకుండా సిబ్బంది నియామకాన్ని ఆయా వార్డులు, గ్రామాల అవసరాలను బట్టి కాకుండా మమ అనిపించే విధంగా తంతును పూర్తి చేసింది. ఇక మున్సిపాలిటీ, అంగన్వాడీలు ఇలా పలు విభాగాలకు సమాంతరంగా ఆ వ్యవస్థ పనిచేస్తుండడంతో ఉద్యోగులు ఒకరి మీద ఒకరు ఫిర్యాదు చేసుకునే వరకు పలుసార్లు వెళ్లడం ఆ వ్యవస్థ డొల్లతనానికి సూచికగా నిలిచింది. వాటిని సరిదిద్ది సచివాలయాల క్రమబద్ధీకరణ చేపట్టేందుకు కూటమి ప్రభుత్వం సిద్ధమైంది. ప్రజల అవసరాలకు అనుగుణంగా సిబ్బందిని సర్దుబాటు చేసే ప్రక్రియను చేపట్టింది. అయితే గత ప్రభుత్వం అవలంబించిన అస్తవ్యస్త విధానాలకు తోడు, ప్రస్తుతం జారీ చేసిన మార్గదర్శకాలలో కూడా స్పష్టత లేకపోవడంతో క్రమబద్ధీకరణ ప్రక్రియ ప్రహసనాన్ని తలపిస్తోంది. పలువురు సచివాలయ ఉద్యోగులు ఇప్పటికే డిప్యూటేషన్‌పై వివిధ విభాగాల్లో ఉన్నారు. దీంతో సర్దుబాటు ప్రక్రియ సిబ్బందిని అయోమయంలో నెట్టివేసింది.

అవసరం లేని విభాగాల్లో 2,200 మంది సిబ్బంది...

సచివాలయాలను కొలువుదీర్చినప్పుడు 21 విభాగాలను గుర్తించి.. పోస్టింగ్‌లకు వచ్చేప్పటికి 11 శాఖలకే పరిమితమైంది. ఇక శాఖల వారీగా ఉద్యోగులను సగటున ఒక్కో సచివాలయంలో 9 మందిని నియమించింది. సరే వీరికి విధుల అప్పగింతలో గందరగోళమే నడిచింది. తీర ప్రాంతమే లేని చోట ఫిషరీస్ అసిస్టెంట్‌ను కేటాయించారు. ఇలా అవసరం లేని చోట మూడు జిల్లాల పరిధిలో దాదాపు 2,200 మంది వరకు సిబ్బంది విధులు నిర్వహిస్తున్నట్లు కూటమి ప్రభుత్వం తేల్చింది. సచివాలయాల ఏర్పాటు ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన జరిగింది. బాపట్ల, పల్నాడు జిల్లాలుగా ఆవిర్భవించినప్పుడు సరిపడా సిబ్బంది లేకపోవడంతో వివిధ విభాగాల అవసరాలకు పలువుర్ని డిప్యూటేషన్ ప్రాతిపదికన నియమించుకున్నారు. వీరిలో అధికశాతం సచివాలయ సిబ్బందే ఉన్నారు.

ప్రస్తుతం చేపడుతున్న సర్దుబాటులో భాగంగా మిగులు సిబ్బందిని క్రమబద్ధీకరణలో భాగంగా కొత్తగా ఏర్పాటయ్యే సచివాలయాల్లో కొలువుదీర్చాలన్నది ప్రభుత్వ లక్ష్యం. కానీ గుంటూరు జిల్లాలో సచివాలయ సిబ్బంది అదనంగా ఉండే అవకాశం ఉంది. బాపట్ల, పల్నాడు జిలాల్లో ఆ పరిస్థితి లేదని తెలుస్తోంది. మరోవైపు రేషనలైజేషన్ కసరత్తు జరుగుతుండగానే అభివృద్ధి కార్యక్రమాల పురోగతిని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించేందుకు నియోజక వర్గానికి 5 గురు సచివాలయ సిబ్బందిని కేటాయించాలని ఆదేశాలు రావడంతో మొత్తం ప్రక్రియే గందరగోళాన్ని తలపిస్తోంది.



కల్యాణ మహోత్సవానికి హాజరైన భక్తులు

కన్నులపండువగా.. కల్యాణోత్సవం

అద్దంకి, మే 11 (ఆంధ్రజ్యోతి): లక్ష్మీనరసింహస్వామి జయంతి సందర్భంగా శింగరకొండలో స్వామివారి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. కొండపై ఉన్న లక్ష్మీనరసింహస్వామి మూలవిరాట్‌కు అభిషేకం నిర్వహించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈవో శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కల్యాణోత్సవం కన్నులపండువగా జరిగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో శింగరకొండకు తరలివచ్చి కల్యాణోత్సవాన్ని తిలకించారు. చినగంజాం మండలం కడవకుదురుకు చెందిన సోమిశెట్టి వెంకటరావు రూ.11 వేల విలువైన శంఖు, చక్రం, నామాలతో కూడిన వెండి దీపారాధనను ఈవోకు అందజేశారు. అద్దంకికి చెందిన దామ మురళీకృష్ణ జ్ఞాపకార్థం భార్య రాజ్యలక్ష్మి రూ.15 వేల విలువైన కొబ్బరికాయలు కొట్టే స్టాండ్‌ను అందజేశారు.

బస్టాండ్లలో పోలీసు తనిఖీలు

1 అనుమానితుల సమాచారం ఇవ్వాలన్న డీఎస్పీ



బాపట్ల పాతబస్టాండ్‌లో తనిఖీలు చేస్తున్న పోలీసులు

బాపట్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): భారత్-పాకిస్థాన్ దేశాల మధ్య యుద్ధవాతావరణం నెలకొన్న నేపథ్యంలో బాపట్లలోని కొత్త, పాతబస్టాండ్లలో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఏఆర్ పోలీసులు, బాంబుస్క్వాడ్, పోలీసు జాగిలాలతో బస్టాండ్లలోని పార్సిల్ కేంద్రాలు, ప్రయాణికుల బ్యాగ్‌లు, బస్సుల్లోనూ తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా డీఎస్పీ రామాంజనేయులు మాట్లాడుతూ అనుమానిత వ్యక్తుల సమాచారాన్ని ఎప్పటికప్పుడు పోలీసులకు ఇవ్వాలని ప్రజలకు సూచించారు. క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే వస్తువులను డెలివరీకు పంపించాలని కొరియర్ యజమాన్యానికి సూచించారు. ఈ తనిఖీల్లో డీఎస్పీలు రామాంజనేయులు, విజయసారథి, సీఐ రాంబాబు, ఎస్ఐలు శ్రీనివాసరావు, చంద్రావతి తదితరులు పాల్గొన్నారు.

అమరావతి ఉద్యమ నేతలకు పెద్దపీట




రాయపాటి శైలజ | ఆలపాటి సురేష్ | డాక్టర్ రవి వేమూరి | మల్లె ఈశ్వరరావు

- ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా రాయపాటి శైలజ
- 'విధ్వంసం' రచయిత ఆలపాటి సురేష్‌కు ప్రెస్ అకాడమీ చైర్మన్
- వడ్డెర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌గా మల్లె ఈశ్వరరావు
- ఏపీఎన్ఆర్‌టీఎస్ చైర్మన్‌గా తెనాలివాసి డాక్టర్ రవి వేమూరి

గుంటూరు, తూర్పు, తెనాలి, మే 11 (ఆంధ్రజ్యోతి): తాజాగా ప్రకటించిన నామినేటెడ్ పోస్టుల్లో అమరావతి ఉద్యమ నేతలతో పాటు విధేయ నేతలకు ప్రభుత్వం పెద్దపీట వేసింది. ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన నలుగురు నేతలను కీలక కార్పొరేషన్ చైర్మన్ పదవులు వరించాయి. అమరావతి జేఏసీ నేతగా గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ రాయపాటి శైలజకు ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి, అమరావతి ఉద్యమ నేపథ్యం, గత ఐదేళ్ల అరాచక పాలనపై 'విధ్వంసం' అనే నవలా రచయిత ఆలపాటి సురేష్‌కు ప్రెస్‌అకాడమీ చైర్మన్ పదవి ఇచ్చి వారి సేవలను గుర్తించింది.

- రాయపాటి శైలజ మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు సోదరుడైన గోపాలకృష్ణ (చిన్ని) కుమార్తె. రాజకీయ కుటుంబ నేపథ్యం ఉన్నా ఆమె పెద్దగా రాజకీయాల్లో లేరు. వైసీపీ ప్రభుత్వం తెరమీదకు తెచ్చిన మూడు రాజధానులను వ్యతిరేకిస్తూ శైలజ పోరు బాటతో తెరపైకి వచ్చారు. అమరావతి రక్షణ కోసం ఏర్పాటైన అమరావతి పరిరక్షణ సమితిలో భాగ స్వామిగా మారి ఉద్యమాన్ని ముందుండి నడిపారు. 2020 మార్చి 8న చేపట్టిన కనకదుర్గమ్మ ముడుపుల కార్యక్రమంలో ఆమెపై పోలీసులు విరుచుకుపడినా వెనక్కి తగ్గలేదు. ఆ తర్వాత న్యాయస్థానం టూ దేవస్థానం పాదయాత్రలో క్రియాశీలకంగా పాల్గొన్నారు. 54 రోజులు సాగిన పాదయాత్రలో ఆమె అగ్రభాగాన నిలిచారు. వెయ్యిరోజుల ఉద్యమ నేపథ్యంలో చేపట్టిన మహాపాదయాత్ర-2.0లో కూడా శైలజ కీలకపాత్ర పోషించారు. ఈ నేపథ్యంలో అమరావతి ఉద్యమంలో ఆమె పోరాటాన్ని గుర్తించిన ప్రభుత్వం ఏపీ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ పదవి ఇచ్చి గౌరవించింది.
- తెనాలికి చెందిన ఆలపాటి సురేశ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఏపీ ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా నియమించింది. ఆయన ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియాల్లో వివిధ హోదాల్లో పని చేశారు. టీవీ-9లో ఇన్‌పుట్ ఎడిటర్‌గా పనిచేశారు. జర్నలిస్టు ఉద్యమంలో అత్యంత క్రియాశీలకంగా ఉండే ఆలపాటి సుదీర్ఘకాలం ఏపీయూడబ్ల్యూజే, ఐజేయూల్లో కీలక బాధ్యతలు నిర్వహించారు. ఆయన రచించిన విధ్వంసం పుస్తకాన్ని ప్రతిపక్ష నేతగా చంద్రబాబు అప్పట్లో ఆవిష్కరించారు.
- గుంటూరు పశ్చిమ నియోజకవర్గానికి చెందిన మల్లె ఈశ్వరరావును వడ్డెర సంక్షేమ, అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ పదవి వరించింది. టీడీపీ బీసీ విభాగం, రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా, ఎన్టీఆర్ జిల్లాకో ఆర్డినేటర్‌గా, ఏపీ వడ్డెర సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా ఆయన ఉన్నారు. దీర్ఘకాలంగా పార్టీకి అందించిన సేవలను గుర్తింపుగా ఈ పదవి ఆయన్ను వరించింది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వడ్డెరల సంక్షేమానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు.
- తెనాలికి చెందిన ఎన్నారై డాక్టర్ రవి వేమూరిని ఏపీ నాన్ రెసిడెన్షియల్ తెలుగు సొసైటీ(ఏపీఎన్ఆర్‌టీఎస్) చైర్మన్ పదవి వరించింది. తెనాలికి చెందిన వేమూరి అభిరామేశ్వరరావు, ఆంధ్రభారతి దంపతుల కుమారుడైన రవి వైద్యరంగంలో విశేష సేవలందిస్తూ అమెరికాలో స్థిరపడ్డారు. 2014 నుంచి 2019 మధ్య కూడా ఆయన ఇదే సొసైటీకి చైర్మన్‌గా పనిచేశారు. ఆ సమయంలో ఆయన చేసిన సేవలకు గుర్తుగానే మరోసారి కూటమి ప్రభుత్వం చైర్మన్ బాధ్యతలను తిరిగి ఆయనకు అప్పగించింది. ప్రవాస తెలుగువ్యవహారాల సలహాదారుడిగా గతంలో రవి పనిచేశారు. రాష్ట్రం ప్రస్తుతం ఉన్న పరిస్థితుల్లో పెట్టుబడుల అవసరం ఎక్కువగానే ఉందని వీటిని సాధించేందుకు కృషి చేస్తానని రవి తెలిపారు.

సన్‌డే



- పెరిగిన ఎండ తీవ్రత
- రోహిణి కార్తెకు ముందే భగభగ


గుంటూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): ఎండ.. ఉక్కపోత మధ్య అడపాదడపా ఈదురుగాలులు.. ఆకాశం మేఘావృతం.. వర్షాలతో ఉపశమనం పొందిన ప్రజలు ఆదివారం పెరిగిన ఉష్ణోగ్రతతో అల్లాడిపోయారు. ఆదివారం గుంటూరు, పల్నాడులో జిల్లావ్యాప్తంగా, బాపట్ల జిల్లాలో పలు మండలాల్లో భానుడు భగభగమని మండాడు. రోహిణీ కార్తెకు 15 రోజుల ముందే ఎండ తీవ్రత పెరిగింది. ఆదివారం నుంచి కృతిక కార్తె ప్రారంభం కావడంతో ఆ ప్రభావం స్పష్టంగా కనిపించింది. ఉదయం నుంచే భానుడు భగభగలాడటంతో మధ్యాహ్నం వేళ వాతావరణంలో సెగలుగక్కాయి. గుంటూరు జిల్లాలో ఈ వేసవిలో తొలిసారిగా ఉష్ణోగ్రతలు 40 డిగ్రీల సెల్సియస్‌ని దాటాయి. పల్నాడు జిల్లాలో అచ్చంపేట, కారంపూడి, క్రోసూరు, నరసరావుపేటలో 41 డిగ్రీల సెల్సియస్‌కు పైగా ఉష్ణోగ్రత నమోదైంది. నాదెండ్ల, అమరావతి, మాచర్లలో 40 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. ప్రత్తిపాడు మండలంలో 36.9 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. సోమవారం నుంచి అన్ని మండలాల్లో 43 డిగ్రీలు, మంగళవారం 44 డిగ్రీల సెల్సియస్‌ని దాటి నమోదవుతాయని పేర్కొన్నది.



శ్రీమత్సుందరవల్లీ రాజ్యలక్ష్మీసమేత శ్రీక్షీరభావన్నారాయణస్వామి దేవాలయం

బాపట్ల ఇలవేల్పు.. భావన్నారాయణస్వామి

నేడు రథోత్సవం



శ్రీభావన్నారాయణస్వామి

బాపట్ల, మే11 (ఆంధ్రజ్యోతి) : బాపట్లలోని భావన్నారాయణస్వామి దేవాలయం భారతదేశంలోని ప్రాచీన వైష్ణవ క్షేత్రాలలో ఒకటి. ఇది సుమారు 1432 సంవత్సరాలకు పూర్వం చోళులచే నిర్మితమైనది. భావన్నారాయణస్వామి పేరిట ఈ ఊరికి భావపురి అనే పేరు వచ్చింది. కాలానుగుణంగా ఆపేరు రూపాంతరం చెంది భావపట్లగా, బాపట్లగా మారింది. ప్రతి సంవత్సరం వేసవికాలంలో వైశాఖమాసంలో వైభవంగా జరిగే తిరునాళ్ళ బ్రహ్మోత్సవాలకు లక్షల సంఖ్యలో భక్తులు విచ్చేస్తుంటారు.

శ్రీ భావదేవుని 1432వ నవాహ్నిక వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం తెల్లవారుజామున శ్రీవారి కళ్యాణ మహోత్సవం జరుగుతుంది. ఉదయం గరుడోత్సవం, సాయంత్రం స్వామివారి రథోత్సవం (బావయ్యపౌర్ణమి) నిర్వహించేందుకు పెద్దఎత్తున ఏర్పాట్లుచేశారు. రథోత్సవం రోజు జరిగే తిరునాళ్ళ మహోత్సవానికి పరిసరప్రాంత ప్రజలతోపాటు దూరప్రాంతాల నుంచి కూడా భక్తజనం విశేష సంఖ్యలో తరలి వస్తారు. కార్యక్రమంలో భాగంగా మాజీ ఎమ్మెల్సీ, బీజేపీనాయకులు అన్నం సతీష్ ప్రభాకర్ ఆధ్వర్యంలో శ్రీ భావపురి అయ్యప్ప సేవాసంఘం ద్వారా ఉదయం అన్నసంతర్పణ ఏర్పాటు చేస్తున్నారు.

రథోత్సవానికి ప్రముఖులు రాక

కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరగుతున్న మొదటి శ్రీ క్షీరభావన్నారాయణ స్వామి రథోత్సవానికి మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, కొలుసు పార్థసారథి, అనగాని సత్యప్రసాద్, గొట్టిపాటి రవికుమార్, బాపట్ల పార్లమెంట్ సభ్యుడు తెన్నేటి కృష్ణప్రసాద్,బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి ముఖ్యఅతిథులుగా పాల్గొంటారని బాపట్ల శాసన సభ్యుడు వేగేశన నరేంద్రవర్మ తెలిపారు. నేడు జరిగే రథోత్సవానికి ప్రజలు అధిక సంఖ్యాలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు.

నేడు మంత్రి రవికుమార్ పర్యటన వివరాలు

అద్దంకి, మే11(ఆంధ్రజ్యోతి): విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సోమవారం పలు కార్యక్రమాలలో పాల్గొననున్నారు. ఉదయం 9 గంటలకు ఏడుగుండ్లపాడు వద్ద హర్షిణి ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ మహిళా కళాశాల ప్రారంభోత్సవం, 10 గంటలకు అద్దంకిలోని శ్రీనగర్‌లో వర్షిక ఆర్థో స్కిన్ అండ్ ట్రామా కేర్ ప్రారంభోత్సవం, 10-30 గంటలకు 5వ వార్డు, 10-45 గంటలకు 19వ వార్డు, 11-30 గంటలకు పంగులూరు మండలం రామకూరు, సాయంత్రం 3 గంటలకు ఒంగోలులోని కలెక్టర్ కార్యాలయంలో పలు సమావేశంలో రవికుమార్ పాల్గొననున్నారు.

నేడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

అద్దంకిటౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సాధారణ సమావేశం సోమవారం ఉదయం 11 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశపు హాలులో జరుగుతుందని ఎంపీడీవో బత్తిన సింగయ్య ఆదివారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు. సభ్యులు, సర్పంచ్‌లు, అధికారులు హజరు కావాలని తెలిపారు.

31లోపు కౌలుదారు గుర్తింపు కార్డులు

పంగులూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): కౌలు రైతులు ఈ నెల 31వ తేదీలోగా గుర్తింపు కార్డులు పొందాలని తహసీల్దార్ పి.సింగారావు, ఏవో సుబ్బారెడ్డిలు ఒక సంయుక్త ప్రకటనలో కోరారు. గుర్తింపు కార్డు పొందేందుకు భూమి యజమాని పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు జిరాక్స్‌లు, కౌలు రైతు ఆధార్ కార్డ్, కౌలుదారుని బ్యాంక్ అకౌంట్ జిరాక్స్‌లతో పాటు, కౌలుదారుని పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోలు, భూ యజమాని మొబైల్ నెంబరుతో సంబంధిత వీఆర్వోని సంప్రదించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. సీసీఆర్సీ గుర్తింపు కార్డు కలిగిన కౌలు రైతులకు మాత్రమే ప్రభుత్వ రాయితీలు పొందే అవకాశం ఉంటుందని ఏవో సుబ్బారెడ్డి తెలిపారు.

ఎరుకులకు న్యాయం చేయండి

చీరాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ఆటోనగర్ భూములు ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉన్నాయని, కొందరు ఉద్దేశపూర్వకంగానే వాటిని ఇతరులకు విక్రయిస్తున్నారని సాల్వేషన్ ఆర్మీ భూముల కమిటీ ప్రతినిధులు ఆరోపించారు. ఆదివారం ఆటోనగర్ వద్ద సమావేశం నిర్వహించారు.

ఆదివారం ఆధ్యాత్మిక శోభ

కన్నులపండువగా భీమలింగేశ్వర స్వామి గ్రామోత్సవం

పంగులూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పంగులూరులోని శ్రీ భీమలింగేశ్వర స్వామి వార్షిక మహోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. శనివారం రాత్రి విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవాచన, పంచగవ్యం దీక్షాధారణ, అఖండస్థాపన, అంకురారోపణ, వాస్తుపూజ, ధ్వజారోహణ కార్యక్రమాలు జరిగాయి. ఆదివారం ఉదయం నిత్యోపాసన, బలిహరణ, మహన్యాసపూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారి కుంకుమార్చన, స్వామిని పెళ్లి కుమారుని చేసే వేడుక, ఆలయ బలిహరణ, గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం రాయబారం, స్వామి దివ్య కల్యాణోత్సవం కన్నుల పండువగా జరిగింది. భక్తులు స్వామివారి కళ్యాణోత్సవాన్ని తిలకించి తరించారు. బ్రహ్మశ్రీ పేటేటి ఉదయభాస్కరశర్మ సారథ్యంలో సాగిన ఈ పూజా కార్యక్రమాలలో వంశపారంపర్య అర్చకులు చందలూరి సునీల్‌కుమార్‌శర్మ, కారంచేటి సాంబశివరావులు పాల్గొనగా, ఆలయ ఈవో శ్రీనివాసరావు కార్యక్రమాలను పర్యవేక్షించారు.

నేడు పౌర్ణమి తిరునాళ్ల మహోత్సవం

భీమలింగేశ్వరస్వామి వార్షిక మహోత్సవం సందర్భంగా సోమవారం పౌర్ణమి తిరునాళ్ల జరగనుంది. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో రెండు విద్యుత్ ప్రభలను ఏర్పాటు చేస్తున్నారు. ఉదయం 6 గంటలకు నిత్యోపాసన, ఆలయ బలిహరణ, గ్రామోత్సవం అనంతరం అవధూతేంద్ర భక్తమండలి వారి ఏకాహం, రాత్రి ఏడు గంటలకు గండపెండేర గ్రహీత చెన్నుపల్లి నాగేశ్వరరావు శిష్య బృందంచే (54 మంది మహిళలచే) కోలాట ప్రదర్శన జరగనుంది.



చెరుకూరులో ప్రత్యేక అలకరణలో త్రివిక్రమ అగస్తేశ్వరస్వామి

ఘనంగా నృసింహస్వామి జయంతి

చినగంజాం, మే 11(ఆంధ్రజ్యోతి) : స్థానిక భూ సమేత భావనారాయణ స్వామి దేవస్థానంలో నృసింహస్వామి జయంతి వేడుకలను ఆదివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామి జయంతి సందర్భంగా పూజారి మోహన లక్ష్మీనరసింహాచార్యులు ఆధ్వర్యంలో స్వామిని సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకించారు. స్వామి విశిష్టత గురించి భక్తులకు వివరించారు. పూజలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు వినియోగం చేశారు. ఆలయ ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు, సేవా దళ్ సభ్యులు జి.పిచ్చయ్య ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు.

ఘనంగా పోలేరమ్మ తిరునాళ్ల

మండలంలోని కడవకుదురు గ్రామంలో వేంచేసియున్న పోలేరమ్మ తిరునాళ్ల వార్షికోత్సవ పూజలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సీతా లక్ష్మణ్ హనుమత్ సమేత కోదండ రామస్వామి దేవస్థానం ప్రాంగణంలోని మహాలక్ష్మీ అమ్మవారికి వేద పండితులు మాజేటి సాయిరాంశర్మ ఆధ్వర్యంలో మాల్లాది శేఖర బాబు దంపతులు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. తదనంతరం అంకమ్మ తల్లి, పోతురాజు శిల వద్ద పూజలు చేశారు. పూజారి బ్రహ్మయ్య పోలేరమ్మ అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు జరిపారు. నామన లక్ష్మణరావు, బొప్పన పూర్ణచంద్రరావు, గొల్లపూడి సూర్యం, బత్తిన రామస్వామి, నాగిరెడ్డి నాగేశ్వరరావు, గాజుల వెంకటేశ్వర్లు, తోట శ్రీనివాసరావు, సిద్ధాబత్తిన భాస్కర్, సూరగాని రామకృష్ణ పర్యవేక్షించారు.



కడవకుదురులో పోలేరమ్మ

త్రివిక్రమ అగస్తేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

పర్చూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం చెరుకూరు గ్రామంలో వేంచేసియున్న శ్రీ త్రివిక్రమ, అగస్తేశ్వర స్వామి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. స్వామిని వివిధ రకాల పూలతో అలంకరించారు. స్వామి కల్యాణ వేడుకల్లో భాగంగా వారం రోజుల నుంచి ఆలయంలో వివిధ రకాల అభిషేకాలు, పూజాకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కల్గకుండా ఆలయ కార్యనిర్వాహక కార్యదర్శి బి.నాగయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

పంగులూరులో...

పంగులూరు, మే 11(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండమూరు గ్రామంలో కుంచాల వంశస్థుల వంశదేవర రేణుకమ్మ, అంకమ్మతల్లి కొలుపు ఉత్సవం ఆదివారంతో ముగిసింది. శనివారం రాత్రి గ్రామంలో జరిగిన గ్రామోత్సవంలో వివిధ ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో తరలివచ్చిన కుంచాల వంశస్థులతో పాటు గ్రామంలోని భక్తులు పాల్గొని సందడి చేశారు. ఆదివారం సాయంత్రం జరిగిన దీన బండారు కార్యక్రమంతో ఉత్సవం ముగిసింది.

మహాకుంభాభిషేకం కలశయాత్రలో పాల్గొననున్న ఏనుగు

ఏర్పాట్లను పరిశీలించిన అటవీశాఖ అధికారులు

19న గుండ్లకమ్మ నది నుంచి శింగరకొండ వరకు

వెయ్యి మంది మహిళలతో కలశ పాదయాత్ర

అద్దంకి, మే 11 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం మహాకుంభాభిషేకం సందర్భంగా కలశయాత్రలో పాల్గొనేందుకు ఏనుగు వస్తున్న నేపథ్యంలో శింగరకొండలో ఏర్పాట్లను ఆదివారం అటవీశాఖ అధికారులు, ఈవో తిమ్మానాయుడు పరిశీలించారు. కర్ణాటక రాష్ట్రం రాయచూర్ నుంచి ప్రత్యేకంగా ఏనుగును తీసుకురానున్నారు. 19వ తేదీ ఉదయం 5 గంటలకు అద్దంకి సమీపంలోని గుండ్లకమ్మ నది నుంచి వెయ్యి మందికి పైగా మహిళలతో కలశ పాదయాత్ర ప్రారంభమై పట్టణంలో గుండా శింగరకొండ వరకు సాగనుంది. కలశపాద యాత్ర ముందు భాగంలో ఏనుగు నడవనుంది. అదే సమయంలో అభిషేకంలో ఏనుగు పాల్గొననుంది. ఈ నేపథ్యంలో 16వ తేదీకి ఏనుగు శింగరకొండ చేరుకొని 20వ తేదీ తిరిగి వెళ్లనుంది. ఈ నేపథ్యంలో విశ్రాంతి తీసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లను ఆదివారం చీరాల ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ రమణారావు, వేటపాలెం సెక్షన్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, కూకట్లపల్లి బీట్ ఆఫీసర్ రమేష్, ఈవో పరిశీలించారు.

శింగరకొండ రాతి మండపం నిర్మాణానికి లక్ష రూపాయల విరాళం

అద్దంకి, మే 11 (ఆంధ్రజ్యోతి) : శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానం రాతి ముఖమండపం పునఃనిర్మాణానికి బొమ్మనంపాడు సర్పంచ్ గోరంట్ల పద్మావతి, శ్రీనివాసరావు దంపతులు ఆదివారం 1,00,116 రూపాయలను ఈవో తిమ్మానాయుడుకు అందజేశారు. బల్లికురవ మండలం కొత్తపాలేనికి చెందిన మాలపాటి పోతురాజు, వెంకటరత్నం దంపతులు ఇటీవల రాతి మండపం నిర్మాణానికి లక్ష రూపాయలు విరాళం అందజేయగా ఆదివారం అన్నదానానికి 4,500 రూపాయలు అందజేశారు. దాతలను ఈవో సత్కరించారు.



విరాళం రసీదును సర్పంచ్ పద్మావతి, శ్రీనివాసరావు దంపతులకు అందజేస్తున్న ఈవో తిమ్మానాయుడు

భారత జవాన్ల పోరాటం ఎనలేనిది

చీరాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : పాక్ ఉగ్రవాదులపై భారత వీర జవాన్లు చేస్తున్న పోరాటం ఎనలేనిదని ఎన్ఆర్ అండ్ పీఎం హైస్కూల్ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు చెప్పారు. ఆదివారం పట్టణంలో వీర జవానులకు మద్దతుగా సమైక్యత ర్యాలీ నిర్వహించారు. వీర మరణం పొందిన మురళీ నాయక్‌కు నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ప్రతినిధులు పోలుదాసు రామకృష్ణ, వెంకటేశ్వరరావు, గురుప్రసాద్, సురేష్, నారాయణమూర్తి, రాఘవరావు, బదిరి, పూర్ణ, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.



చీరాలలో ర్యాలీ నిర్వహిస్తున్న వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

ప్రత్యేక పూజలు

జాండ్రపేటలో వేంచేసియున్న శ్రీ గంగా భ్రమరాంబ సమేత నాగలింగేశ్వర స్వామి దేవస్థానంలో ప్రధానీ మోదీ, జవాన్ల యోగక్షేమం కోసం బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో నాయకులు మువ్వల వెంకటరమణరావు, బండారుపల్లి హేమంత్ కుమార్, మనోహరరెడ్డి, కాశిక, రఘునాథ్, శైలజ, శివాజీ, వెంకటేశ్వర్లు, రామస్వామి, భరణిరావు పాల్గొన్నారు.

సంతమాగులూరులో...

సంతమాగులూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలం కామేపల్లిలో అమర వీరుల ఆత్మశాంతి చేకూరాలని క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. పాస్టర్ డాక్టర్ బొంత స్వర్ణరాజు, సంఘ సభ్యులు లక్కెపోగు బెంజమ్మ, లక్కెపోగు బాబు శ్యామ్‌ప్రసాద్ పాల్గొన్నారు.

అమరవీరునికి నివాళులు

మార్టూరు, మే11 (ఆంధ్రజ్యోతి) : పాకిస్థాన్‌తో జరిగిన యుద్ధం నేత్వత్వంలో వీరోచితంగా పోరాడి అమరవీరుడైన సైనికుడు మురళీనాయక్ చిత్రపటం వద్ద మార్టూరులో సాయి అపార్టుమెంట్ వాసులు ఘనంగా నివాళులు అర్పించారు. ఆదివారం రాత్రి జరిగిన ఈ కార్యక్రమంలో మురళీనాయక్ చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో జాష్టి కోటయ్య, అపార్ట్‌మెంట్ వాసులు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ని పరామర్శించిన టీడీపీ నేతలు

పంగులూరు, మే 11(ఆంధ్రజ్యోతి) :టీడీపీ సీనియర్ నాయకులు, రామకూరు గ్రామ మాజీ సర్పంచ్ మానం సుబ్బారావును మండల నేతలు ఆదివారం పరామర్శించారు. కొంతకాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతూ ఇంటికే పరిమితమై విశ్రాంతి తీసుకుంటున్న సుబ్బారావు ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ ఉప సర్పంచ్ అశోక్‌తో పాటు మండల టీడీపీ అధ్యక్షుడు రావూరి రమేష్, నాయకులు బాలిన రామసుబ్బారావు, కుక్కపల్లి ఏడుకొండలు, చింతల సహదేవుడు, ఆదిరెడ్డి, నాగిరెడ్డి, కోమటి ప్రసాద్, శివరాజు, పచ్చాశ్రీను, నారాయణస్వామిలు ఉన్నారు

నల్ల బర్లీ కొనుగోలుకు చర్యలు చేపట్టాలి

పంగులూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : రైతుల దగ్గర నిల్వ ఉన్న బర్లీ పొగాకు నిల్వలను ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని రైతు సంఘం ప్రతినిదులు డిమాండ్ చేశారు. ఆదివారం పంగులూరులో రైతుసంఘం జిల్లా కార్యదర్శి తలపనేని రామారావు, సీనియర్ నాయకులు కందిమళ్ల రామకోటేశ్వరరావులు విలేకర్లతో మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సమక్షంలో కంపెనీ ప్రతినిధులు, రైతు సంఘం నాయకుల మధ్య జరిగిన చర్చల విధి విధానాలు నేటికీ అమలుకు నోచుకోలేదన్నారు. తొలి రెండు ఒలుపుల ఆకును కొనుగోలు చేయకుండా టాప్ ఒలుపుకు సంబంధించిన పొగాకును గ్రేడ్ చేయించి నాణ్యత పేరుతో దానిని మాత్రమే కొనుగోలు చేస్తున్నారని చెప్పారు. నాణ్యత పేరుతో ఎకరాకు ఒకటి, రెండు క్వింటాళ్లు వచ్చే పొగాకును మాత్రమే కొనుగోలు చేస్తే బర్లీ రైతులు తీవ్రంగా నష్టపోతారని చెప్పారు.

ట్రాఫిక్ నిబంధనలు కచ్చితంగా పాటించాలి

వేటపాలెం/చీరాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : వాహనదారులు నిబంధనలు అనుసరించాలని ఎస్సై వెంకటేశ్వర్లు చెప్పారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆదివారం స్టేషన్ పరిధిలోని పొట్టిసుబ్బాయ పాలెం జంక్షన్‌లో తనిఖీలు నిర్వహించారు. పలు వాహనాల పత్రాలను పరిశీలించారు. అనుమానితుల వివరాలను సేకరించారు. ట్రాఫిక్ విధానాలను వివరించారు. అలాగే వన్‌టౌన్ స్టేషన్ పరిధిలో వాహనాల తనిఖీలు జరిగాయి.

ఏల్చూరు టోల్ ప్లాజా వద్ద పోలీసుల తనిఖీలు



కారును తనిఖీ చేస్తున్న పోలీసులు

సంతమాగులూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): అద్దంకి-నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై సంతమాగులూరు మండలం ఏల్చూరు టోల్ ప్లాజా వద్ద పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. సీఐ ప్రభాకర్ పాల్గొన్నారు.

అవీఇవీ

గుర్తు తెలియని వాహనం ఢీ.. వ్యక్తి మృతి

సంతమాగులూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : అద్దంకి - నార్కెట్‌పల్లి ప్రధాన రహదారిపై సంతమాగులూరు మండలం కొమ్మలపాడు గ్రామం వద్ద ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి మరణించాడు. వివరాల్లోకెళ్తే... అద్దంకి పట్టణానికి చెందిన గుంజి రామాంజనేయులను గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు నరసరావుపేట ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా మృతి చెందాడు.

బార్ అండ్ రెస్టారెంట్‌లో వాగ్వాదం

దాడులు చేసుకున్న మందుబాబులు..రాళ్లు సైతం విసిరిన వైనం



మందుబాబులను వెనక్కి పంపిస్తున్న పోలీసులు

చీరాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : చీరాల పట్టణంలోని ఓ బార్ అండ్ రెస్టారెంట్‌లో మందుబాబులు భీబత్సం సృష్టించారు. ఆదివారం సాయంత్రం బార్ అండ్ రెస్టారెంట్‌లో రెండు వేర్వేరు టేబుల్స్ వద్ద మద్యం సేవిస్తున్న ఇద్దరు యువకులకు ఒక వ్యక్తికి వాగ్వాదం చోటుచేసుకుంది. దీంతో అతను ఇద్దరు యువకులపై తీవ్రంగా దాడిచేశాడు. ఆ తర్వాత యువకులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. పది నిమిషాల తరువాత ఆ యువకులు బార్ అండ్ రెస్టారెంట్ వద్దకు చేరుకుని అతనిపై దాడికి దిగారు. అతను ఓ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకోవడంతో ఆగ్రహించిన ఇద్దరు యువకులు బార్ మీదకు రాళ్లు రువ్వారు. చాకులు తీసుకుని భవనం చుట్టూ తిరిగారు. ఈ క్రమంలో బార్ నిర్వాహకులు పోలీసులకు సమాచారమిచ్చారు. పోలీసులు రావడంతో మందుబాబులు పరుగులు తీశారు. కొంత మందిని పోలీసులు బలవంతంగా అక్కడనుంచి పంపారు. సీసీ కెమెరాల ఆధారంగా దాడులు చేసుకున్న వారి వివరాలను గుర్తిస్తున్నారు.

జూదరుల అరెస్టు

రూ.5100 నగదు, 2 కోళ్లు స్వాధీనం

పర్చూరు, మే 11 (ఆంధ్ర జ్యోతి) : పర్చూరు మండలం నూతలపాడులో ఆదివారం కోడి పందాల శిబిరంపై పోలీసులు దాడులు చేశారు. ఒడ్డెరపాలెం సమీపంలో కోడిపందాలు నిర్వహిసున్న ఆరుగురు వ్యక్తులను అరెస్టు చేసి వారి వద్ద రూ.5100 నగదుతోపాటు, రెండు కోడిపుంజులను కూడా స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై మాల్యాద్రి తెలిపారు.

ఘనంగా ప్రపంచ మాతృ దినోత్సవం

అద్దంకిటౌన్, మే 11(ఆంధ్రజ్యోతి): బిడ్డల సంరక్షణలో, వారి పురోభివృద్ధిలో తల్లి పాత్ర ఎంతో ఉన్నతమైనదని పలువురు వక్తలు కొనియాడారు. ఆదివారం రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ ఆధ్వర్యంలో స్థానిక ముస్లిం షాదీఖానాలో రోటరీ మాజీ అధ్యక్షుడు హాజీ సయ్యద్ మౌలాలి సౌజన్యంతో ప్రపంచ మాతృమూర్తుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆరుగురు మాతృమూర్తులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య, సెక్రటరీ మురళి సుధాకరరావు, ట్రెజరర్ మలాది శ్రీనివాసరావు, మహమ్మద్ రఫీ, దేవపాలన, శ్రీరామచంద్రమూర్తి, చంద్రమౌళి, లేవి ప్రసాద్, శివకుమారి, శ్రీలక్ష్మి, భువనేశ్వరి పాల్గొన్నారు.

మొక్కు చెల్లించుకున్న ముక్తేశ్వరం టీడీపీ నేత

బల్లికురవ, మే 11 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం పార్టీ కూటమి అధికారంలోకి వచ్చి శాసనసభ్యులు గొట్టిపాటి రవికుమార్‌కు మంత్రి పదవి రావాలని ముక్తేశ్వరం గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త నాగండ్ల యలమందరావు వేములమ్మ తల్లిని మొక్కుకున్నారు. అనుకున్నవన్నీ జరగటంతో ఆదివారం ముక్తేశ్వరం గ్రామం నుంచి యలమందరావు ఆధ్వర్యంలో 70 మంది టీడీపీ కార్యకర్తలు కోటప్పకొండ వద్ద ఉన్న వేములమ్మతల్లి వద్దకు వెళ్లి మొక్కులు తీర్చుకున్నారు.

గ్రామస్థుల సహకారంతో శ్మశాన వాటిక అభివృద్ధి

పర్చూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : పర్చూరు మండలం నాగులపాలెం గ్రామాభివృద్ధి కోసం గ్రామస్థులు కలసి కట్టుగా ముందుకు సాగారు. అందులో భాగంగా శ్మశానవాటిక అభివృద్ధికి కార్యాచరణ రూపొందించారు. రూ.కోటి వ్యయంతో నిర్మాణం తలపెట్టిన శ్మశాన వాటికకు ఆదివారం శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీమాజీ సభ్యుడు కొల్లా సుభాష్‌బాబు, అడ్డగడ కుప్పయ్య చౌదరి, కొల్లా శ్రీనివాసరావు(ఫ్యాక్టరీ), అడ్డగడ శ్రీనివాసరావు, చాగంటి నాగేశ్వరరావు, సోమేపల్లి వెంకన్న, కొల్లా సుబ్బారావు, కొల్లా నాగేశ్వరావు పాల్గొన్నారు.

శింగరకొండలో డాక్టర్ లక్ష్మి దంపతుల పూజలు

అద్దంకి,మే11(ఆంధ్రజ్యోతి): శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ఆదివారం దర్శి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి డాక్టర్ గొట్టిపాటి లక్ష్మీ, డాక్టర్ కడియాల లలిత్‌సాగర్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. లక్ష్మీ జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఈవో తిమ్మానాయుడు, వేదపండితులు, పూజారులు ఆశీర్వదించి సత్కరించారు. ముందుగా సంతమాగులూరు మండలం పుట్టావారిపాలెం కూడలిలో తాత దివంగత మంత్రి గొట్టిపాటి హనుమంతరావు విగ్రహానికి లక్ష్మీ, లలిత్ సాగర్ దంపతులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం కేక్ కట్ చేశారు. సంతమాగులూరు ఏఎంసీ చైర్మన్ తేలప్రోలు రమేష్, సన్నిబోయిన ఏడుకొండలు, గురుయాదవ్, వాసుదేవరెడ్డి, అద్దంకి, దర్శి నియోజకవర్గాలకు చెందిన పలువురు టీడీపీ నేతలు పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి క్రికెట్ పోటీలు



కప్ అందుకుంటున్న విజేతలు


జాండ్రపేట(చీరాల), మే 11 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని జాండ్రపేట బీవీ అండ్‌బీఎన్ హైస్కూల్లో జరుగుతున్న రాష్ట్రస్థాయి రెడ్ టెన్నిస్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఆదివారం జరిగిన పోరులో డీసీసీ, బీవీ అండ్ బీఎన్ హైస్కూల్‌జట్లు తలపడ్డాయి. డీసీసీ జట్టు నిర్ణీత 12 ఓవర్‌లకు 126పరుగులు చేయగా, బీవీఅండ్‌బీఎన్ జట్టు కూడా 126 పరుగులే చేయడంతో మ్యాచ్ డ్రా అయింది. సూపర్ ఓవర్‌లో డీసీసీ 4 పరుగులు చేయగా. బీవీఅండ్‌బీఎన్ 3 పరుగులు చేసి ఓటమి చవిచూసింది. విజేత జట్టుకు రూ.30 వేలు, బీవీఅండ్‌బీఎన్ జట్టుకు రెండో బహుమతి రూ.20 వేలు, మూడో బహుమతి హైమాహాస్పిటల్ యూత్ రూ. 10 వేలు, వేటపాలెం ఫ్రెండ్స్ టీంకు నాలుగవ బహుమతి రూ. 7500 అందజేశారు.

వ్యంగ్యం, హాస్యంతో అలరించిన కవులు

చీరాల, మే 11 (ఆంధ్రజ్యోతి) : పూర్వం కవులు సందర్భానుచితంగా సాహిత్యంతో వ్యంగ్యం, హాస్యభాస్యంతో అలరించే వారని, ఆ తీపి మధురాలు ఎనలేనివని ప్రముఖ సాహితీవేత్త యడ్లపల్లి శ్రీరామమూర్తి చెప్పారు. ఆదివారం స్థానిక సీనియర్ సిటిజన్స్ కార్యాలయంలో సాహితీ సదస్సు కార్యక్రమం జరిగింది. ముఖ్య అతిథిగా యడ్లపల్లి హాజరై ఉపన్యసించారు. కవి పండితులు ప్రయోగాత్మకంగా అలరించే పలు అంశాలను వివరించి అందర్నీ ఉత్సాహపరిచారు. అలాగే సాహిత్యంలో చమత్కారాలు అంశంపై అవగాహన కల్పించారు. అనంతరం సీనియర్ సిటిజన్స్ శ్రీరామమూర్తిని ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో అధ్యక్ష, కార్యదర్శులు హరిహరరావు, రామారావు, బీరక సుందరరావు తదితరులు పాల్గొన్నారు.



ప్రముఖ సాహితీవేత్త శ్రీరామమూర్తిని సత్కరిస్తున్న ప్రతినిధులు



ఉష్ణోగ్రత వివరాలు

కేంద్రం	గరిష్ఠం	కనిష్ఠం
నెల్లూరు	40.7	29.5
కావలి	38	29
ఆత్మకూరు	39	30
ఉదయగిరి	40	29
కందుకూరు	38	29



సీనియర్లకు సముచితస్థానం

- ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు చైర్మన్‌గా డాక్టర్ శివప్రసాద్
- ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాలేపాటి
- ఇద్దరూ పార్టీకి విధేయులే...

నెల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): పార్టీ విధేయులకు టీడీపీ పట్టం కట్టింది. ఆదివారం రాత్రి ప్రకటించిన నామినేటెడ్ పదవుల్లో జిల్లాకు చెందిన మరో ఇద్దరు సీనియర్ నేతలకు రాష్ట్రస్థాయి చైర్మన్ పోస్టులను అధిష్ఠానం ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు చైర్మన్ డాక్టర్ జడ్ శివప్రసాద్, ఆంధ్రప్రదేశ్ ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా మాలేపాటి సుబ్బానాయుడు పదవులు దక్కించుకున్నారు. దీంతో పార్టీకి వీరవిధేయులుగా ఉన్న సీనియర్ నేతల జాబితాలోని మరో ఇద్దరికి పదవులు దక్కినట్లయింది.

నిబద్ధతతో పనిచేయడం జడ్‌ఎస్ ప్రత్యేకత



నెల్లూరు నగర నియోజకవర్గానికి చెందిన డాక్టర్ శివ ప్రసాద్ మొదటి నుంచి టీడీపీలో ఉన్నారు. పార్టీ ఏ పని అప్పజెప్పినా నిబద్ధతతో పూర్తి చేయడం ఆయన ప్రత్యేకత. ముఖ్యంగా పార్టీ పెద్ద కార్యక్రమాల్లో వైద్య సేవలన్నింటినీ ఆయనే పర్యవేక్షిస్తుంటారు. ప్రస్తుతం టీడీపీ డాక్టర్స్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడిగా ఉన్నారు. వివాదరహితుడిగా శివప్రసాద్ గుర్తింపు పొందారు. జిల్లాలోని ముఖ్య నేతలందరితోనూ ఆయనకు సన్నిహిత సంబంధాలున్నాయి. బీసీ సామాజిక వర్గానికి చెందిన ఆయన పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కీలకంగా పనిచేశారు. 2014లో నెల్లూరు నగర మేయర్ అభ్యర్థిగా బరిలోకి దిగారు. కార్పొరేషన్‌లో ఫ్లోర్ లీడర్‌గా పనిచేశారు. 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం చివర్లో ఏపీఎంఎస్ఐడీసీ చైర్మన్‌గా నియమితుల య్యారు. అయితే తర్వాత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎక్కువ కాలం ఆ పదవిలో కొనసాగలేక పోయారు. అయితే తాజాగా జలమార్గాలను అభివృద్ధి చేసే కీలకమైన ఇన్‌ల్యాండ్ వాటర్‌వేస్ అథారిటీ బోర్డు చైర్మన్‌గా నియమితులయ్యారు.

మాలేపాటి కుటుంబమంతా పార్టీ సేవలోనే...



కాగా కావలి నియోజకవర్గానికి చెందిన మాలేపాటి సుబ్బానాయుడు మొదటి నుంచి టీడీపీలో కొనసాగుతున్నారు. ఆయన కుటుంబం మొత్తం పార్టీకి విధేయతగా పని చేస్తోంది. గతంలో దగదర్తి మండలాధ్యక్షుడిగా ఆయన పనిచేశారు. 2019-24 మధ్య కాలంలో పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు కావలి నియోజక వర్గ ఇన్‌చార్జి బాధ్యతలను చేపట్టారు. అనేక ఇబ్బందులు ఎదురైనా కేడర్‌ను కాపాడుకోవడంలో మాలేపాటి సక్సెస్ అయ్యారు. గతేడాది సార్వత్రిక ఎన్నికల్లో కావలి టికెట్‌ను ఆశించారు. అయితే టికెట్ దక్కకపోయినా పార్టీ అధిష్ఠానం ఆదేశాలతో కావలిలో పార్టీ గెలుపు కోసం పనిచేశారు. ప్రస్తుతం టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా మాలేపాటి కొనసాగుతున్నారు. తాజాగా వ్యవసాయ యాంత్రీకరణలో కీలకమైన ఆగ్రో ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్‌గా ఆయన నియమితులయ్యారు. దీంతో ఇద్దరు సీనియర్ నాయకులకు గుర్తింపు లభించినట్లుగా పార్టీ కార్యకర్తలు భావిస్తున్నారు.

ఇష్టవాహనంపై ఇలవేల్పు వైభోగం

- పెంచలలో... గోవిందా.. మారుమోగిన కోన గిరులు
- రాష్ట్రం నలుమూలల నుంచి తరలివచ్చిన భక్తజనం



పెంచలకోనలో ఆదివారం రాత్రి జరిగిన శ్రీవారి గరుడసేవ

కొండాకోనా.. ఎటుచూసినా భక్తజనం... ఎవరినోట విన్నా పెంచలలో... గోవిందా..! అనే నామస్మరణే. భక్తకోటి పిలుపుతో పెనుశిల నృసింహుడు పరవశించిపోయాడు. ఆదివారం రాత్రి స్వర్ణమయకాంతులతో వెలిగిపోతున్న గరుత్మంతు డిపై కొలువుదీరిన శ్రీవారు అశేష జనవాహినిని కటాక్షించారు. తమ ఇలవేల్పు దివ్యస్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనంద డోలికల్లో మునిగితేలారు.



కోనలో శ్రీవారికి నిర్వహించిన సింహవాహన సేవ

రాపూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): కోనలో ఆదివారం నృసింహ జయంతి సందర్భంగా భక్తజనం పోటెత్తారు. రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడంతో కోన కిక్కిరిసింది. క్షేత్రంలో పాత భవనాలు కూల్చివేయడంతోపాటు పలుచోట్ల రహదారుల వెడల్పుచేయడం, ప్రాంగణాలు ఏర్పాటు చేయడంతోపాటు విస్తృతంగా చలువ పందిళ్లు వేయడంతో భక్తులు సేద తీరారు. పలువురు తలనీలాలు సమర్పించుకుని పుష్కరిణిలో పుణ్య స్నానాలు చేశారు. మరికొందరు అన్నదానం చేసి మొక్కులు తీర్చుకున్నారు. వేపినాపి పీహెచ్‌సీ ఆధ్వర్యంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు.

సింహవాహనంపై శ్రీవారి చిద్విలాసం

శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం స్వామివారిని పరిమళ భరిత పుష్పాలతో సుందరంగా అలంకరించారు. అనంతరం సింహవాహ నంపై కొలువుదీర్చి గ్రామోత్సవం నిర్వ హించారు. ఉదయం నుంచి ఆలయంలో శ్రీవార్లకు హోమాలు, స్నపనతిరుంజనం, తిరుచ్చి ఉత్సవం, ఊంజల్ సేవలు జరిగాయి. రాత్రికి సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, ఆకట్టుకున్నాయి.

బంగారు గరుడుడిపై ఊరేగింపు

పెనుశిల లక్ష్మీనరసింహుడు ఆదివారం రాత్రి తన ఇష్ట వాహనమైన బంగారు గరుడుడిపై ఆశీనులై మాడవీధుల్లో విహరించారు. స్వర్ణకాంతులతో మెరిసిపోతున్న పెంచలస్వామి దివ్య స్వరూపాన్ని తిలకించిన భక్తులు ఆనందడోలికల్లో మునిగిపోయారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ ఉత్సవ కమిటీ చైర్మన్ చెన్ను తిరుపాల్ రెడ్డి, ఈవో పోరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఉత్సవ కమిటీ సభ్యులు పీర్ల సోమయ్య యాదవ్, వెంకటరామయ్య, హజరత్ నాయుడు, తోట కిష్టయ్య, భార్గవరాం, నరసింహారావు, సుగుణమ్మ, నరసింహులు తదితరులు ఉన్నారు. ఆదివారం రాత్రి వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, నెల్లూరు ఆర్డీవో నగసంతోషి అనూష స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కాగా బ్రహ్మోత్సవాలలో సోమవారం ఉదయం తిరు కల్యాణ మహోత్సవం జరగనుంది. సాయంత్రం 6 గంటలకు రథోత్సవం, రాత్రికి గజవాహనసేవ, ఏకాంత సేవలు నిర్వహించనున్నారు.

రెండు ప్రమాదాలు.... 65 మందికి గాయాలు

- కూలి పనులకు వెళుతూ ట్రక్కు ఆటో అదుపు తప్పి 30 మందికి...
- బాధితులంతా కందుకూరు వాసులు
- కోనకు వెళుతుండగా ట్రక్కు బోల్తాపడి 35మందికి గాయాలు
- క్షతగాత్రులంతా అన్నమయ్య జిల్లా వాసులు

జిల్లాలో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు ప్రమాదాల్లో 65 మంది గాయపడ్డారు. కందుకూరు- పొన్నలూరు మార్గంలో ట్రక్కు ఆటో బోల్తాపడి కందుకూరుకి చెందిన 30 మంది కూలీలు గాయపడ్డారు. కాగా పెంచలకోన బ్రహ్మోత్సవాలకు వెళుతుండగా, జరిగిన ప్రమాదంలో 35 మంది అన్నమయ్య జిల్లా వాసులు గాయపడ్డారు. వివరాల్లోకి వెళితే..



కందుకూరు- పొన్నలూరు మార్గంలో బోల్తా పడిన ట్రక్కు ఆటో



గోనుపల్లి వద్ద జరిగిన ప్రమాదంలో గాయపడినవారు

కందుకూరు, మే 11(ఆంధ్రజ్యోతి): కందుకూరు - పొన్నలూరు రహదారిలో ముత్తరాసుపాలెం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో కందుకూరుకి చెందిన 30మంది కూలీలు గాయపడ్డారు. వ్యవసాయ పనుల కోసం కూలీలు వెళ్తున్న ట్రక్కు అదుపుతప్పి బోల్తా పడటంతో ఈ ప్రమాదం జరిగింది. పరిమితికి మించి కూలీలను ఎక్కించుకోవడం, అతివేగం కారణంగా వాహనం బోల్తా పడిందని గాయపడ్డ కూలీలు, ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఆ సమయంలో వాహనంలో ఉన్నవారంతా గాయపడగా ఎవరికీ ప్రాణాపాయం లేదు. గాయపడ్డ కూలీలందరిని కందుకూరు ఆసుపత్రిలోనూ, పట్టణంలోని వివిధ ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ చేర్పించి చికిత్స చేయిస్తున్నారు. పూర్తి వివరాలు అందాల్సి ఉంది.



కందుకూరు ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు

కోనకు వెళుతూ...

రాపూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): రాపూరు మండలం గోనుపల్లి గ్రామం వద్ద సుమారు 35 మందితో ప్రయాణిస్తున్న ట్రక్కు ఆటో బోల్తా పడి పదిమందికి తీవ్ర గాయాలయ్యాయి. వారిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. అన్నమయ్య జిల్లా పుల్లంపేట మండలం పెరియారవరం గ్రామానికి చెందిన పెంచలస్వామి భక్తులు కోన బ్రహ్మోత్సవాలకు వస్తుండగా, రాపూరు మండలం గోనుపల్లి వద్ద మోటార్ బైక్‌ను తప్పించబోయి ట్రక్కు ఆటో తిరగబడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న సుమారు 35 మందికిపైగా గాయాలు కాగా, 10 మందికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 వాహనాల ద్వారా రాపూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఇందులో శివయ్య (42), రాధమ్మ (30), నారాయణమ్మ (60) పరిస్థితి విషమంగా ఉండడంతో తిరుపతి జిల్లా గూడూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ విషయం తెలుసుకున్న రాపూరు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

బిల్లులు రాక... భూసేకరణ లేక !

- నిలిచిన సోమశిల ఆప్రాన్ పనులు... కదలని హైలెవల్ కెనాల్ వర్క్స్
- ఈ రెండూ అత్యవసరమే..
- ప్రభుత్వానికి జిల్లా అధికారుల నివేదిక
- మంత్రి ఆనం చొరవతో చాబోలుకు జీవం


సోమశిల ఆప్రాన్ సమాచారం	
ఎస్టిమేషన్ విలువ	: రూ.99.11 కోట్లు
ఇప్పటి వరకు జరిగిన పనులు	: 40 శాతం
పనులు చేసిన మొత్తం	: రూ.35 కోట్లు(సుమారు)
చెల్లించిన బిల్లులు	: రూ.22 కోట్లు
పెండింగ్ బిల్లులు	: రూ.13 కోట్లు(సుమారు)
పనులు ఆగడానికి సమస్య	: బిల్లుల పెండింగ్

హైలెవల్ కెనాల్ ఫేజ్-2 సమాచారం	
ఎస్టిమేషన్ విలువ	: రూ.532.98 కోట్లు
ఇప్పటి వరకు జరిగిన పనులు	: 35 శాతం
పనులు చేసిన మొత్తం	: రూ.201 కోట్లు
చెల్లించిన బిల్లులు	: రూ.5.47 కోట్లు
పెండింగ్ బిల్లులు	: రూ.195 కోట్లు
పనుల జాప్యానికి కారణం	: భూసేకరణ

నెల్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో కీలకమైన సోమశిల ఆప్రాన్, హైలెవల్ కెనాల్‌కు నిధులు, భూసేకరణే ప్రధాన సమస్యలుగా మారాయి. బిల్లుల పెండింగ్‌తో ఆప్రాన్ పనులు పూర్తిగా నిలిచిపోగా, భూసేకరణ సమస్యతో హైలెవల్ కెనాల్ పనులు ముందుకు సాగలేదు. జిల్లాకు జీవనాడి అయిన సోమశిల జలాశయం రక్షణకు ఆప్రాన్ పనులు పూర్తి చేయడం అత్యవసరం. అలాగే హైలెవల్ కెనాల్ పూర్తి చేయడం ద్వారా ఆత్మకూరు, ఉదయగిరి నియోజకవర్గాలు సస్యశ్యామలమవుతాయి.

నివేదించినా స్పందనేది ?

2020, 2021 సంవత్సరాల్లో పెన్నానదికి భారీగా వరదలు రావడంతో సోమశిల ఆప్రాన్ దెబ్బతింది. అప్పట్లోనే దాన్ని పరిశీలించిన నిపుణుల కమిటీ అత్యవసరంగా ఆప్రాన్ పునఃనిర్మాణం చేయాలని సూచించింది. 2022లో రూ.99.11 కోట్లతో పనులు మొదలుపెట్టారు. రూ.20 కోట్ల పనులు జరిగాక అప్పటి వైసీపీ ప్రభుత్వం కాంట్రాక్టర్‌కు బిల్లులు ఇవ్వలేదు. దీంతో పనులు ఆగిపోయాయి. ఏడాది పాటు మళ్లీ ప్రారంభం కాలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక కాంట్రాక్టర్‌కు పెండింగ్ బిల్లులు చెల్లించారు. ఆ తర్వాత సీఎం చంద్రబాబు నాయుడు స్వయంగా సోమశిలను పరిశీలించడంతో మళ్లీ పనులు ప్రారంభమ య్యాయి. ఈ మధ్యలో మరో రూ.12 కోట్ల మేర పనులు జరిగాయి. అయితే మళ్లీ బిల్లుల సమస్య ఏర్పడింది. కొన్ని నెలలుగా పెండింగ్ బిల్లులు మంజూరు కాకపోవడంతో కాంట్రాక్టర్ పనులు ఆపేశారు. ఆప్రాన్ పనులు అత్యవసరంగా చేపట్టాల్సి ఉందని, రూ.70 కోట్ల బడ్జెట్ కేటాయించాలని జిల్లా ఉన్నతాధికారులు రాష్ట్ర ప్రభుత్వానికి నివేదించారు. ప్రభుత్వ స్పందన కోసం ఎదురుచూస్తున్నారు.



వరదలకు దెబ్బతిన్న సోమశిల ఆప్రాన్(ఫైల్)

మంత్రి ఆనం చొరవతో కదలిక

ఈ ఫేజ్-2 కిందే చాబోలు రిజర్వాయర్‌ను నిర్మించాల్సి ఉండగా, ఆ ప్రాజెక్టు పనులు అసలు మొదలుకాలేదు. దీంతో ఈ వర్కును రద్దు చేశారు. అయితే మంత్రి ఆనం రామనారాయణరెడ్డి చొరవ తీసుకోవడంతో ఈ వర్కు రద్దు నిర్ణయాన్ని వెనక్కు తీసుకున్నారు. హైలెవల్ కెనాల్‌కు 3482 ఎకరాలను సేకరించాల్సి ఉండగా, 1200 ఎకరాలను ఇప్పటి వరకూ సేకరించారు. మరో 2257 ఎకరాలకు సేకరించాల్సి ఉంది. 2025-26 బడ్జెట్‌లో ఈ భూసేకరణకు రూ.50 కోట్లను కేటాయించారు. అయితే ఈ మొత్తం సరిపోదని, మరో రూ.70 కోట్లు అవసరమవుతుందని జిల్లా అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. ప్రస్తుతం కేటాయించిన రూ.50 కోట్ల మేరకైనా అధికారులు భూసేకరణ వేగంగా పూర్తి చేయాల్సి ఉంది.

రూ.195 కోట్ల బిల్లులు పెండింగ్

సోమశిల హైలెవల్ కెనాల్ ఫేజ్-2 కింద రూ.532.98 కోట్లతో 2020లో పను లు మొదలుపెట్టారు. ఈ ప్రాజెక్టులో భాగంగానే రెండు బ్యాలెన్సింగ్ రిజర్వా యర్లను నిర్మించాల్సి ఉంది. ఈ కెనాల్ పూర్తయితే దుత్తలూరు, వింజమూరు, ఉదయగిరి, మర్రిపాడు మండలాల్లో 46,453 ఎకరాలు సాగులోకి వస్తాయి. అలానే ఆయా ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా తీరుతుంది. ఇప్పటి వరకూ 35 శాతం మేర పనులు జరగ్గా రూ.200 కోట్లు ఖర్చు చేశారు. ప్రస్తుతం రూ.195 కోట్ల వరకూ పెండింగ్ బిల్లులు చెల్లించాల్సి ఉంది.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	140
స్కిన్ చికెన్	250
స్కిన్‌లెస్	276
కోడిగుడ్ల ధర (100)	500

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ.9316
వెండి కిలో ధర	రూ. 99,100
వెండి ఒక గ్రాము	రూ.102.10

ఉత్తర కాలువకు నీటి విడుదల పెంపు

అనంతసాగరం, మే 11 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నుంచి ఉత్తర కాలువకు విడుదల చేస్తున్న నీటి మోతాదును ఆదివారం పెంచారు. 30 నుంచి 100 క్యూసెక్కులు విడుదల చేసినట్లు ఇంజనీర్లు తెలిపారు. పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా, 49.706 టీఎంసీలు నిల్వ ఉన్నట్లు చెప్పారు. దక్షిణ కాలువకు 50, పెన్నాడెల్టాకు 4,030 క్యూసెక్కులు కొనసాగుతున్నాయి.

రూ.8లక్షల సీఎం సహాయనిధి చెక్కు అందజేత



షకీలాకు రూ.8 లక్షల సీఎం సహాయనిధి చెక్కును అందచేస్తున్న టీడీపీ నేతలు

కావలి, (ఆంధ్రజ్యోతి): నోటిక్యాన్సర్‌తో బాధపడుతున్న పట్టణంలోని 26వ వార్డుకు చెందిన షేక్ షకీలాకు చికిత్స నిమిత్తం ముందస్తు సహాయం కింద రూ.8లక్షల సీఎం సహాయనిధి చెక్కును అందజేశారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో షకీలాకు టీడీపీ పట్టణ అధ్యక్షుడు గుత్తికొండ క్రిషోర్, గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, గంగినేని వెంకటేశ్వర్లు చేతుల మీదుగా ఎల్‌వోసీ చెక్కును అందజేశారు. చెక్కు అందచేసిన ఎమ్మెల్యేకు బాధితుడు కృతజ్ఞతలు తెలిపారు.

కుట్టు శిక్షణ మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం

కావలి టౌన్, మే 11 (ఆంధ్రజ్యోతి): సంయుక్త సేవాసంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణ కేంద్రంలో 3నెలలు శిక్షణ పొందిన మహిళలకు ఆదివారం సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. సంస్థ అధ్యక్షుడు సురేంద్ర అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో తిరులు మాట్లాడారు. కుట్టు శిక్షణ పొందిన మహిళలు నేర్చుకున్న నైపుణ్యంతో పనిచేసుకుంటూ జీవనోపాధి పొందాలన్నారు. అరగల ఉదయ భాస్కర్ పేద మహిళ జీవనోపాధికి కుట్టుమిషన్ అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కందికట్టు నారాయణ తల్లి హైమావతమ్మ జ్ఞాపకార్థం సంస్థలో చదువుతున్న విద్యార్థులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో అజిత్‌బాబు, ప్రసాదరావు, ఖాదర్‌బాషా, శివప్రసాద్, కుట్టు శిక్షణా ట్రైనర్ ఆయేషా తదితరులు పాల్గొన్నారు.

అదుపుతప్పి కారు బోల్తా

● ఒకరు మృతి - పలువురికి తీవ్ర గాయాలు



సంఘటనా స్థలంలో షేక్ నిస్సార్ మృతదేహం

వలేటివారిపాలెం, మే 11 (ఆంధ్రజ్యోతి): కారు అదుపుతప్పి బోల్తా పడడంతో ఒకరు మృతి చెందిగా పలువురికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని చుండి జాతీయ రహదారిపై విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట శనివారం అర్ధరాత్రి జరిగింది. ఈ ప్రమాదం లో అనంతపురం జిల్లా పెనుగొండ మండలం గుట్టూరు గ్రామానికి చెందిన షేక్ నిస్సార్ (60) అక్కడికక్కడే మృతిచెందగా కారులో ఉన్న సంపూర్ణతో పాటు పలువురికి తీవ్ర గాయాలయ్యాయి. వీరు విజయవాడ నుంచి అనంతపురం వెళ్తుండగా ఈప్రమాదం జరిగింది. కారులో మొత్తం 11 మంది ప్రయాణికులు ఉన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే డ్రైవర్ పరారయ్యాడు. సమాచారం తెలుసుకున్న వలేటివారిపాలెం ఏఎస్‌ఐ బ్రహ్మయ్య సిబ్బందితో కలిసి సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం కందుకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, క్షతగాత్రులను 108లో కందుకూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ తెలిపారు.

రోడ్డుప్రమాదంలో ఒకరి మృతి

గుడ్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందిన సంఘటన మండలంలోని మోచర్ల సమీపంలో జాతీయ రహదారిపై శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు, గ్రామస్థుల వివరాల మేరకు... ఉలవపాడు మండలం చాగొల్లుకు చెందిన దుగ్గిరాల వెంకటేశ్వర్లు (45) శనివారం మండలంలోని మోచర్లలో వారి బంధువుల అంత్యక్రియలకు హాజరై రాత్రికి ద్విచక్ర వాహనంపై చాగొల్లుకు తిరిగి వెళ్తుండగా నెల్లూరు వైపు నుంచి ఒంగోలుకు వెళ్తున్న కారు ఢీకొనడంతో వెంకటేశ్వర్లు అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకట్రావు తెలిపారు.

వాస్తవం తెలియకుండా ఆరోపణలు తగదు

● మాలేపాటి నాగేశ్వరరావు

బిట్రగుంట, మే 11 (ఆంధ్రజ్యోతి): విజయ గణపతి స్వామి.వైసీపీ నేతలు చేసినవి అసత్య ఆరోపణలని మనసా-వాచా కర్మణ ప్రమాణం చేస్తున్నానని టీడీపీ మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు అన్నారు. బోగోలు బజారులోని విజయగణపతి ఆలయంలో మాలేపాటి నాగేశ్వరరావు ఆదివారం ప్రత్యేక పూజలు చేసి స్వామి సన్నిధిలో ప్రమాణం చేశారు. నీరుచెట్టు పనుల నుంచి వచ్చిన డబ్బుతో ఇల్లు, సిమెంటు దుకాణం, బ్రాంది షాపు పెట్టానని చెప్పడం విచారకరం అన్నారు. క్రమశిక్షణ గల టీడీపీలో పనిచేస్తున్నామని అన్యాయాలు, అక్రమాలకు పాల్పడే నాయకులు ప్రోత్సహించరని చెప్పారు. తాము ప్రజాప్రయోజనాల కోసం పనిచేసే సీఎం చంద్రబాబునాయుడు బాటలో నడిచే ఎమ్మెల్యే దగుమాటి వెంకట కృష్ణారెడ్డి వెంట నడిచే సైనికులం అన్నారు. కార్యక్ర మంలో టీడీపీ నేతలు వెంకటేశ్వరరెడ్డి, వెంకయ్య, రఘురాం నాయుడు, వెంకటేశ్వర్లు, సుధీర్ బాబు, ప్రభాకర్, సుధాకర్‌యాదవ్, విజయ్ కుమార్ యాదవ్, ఆదిశేషయ్య, పద్మలత ఉన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు సాధించాలి

● మంత్రి డోలా బాలవీరాంజనేయ స్వామి



గుడ్లూరులో అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి బాలవీరాంజనేయ స్వామి, ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

గుడ్లూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): అంబేడ్కర్ ఆశయాలు సాధించాలని, రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాలవీరాంజనేయ స్వామి అన్నారు. మండల కేంద్రమైన గుడ్లూరులో స్థానిక అంబేడ్కర్ కాలనీ వాసుల ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన నూతన అంబేడ్కర్ విగ్రహాన్ని ఆయనతో పాటు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావులు ఆదివారం ఆవిష్కరించి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ నేటి సమాజంలో బడుగు బలహీన వర్గాలు ఎంతో కొంత అభివృద్ధి సాధిస్తున్నారంటే, అది అంబేడ్కర్ పుణ్యమేనన్నారు. కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు మాట్లాడుతూ అంబేడ్కర్ చేసిన రాజ్యాంగ రూపకల్పన ద్వారానే సమాన హక్కులు పొందగలుతున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపి మాల కార్పోరేషన్ చైర్మన్ పెదపూడి విజయ్‌కుమార్, ఎంపీపీ పులి రమేష్, గ్రామ సర్పంచ్ పాలకీర్తి శంకర్, బండి గోవిందయ్య, బద్దిపూడి జయరావు, ఉపాధ్యాయులు వెంకట్రావు, మేకపోతుల రామయ్య, కావలి ఏసుదాస్, షరై మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి కృషి చేయాలి



పెదపవని జడ్పీ హైస్కూల్‌లో సమావేశమైన పూర్వ విద్యార్థులు

లింగసముద్రం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పెదపవనిలోని భోలేరావు జడ్పీ హైస్కూల్ అభివృద్ధికి పూర్వ విద్యార్థులు కృషి చేయాలని విశ్రాంత ప్రధానోపాధ్యాయుడు ముత్తినేని మాల్యాద్రి కోరారు. ఆదివారం 1993-98 విద్యా సంవత్సరంలో చదివిన పూర్వ విద్యార్థులు హైస్కూల్‌లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా హైస్కూల్‌కు వాటర్ డిస్పెన్సరీని బహూకరించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు ధనుం మాధవరావు, మధుబాబు, కె సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వీరజవాన్ మురళీనాయక్‌కు ఘన నివాళి



నివాళులర్పిస్తున్న బిట్రగుంట వాకర్స్ సభ్యులు

బిట్రగుంట, మే 11 (ఆంధ్రజ్యోతి): దేశ ప్రజల రక్షణ కోసం యుద్ధభూమిలో వీరమరణం పొందిన వీర జవాన్ మురళీ నాయక్ ఆత్మకు శాంతి చేకూరాలని బిట్రగుంట వాకర్స్ అసోసి యేషన్ సభ్యులు నివాళులర్పించి కొద్దిసేపు మౌనం పాటించారు. బోగోలు మండలం రైల్వే బిట్రగుంట ఫుట్‌బాల్ క్రీడా మైదానంలో ఆదివారం అసోసియేషన్ అధ్యక్షుడు బర్నాడ్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫౌండర్ అధ్యక్షుడు శ్రీనివాసులు, మాజీ అధ్యక్షుడు స్పర్జన్‌రాజ్, గౌరవాధ్యక్షుడు శ్రీనివాసులు యాదవ్ ఉన్నారు. కార్యక్రమంలో సీనియర్‌వాకర్స్ సత్యనారాయణ, సుధాకర్, శ్రీనివాసులు, మాస్టర్ రవిగన్, శ్యాంసుధాకర్ తదితరులు ఉన్నారు.

రెడ్‌క్రాస్ జీవిత పోషక సభ్యులకు సత్కారం



రెడ్‌క్రాస్ జీవిత పోషక సభ్యులను సత్కరిస్తున్న ప్రముఖులు

కావలిటౌన్, మే11(ఆంధ్రజ్యోతి) రెడ్‌క్రాస్ జీవిత పోషక సభ్యత్వం స్వీకరించిన సభ్యులను ఆదివారం రెడ్‌క్రాస్ ప్రధాన వైద్యాధికారి బెజవాడ రవికుమార్ మినీస్టేడియం మైదానంలో సత్కరించారు. ప్రపంచ రెడ్‌క్రాస్ దినోత్సవాల్లో భాగంగా ఆరోగ్య అవగాహన సదస్సు నిర్వహించి రక్తపోటు మధుమేహం, సంబంధిత వ్యాధుల గురించి అప్రమత్తత అవసరం అని అవగాహన కల్పించారు. ఉచిత రక్తగ్రూప్ పరీక్షలు హిమగ్లోబిన్ శాతం, రక్తపోటు షుగర్ పరీక్షలు నిర్వహించారు. రక్తపోటు నివారణకు జాగ్రత్తలు తీసుకోకుండా నిర్లక్ష్యం చేస్తే మెదడులో రక్తస్రావంతో పాటు పక్షవాతం వచ్చే ప్రమాదం ఉందన్నారు. మధుమేహం, గుండె సంబంధిత వ్యాధులపై ఎప్పటికపుడు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరంలో అనేకమంది వాకర్స్ రక్తదానం చేశారు. ఇటీవల రెడ్‌క్రాస్ జీవిత పోషక సభ్యత్వం తీసుకున్న ఉమాచంద్, జయచంద్రా నాయుడు, డాక్టర్ విజయభాస్కర్ రెడ్డి, చిన్నిజాన్, జనిగర్ల మనోహర్ యాదవ్, వెంకట శేషాచలపతిలను సత్కరించారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ చైర్మన్ రవిప్రకాష్, వైస్ చైర్మన్ హరనారపరెడ్డి, కోశాధికారి మధుసూదన్‌రావు, శ్రీధర్, రమేష్ రెడ్డి పాల్గొన్నారు.

గిరిజనులకు అన్నదానం



గిరిజనులకు అన్నదానం చేస్తున్న పయ్యావుల

ఆత్మకూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని వెంకట్రావుపల్లి గిరిజన కాలనీలో ఆదివారం ఐక్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో గిరిజనులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఐక్య ఫౌండేషన్ చైర్మన్ పయ్యావుల రామకృష్ణ చౌదరి మాట్లాడుతూ పట్టణంలోని బ్రాహ్మణ వీధికి చెందిన శివుని రమణమ్మ మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన కుమారుడు చల్లా రవీంద్రారెడ్డి సౌజన్యంతో అన్నదాన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యడ్ల విష్ణువర్ధన్‌రెడ్డి, కార్తీక్‌చౌదరి, తూమాటి శ్రీధర్‌రెడ్డి, అంగన్‌వాడీ కార్యకర్త పెంచలమ్మ, ఐక్య ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల అపూర్వ కలయిక

కొండాపురం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని సాయిపేట దామా చినబాబు మెమోరియల్ జడ్పీ ఉన్నత పాఠశాలలో ఆదివారం 2000-2001లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. పది పూర్తిచేసి 25ఏళ్ల పూర్తవుతుండగా పాఠశాలలో కలసినవారు ఒకరి నొకరు ఆప్యాయంగా పలకరించు కుంటూ అప్పటి అనుభూతులను గుర్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా విద్య నేర్పించిన గురువులకు సత్యం, శ్రీనివాసరెడ్డి, శ్యామలను సన్మానించారు. ఈ సందర్భంగా పాఠశాలకు 6 ఫ్యాన్లు అందజేశారు.


భక్తిశ్రద్ధలతో చండీయాగం



చండీయాగంలో పాల్గొన్న భక్తులు

సంగం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొరిమెర్ల నాగవరపమ్మ ఆలయంలో జరుగుతున్న జాతర మహోత్సవంలో భాగంగా రెండవ రోజు ఆదివారం చండీయాగం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈసందర్భంగా మూలవిరాట్‌కు అభిషేకాలు నిర్వహించి పూలతో అలంకరించి గణపతి, మహాన్యాస పూర్వక అభిషేకాలు తదితర పూజలతోపాటు చండీయాగం నిర్వహించారు. అనంతరం పూర్ణాహుతి సమర్పించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

సీతారాముల గ్రామోత్సవం



పూజల్లో పాల్గొన్న భక్తులు

అనంతసాగరం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంగంపల్లి కోదండరాముని ఆలయంలో వార్షిక ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈసందర్భంగా శనివారం రాత్రి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం సీతారామ లక్ష్మణ విగ్రహాలను గ్రామంలో ఊరేగించారు.

వైభవంగా హనుమంతసేవ

వింజమూరు, మే 11 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగొండ్ల గ్రామంలో నీలగిరి పర్వతంపై వున్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం స్వామివారికి హనుమంత సేవ కార్యక్రమం వైభవంగా జరిగింది. పడమటివీధి వారు ఉభయకర్తలుగా స్వామివారికి అభిషేకాలు, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని హనుమంత వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమాలను ఆలయ పాలక మండలి చైర్మన్ ఎల్‌సీ కొండారెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధి, టీడీపీ పటిష్టతకు కృషి చేయాలి

● ఎమ్మెల్యే కాకర్ల సురేష్



టీడీపీలోకి చేరిన వైసీపీ శ్రేణులతో ఎమ్మెల్యే కాకర్ల

సీతారామపురం, మే 11 (ఆంధ్రజ్యోతి): గ్రామాల అభివృద్ధితో పాటు పార్టీ పటిష్టతకు ప్రతి కార్యకర్త కృషిచేయాలని ఉదయగిరి ఎమ్మెల్యే కాకర్ల సురేష్ పిలుపునిచ్చారు. మండలంలోని సింగారెడ్డిపల్లి, అయ్యవారిపల్లి, గంగవరం, పోలంగారిపల్లి, దేవమ్మచెరువు, బసినేనిపల్లి గ్రామ పంచాయతీల్లో టీడీపీ గ్రామసభలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కాకర్ల హాజరుకాగా గ్రామాలలో సమస్యలను ఆయన దృష్టికి తీసుకురావడంతో పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం గ్రామసభ నిర్వహించి మండల, గ్రామ నాయకుల సమక్షంలో గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అందరి అజెండా టీడీపీని బలోపేతం చేయడమేనని తెలిపారు. కాగా, అయ్యవారిపల్లి గ్రామ పంచాయతీలో కాకర్ల సురేష్ సమక్షంలో 50 మంది వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం సంగసానిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన గురవయ్యస్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో ఆయన పాల్గొని స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ కప్పా ప్రభాకర్‌రాజు, మాజీ కన్వీనర్ మొత్తంశెట్టి చెన్నకేశవులు, మండల కోఆర్డినేటర్ చింతల శ్రీనివాసులు, మండల క్లస్టర్ ఇన్‌చార్జి వెంగళశెట్టి వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ జిల్లా కార్యదర్శి జాషువా, మండల ప్రధాన కార్యదర్శి పిడుగు రమేష్, ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ బాబు, జనసేన నాయకుడు భోగినేని కాశీరత్తయ్య, మాజీ జడ్పిటిసి కలివెల జ్యోతి, మండల టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్సాహంగా పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఉదయగిరి, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిజ్జంపల్లి జడ్పీ ఉన్నత పాఠశాలలో 2004- 05 విద్యా సంవత్సరంలో 10వ తరగతి చదివిన విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం హెచ్‌ఎం నాయబ్ రసూల్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా గురువులను సన్మా నించారు. సహపంక్తి భోజనాలు చేశారు. ముందుగా సర్వేపల్లి రాధాకృష్ణన్, సరస్వతిదేవి చిత్రపటాలకు పూలమాలలు వేశారు. కార్య క్రమంలో ఎంఈవోలు మస్తాన్‌వలి, శ్రీని వాసులు, విశ్రాంత ఎంఈవో గానుగపెంట ఓబుల్‌రెడ్డి పూర్వ విద్యార్థినీ, విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అహ్మద్‌బాషాకు జాతీయ స్థాయి పదవి

ఉదయగిరి, మే 11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆస్థాన ఖాదరీయా సంస్థాన అధ్యక్షుడు షేక్ అహ్మద్‌బాషాకు జాతీయ స్థాయి ఎఐయస్‌యస్‌సి స్వచ్ఛంద సంస్థలో ప్రధాన కార్యదర్శి పదవి వరించింది. రాజస్థాన్ రాష్ట్రంలోని అజ్మీరులో శనివారం జరిగిన సదస్సులో అహ్మద్‌బాషా సంస్థ చైర్మన్ సయ్యద్ నసిరుద్దీన్ చిష్టి జారీచేసిన ధ్రువీకరణ పత్రాన్ని అందుకున్నారు. ఆయన శిష్యులు, అభిమానులు హర్షం వ్యక్తం చేశారు.

50 మంది యువత రక్తదానం



రక్తదాన శిబిరంలో పాల్గొన్న ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్, వైస్‌చైర్మన్లు

ఆత్మకూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): స్థానిక కెకెఆర్ ఆసుపత్రి ప్రాంగణంలో మున్సిపల్ కౌన్సిలర్ షేక్ గౌస్‌బాష కుమారుడు షేక్ తౌహీద్ జయంతిని పురస్కరించుకుని ఆదివారం ఆయన మిత్రులు స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఏర్పాటుచేశారు. ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ మహ్మద్ సాదిక్ హుస్సేన్, వైస్‌చైర్మన్ చంద్రా వెంకటసుబ్బానాయుడు ముఖ్య అతిథులుగా పాల్గొని రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. 50 మంది యువత ఈ కార్యక్రమంలో పాల్గొని రక్తదానం చేశారు. అనంతరం స్థానిక బిఎస్‌ఆర్ సెంటర్‌లో 250 మందికి బిర్యాని ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై మీరామొహిద్దీన్, డాక్టర్ బి శివకృష్ణ, ప్రభుత్వ జిల్లా వైద్యశాల బ్లడ్ బ్యాంక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

భవాని అమ్మవారికి అభిషేకాలు

అనంతసాగరం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సంజీవనగరం జమ్మిన గుంటలో నూతనంగా వెలసిన భవాని అమ్మవారి ఆలయంలో ఆదివారం అభిషేకాలు నిర్వహించారు. 14 రోజుల వేడుకల్లో భాగంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

అబ్దుల్ అజీజ్‌కు సన్మానం

వింజమూరు, మే 11 (ఆంధ్రజ్యోతి): మండల బాలకృష్ణ ఫ్యాన్స్ అధ్యక్షుడు షేక్ షరీఫ్, చంద్రపడే సాగునీటి సంఘం అధ్యక్షుడు వేమూరి దొరస్వామి నాయుడు నెల్లూరు జిల్లా టీడీపీ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వింజమూరు మండల సమస్యలను ఆయనకు వివరించారు.

ఘనంగా గంగమ్మకు పాలపొంగళ్లు



పొంగళి సామగ్రితో ఊరేగింపుగా బయలుదేరిన భక్తులు

ఉదయగిరి, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం గ్రామంలో జలాశయం వద్ద నూతనంగా నిర్మించిన గంగమ్మతల్లి ఆలయంలో భక్తులు ఆదివారం అమ్మవారికి పాల పొంగళ్లు పొంగించి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం పొంగళి సామాగ్రిని కొత్త బుట్టల్లో పెట్టుకొని బాణాసంచా పేలుళ్లు, డప్పు వాయిద్యాల నడుమ ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని ఆలయ ప్రదక్షిణల అనంతరం పొంగళ్లు పొంగించి అమ్మవారికి నైవేద్యాలు సమర్పించారు. అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



మంత్రి ఆనం చేతుల మీదగా చెక్కును అందుకుంటున్న పంచేటి శ్రీనివాసులు

చేజర్ల, మే 11 (ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు నియోజకవర్గంలో వివిధ ఆరోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్య ఖర్చుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి ఆదివారం ఆత్మకూరు ఎమ్మెల్యే, రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ చేశారు. ఆదివారం నెల్లూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన ప్రత్యేక కార్యక్రమంలో నియోజకవర్గంలోని 22 మందికి రూ. 37,25,213 చెక్కుల రూపంలో బాధితులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆనం మాట్లాడుతూ ఆత్మకూరు నియోజకవర్గంలో ఇప్పటివరకు 205 పేద కుటుంబాలకు 2కోట్ల 60లక్షల రూపాయల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేసినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం సామాన్య ప్రజలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని ఆయన తెలిపారు.

ఘనంగా గంగమ్మకు మహా కుంభాభిషేకం



కుంభాభిషేకం చేస్తున్న అర్చకులు

సంగం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మర్రిపాడులో ఉన్న గంగమ్మ ఆలయంలో ఆదివారం మహా కుంభాభిషేకం ఘనంగా జరిగింది. ఈసందర్భంగా ఆలయంలో పోతురాజు, పోలేరమ్మ విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ శిఖర మహాకుంభాభిషేకం వైభవంగా జరిగింది. కుంభాభిషేక జలాల కోసం భక్తులు ఆలయం చుట్టూ బారులు తీరి జలాలను తలపై చల్లుకున్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ల దగ్ధం

● విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనంతసాగరం, మే 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆమనిచిరవెళ్లలో శనివారం రాత్రి ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయాయి. దీంతో ఆదివారం మధ్యాహ్నం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడంతో గ్రామస్థులు ఇబ్బందులు పడ్డారు. ఈవిషయం గురించి డిస్కం ఏఈ సురేష్‌బాబును వివరణ కోరగా.. ఏసీల వినియోగం ఎక్కువ కావడంతో సమస్య ఏర్పడిందన్నారు. కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుచేసి సమస్యను పరిష్కరించామన్నారు.